తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
21 Glorious years
epaper.vaartha.com WWW.VAARTHA.COM విజయవాడ fb.com/vaartha
PUBLISHED FROM VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
3-8-2017 గురువారం సంపుటి :23 సంచిక : 183 పేజీలు :12 వెల : 5.00


బుధవారం రాజధాని నగర రహదారుల నమూనాను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

అమరావతి అభివృద్ధికి మూడేళ్లలో
రూ.30వేల కోట్లు

మౌలిక వసతులకు సిఆర్డీఎ నిధుల సమీకరణ
25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సిఎం నివాసం
800చదరపు అడుగుల విస్తీర్ణంలో క్లాస్ 4 ఉద్యోగులకు నివాసాలు: ప్రతిపాదించిన సిఆర్డీఎ
విజయవాడలో లైట్ మెట్రో రైల్ నిర్మాణానికి ప్రణాళికలు

విజయవాడ, ఆగస్టు2 ప్రభాతవార్త: అమరావతిలో మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనుల కోసం రానున్న మూడేళ్లకు రూ.30వేల కోట్లు అవసరం కాగలవని అంచనా వేయగా, అందులో లోటుగా కనిపిస్తున్న రూ.7,300కోట్ల నిధులను వివిధ మార్గాలలో సమకూర్చుకోవడానికి సన్నద్ధం అవుతున్నట్టు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ముఖ్యమంత్రికి నేవిదించింది. బుధవారం ఉదయం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సీఆర్డీఏ వారాంతపు సమీక్షా సమావేశంలో అధికారులు ఈ వివరాలను ఆయన ముందుంచారు.

అమరావతి అభివృద్ధికి సమకూరిన రూ.22,700కోట్లు: హడ్కో ద్వారా రూ.7,500కోట్లు, బహుళ సంస్థల ద్వారా రూ.3,200కోట్లు, కేంద్ర ప్రభుత్వ గ్రాంటు రూ.2,500కోట్లు, స్మార్ట్ సిటీ నిధులు రూ.100 కోట్లు, నిట్, ఎస్ఆర్ఎం వంటి సంస్థలకు భూముల అందజేత ద్వారా సమకూరిన రూ.400కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు రూ.3,800కోట్లు సహా గత డిసెంబర్ మాసంలో ఆమోదించిన రూ.9వేల కోట్లు కలుపుకుంటే మొత్తం రూ.22,700కోట్లు సమకూరుతున్నాయి. ఇంకా, మరో రూ. 7,300కోట్ల నిధులకోసం మార్గాలు అన్వేషిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 7రకాల మార్గాలలో ఈ మొత్తం సమకూర్చుకోవాలని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ అధికారులు ఇంటి అద్దె భత్యం ద్వారా సమకూరే నిధుల ప్రాతిపదికగా వారి నివాస సముదాయాల ≫2

నంద్యాలలో నువ్వా-నేనా

-టిడిపి, వైఎస్సార్సీ మధ్య ఉత్కంఠ పోరు- పోటాపోటీగా నాయకులకు గాలం
-పట్టణ ఓటర్లపై ప్రధాన దృష్టి -ప్రభావితం చేయనున్న డబ్బు పంపిణీ

బల్లేపల్లి శ్రీనివాసరావు/అమరావతి

రాయలసీమలో కోనసీమను తలపించే నంద్యాల శాసనసభ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ తెలుగుదేశం, ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ జీవన్మరణ పోరాటం చేస్తున్నాయి. మరో ఏడాదిన్నర కాలంలోనే రాబోతున్న పూర్తి స్థాయి ఎన్నికలను తీవ్ర ప్రభావితం చేసే ఈ ఉప ఎన్నికల్లో విజయం కోసం ఇరు పార్టీల ముఖ్యనేతలంతా నంద్యాలలో మకాం పెట్టి ఓటర్లను ఆకర్షించేందుకు రాత్రింబవళ్లు పరిశ్రమిస్తున్నారు. సుమారు పక్షం రోజులుగా ఇరు పార్టీలు వ్యూహప్రతి వ్యూహాలతో పోరాడుతున్నారు. రెండు పార్టీల పోరు నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రధాన నేతల పార్టీ ఫిరాయింపులు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఫిరాయింపులకు, ఉప ఎన్నికలకు విడదీయరాని సంబంధం ఏర్పడింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన భూమా నాగిరెడ్డి ఆ తర్వాత నియోజకవర్గం అభివృద్ధి కోసమంటూ తెలుగుదేశంలో చేరడం, శాసనమండలి ఎన్నికల ప్రచారంలో ముమ్మురంగా శ్రమిస్తూ ఎవరూ ఊహించని విధంగా గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఉప ఎన్నికలు అనివార్యమైన సంగతి తెలిసిందే. తమను నమ్ముకున్న నేతను, ఆయన ఆశయాలను నెరవేర్చాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ భూమా అఖిలప్రియకు మంత్రి పదవి ఇవ్వడంతో నంద్యాలలో వేడిరాజుకుంది. ఉప ఎన్నికల్లో తనకు పోటీచేసే అవకాశం దక్కక భంగపడ్డ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరి ఎన్నికలకు సై అంటూ పోటీని రసవత్తరంగా మార్చారు. తాజాగా ఆయన సోదరుడు, శాసనమండలి సభ్యుడు శిల్పా చక్రపాణిరెడ్డి హఠాత్తుగా తెలుగుదేశం పార్టీని వీడి తన సోదరుని గెలుపు కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పక్షాన చేరి రాజకీయాన్ని మరింత వేడెక్కించారు. పక్షం రోజులుగా నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్ల పార్టీ ఫిరాయింపుల ఉత్కంఠ కొనసాగుతుండగా తాజా చక్రపాణిరెడ్డి అంశం మరింత చర్చనీయాంశంగా మారిది. తాజా రాష్ట్ర రాజకీయ పరిస్థితుల్లో నంద్యాలలో భూమా బ్రహ్మానందరెడ్డి, శిల్పా మోహన్‌రెడ్డి ఇరువురూ ఉపఎన్నికల్లో పోటీ పడుతున్నప్పటికీ వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన పార్టీలకు ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది.

ముస్లింల కరుణ ఉంటేనే: సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉన్న నంద్యాల శాసనసభ నియోజకవర్గంలో పట్టణ ఓటర్లే అత్యధికం. నంద్యాల మున్సిపాలిటీ, నంద్యాల, గోస్పాడు మండలాల పరిధిగా గల ఈ నియోజకవర్గంలో దరిదాపు 110 వివిధ కులాలకు చెందిన వారు నివశిస్తుండగా, ఇందులో నాలుగు వంతుల్లో ఒక వంతు ముస్లింలు ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించేనేమో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవలనే మాజీ మంత్రి ఎన్.ఎండీ.ఫరూక్‌కు శాసనమండలిలో చోటు కల్పించారు. మూడు సార్లు నంద్యాల నియోజకవర్గానికి శాసనసభ్యునిగా పనిచేసిన ఫరూక్‌పై తెలుగుదేశం చాలా ఆశలు పెట్టుకుంది. ముస్లింల తర్వాత స్థానంలో ఎస్సీలు, రెడ్లు, బలిజ, వైశ్య కులాలు వారు ఉండగా, అన్ని బలహీన వర్గాల కులాలను కలిపితే సుమారు 70 వేల ఓట్లకు పైగా ఉంటాయి. అత్యధిక శాతం ప్రజలు పేదలే. కష్టపడి జీవించే వారే అధికం. బడుగు, బల హీన వర్గాల ప్రజలు ఎక్కువగా ఉండే ఈ నియో జకవర్గంలో ఓటర్లను ద్వితీయశ్రేణి నాయకుల బాగా ప్రభావితం చేస్తారు. అందుకే ప్రస్తుత ఉప ఎన్నికల నేపథ్యంలో ద్వితీయశ్రేని నాయకులను తమవైపు తిప్పుకోవడానికి పార్టీలు సామ,దాన, బేధ, దండోపాయాలను కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఉప ఎన్నికల్లో డబ్బు పంపిణీ చాలా ఎక్కువగా జరుగుతుందన్న ప్రచారంఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అది ఇంకా తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నాయని, దీని ప్రభావం అభ్యర్థి విజయంలో చాలా కీలకం కానుందని అభిప్రాయం.

అభివృద్ధి పనులపై టిడిపి ఆశలు: తెలుగుదేశం పార్టీ నంద్యాల ఓటర్లను ఆకట్టుకోవడంలో అభివృద్ధినే నమ్ముకుంది. భూమ నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి మృతితో వారి పిల్లలపై ఓటర్లలో ఉండే సానుభూతి ప్రభావం కొంత ఉండనున్నా, అభివృద్ధి అంశం అత్యంత కీలకం కానుంది. ఈ విషయాన్ని అధికార పార్టీ ఒక సర్వే ద్వారా కూడా ముందే తెలుసుకునే ఎన్నికల ప్రకటన వెలువడక ముందే నంద్యాలకు వరాలజల్లు కురిపించింది. సుమారు 2వేల కోట్ల రూపాయల అంచనా విలువ గల అభివృద్ధి పనులను ప్రకటించింది. కొన్ని పనులు ≫2



టిడిపి నుంచి శిల్పా
చక్రపాణి జంప్
పార్టీకి రాజీనామా చేసి సిఎం చంద్రబాబుకు లేఖ
నేడు వైఎస్సార్సీలో చేరిక

కర్నూలు, ఆగస్టు 2, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 23న జరగనున్న కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు చకచక మారిపోతున్నాయి. ఈ క్రమంలోనే కర్నూలు జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నేత శాసన మండలి సభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆపార్టీకి జలక్ ఇచ్చారు. టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేసి బుధవారం ఫ్యాక్స్‌లో టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పత్రాని పంపారు. గురువారం నంద్యాల పట్టణానికి వస్తున్న వైకాపా అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకోనున్నారు. నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగాబరిలో నిలిచినతన అన్న మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి ≫2


బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎస్ దినేష్‌కుమార్ ఇతర అధికారులు

ప్రజాసాధికార సర్వేలో
ప్రజలందరి నమోదు

నమోదుకాని వారికి ప్రత్యేక డ్రైవ్
నోడల్ అధికారులుగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు: సిఎస్ దినేష్‌కుమార్

విజయవాడ, ఆగస్టు2 ప్రభాతార్త: రాష్ట్రంలో ప్రజాసాధికార సర్వే ద్వారా నమోదు కాకుండా మిగిలి ఉన్న 5లక్షల 90వేల మందిని సర్వే చేసి నమోదు చేసేందుకు సెప్టెంబర్ 15వరకూ అన్ని జిల్లాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడించారు. ప్రజాసాధికార సర్వే ప్రగతిపై బుధవారం వెలగపూడి సచివాయలంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నివసించే ప్రతి ఒక్కరిని నమోదు చేయాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4కోట్ల 94లక్షల మంది జనాభా ఉండగా వారిలో 4కోట్ల 34లక్షల మందిని ఈ సర్వే ద్వారా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోనివాసం ఉంటున్నట్టు అడ్రస్‌లు వచ్చినప్పటికి ఎక్కువ మంది ఇతర ప్రాంతాల్లో ఉండటం, మరికొంతమంది చనిపోవడం, ఆధార్ సంఖ్య ≫2

కలసిరాని ఖరీఫ్!



ఎండిపోతున్న ఆయకట్టు భూములు
సాగర్ ఆయకట్టులో నీటి సమస్య
డెల్టా రైతుకూ తప్పని తిప్పలు
40 శాతం దాటని రుణాల మంజూరు

హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త: తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజను రైతులకు కష్టాలనే మిగుల్చుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా రాక ఆరుగాలం శ్రమిస్తున్న రైతాంగానికి కడగండ్లు, కష్టనష్టాలే మిగులుతున్నాయి. ఏ ఏటికాయేడు పెట్టుబడులు పెరిగిపోవడంతోపాటు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతినడం, తెగుళ్ల వ్యాపించడం వంటి వాటితో దిగుబడులు తగ్గిపోతుండగా, కనీసం మిగిలిన దిగుబడులకు కనీస మద్దతు ధరలను కల్పించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులతోపాటు, పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా డెల్టాలకు నీరు అంతంతమాత్రంగా అందడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరగలేదు. దీనికితగినట్లుగా విత్తనాల కొరత, పంట రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్ల వైఖరితో రైతాంగాన్ని కష్టాలు చుట్టిముట్టాయి. పంట రుణాల మంజూరు 40 శాతం కూడా దాటకపోవడం, సబ్సిడీ విత్తనాల సరఫరా నత్తనడకగా సాగుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో మొత్తం 43,24,318 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను, ఇప్పటి వరకూ 31,15,439 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. ఇందులో వరి సాగు 10 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను కేవలం 6.10 లక్షల హెక్టార్లలో మాత్రమే నాట్లు పడినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో వరుణుడు మొహం చాటేయడంతో జలాశయాల్లో నీటి మట్టాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 4,88,750 ఎకరాలు సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇందులో 2.50 లక్షల ఎకరాల్లోనే వేశారు. మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు జిల్లా రైతులకు జూరాల ప్రాజెక్టు వరప్రదాయనిగా ఉన్నా ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. చెంతనే కృష్ణమ్మ ఉన్నా పంట పొలాలకు నీరందక బీడు భూములుగా మారుతున్నాయి. జూరాల ప్రాజెక్టు కింద కొన్నేళ్లుగా కుడి, ఎడమ కాల్వల కింద 1.7 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ సీజనులో పంటు కళకళలాడాల్సిన సమయంలో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది కుడి, ఎడమ కాల్వలకు ఇప్పటి వరకూ నీటిని విడుదల చేయలేదు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో 42,06,686 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 17,02,365 లక్షల హెక్టార్లలో సాగైంది. ఇందులో 16 లక్షల హెక్టార్లలో సాగవుతుందని అంచనా వేయగా, 9.25 లక్షల హెక్టార్లలో నాట్లు పడినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో అనంతపురం జిల్లాలో వేరుశెనగ పైర్లు గాలికి వడబడిపోయి, ఎండలకు మాడిపోయే పరిస్థితి ఎదురైంది. ≫2

నియోజకవర్గాల పెంపు లేనట్లే!

గజపతి ప్రసాద్/ఏలూరు

●ఆశావహుల ఆశలపై నీళ్లు
●అధికార పార్టీకి అశనిపాతం

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పెంపు లేనట్లేనని కేంద్రం నుంచి అందుతున్న సంకేతాలు రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఈ వార్త ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లగా, అధికార పక్షానికి ఆశనిపాతంలా తయారయింది. ఎందుకంటే 2019 ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోను నియోజకవర్గాలు పెంపు ఉంటుందని అంతా భావించారు. గత మూడున్నరేళ్లుగా ఈ దిశగా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఇటీవల పార్లమెంట్‌లో గట్టిగా పట్టుపట్టడంతో కేంద్ర మంత్రిగా ఉన్న యం.వెంకయ్యనాయుడు కేంద్ర హోం మంత్రిత్వశాఖతో నోట్ తయారు చేయించారని కూడా ప్రచారం జరిగింది. ఇంతలోనే ఇటీవల చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో ఇక ప్రస్తుతానికి నియోజకవర్గాల పెంపు లేదని స్పష్టమైన సమాచారం వస్తోంది. కొద్ది రోజులు క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన సందర్భంలోను ప్రధాని నుంచి నియోజకవర్గాల పెంపు లేనట్లేనని సంకేతాలు అందాయని ప్రధానితో భేటీ అనంతరం తెలంగాణ సియం కెసిఆర్ ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు. అనంతరం రెండు రోజులు క్రితం పార్లమెంట్‌లో తెలుగు రాష్ట్రాల సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి నియోజకవర్గాల పెంపు ప్రస్తుతానికి లేదని సమాధానం వచ్చింది. దీంతో ఇంతవరకు నియోజకవర్గాలు పెరుగుతాయా? లేదా? అనే సందేహం కూడా ఈ సమాధానంతో వీడిపోయింది. అయినప్పటికీ ఇంకా అధికార పక్షం మాత్రం సీట్ల పెంపు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో నియోజకవర్గాల పెంపు అంశాన్ని ప్రస్తావించినప్పటికీ దీనికోసం రాజ్యాంగ సవరణ చేయవలసిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి కేంద్ర హోం మంత్రిత్వశాఖ నోట్ ద్వారా నియోజకవర్గాల పెంపును పార్లమెంటు ఉభయసభల్లో పెట్టేందుకు కొద్ది రోజులు క్రితం ప్రయత్నాలు జరిగాయి. అయితే నియోజకవర్గాల సంఖ్య పెంచాలంటే రాజ్యాంగ సవరణ ఖచ్చితంగా జరగవలసి ఉండడంతో ప్రస్తుతానికి ఈ అంశాన్ని పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. పునర్విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సంఖ్యను 225 కు పెంచాలని భావించారు. పలు జిల్లాల్లో వైకాపాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీ మారి ప్రస్తుతం మంత్రివర్గంలో సభ్యులుగా ఉన్నారు. అలాగే ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యే సీట్లు ఆశించేవారి సంఖ్య కూడా అధికంగా ఉంది. ముఖ్యంగా అధికార పార్టీలో ఈ పోటీ నెలకొంది. అందరినీ సంతృప్తిపరచాలన్నా, వైకాపా నుంచి వచ్చిన వారికి సీట్లు సర్దుబాటు చేయాలన్నా నియోజకవర్గాల పెంపు కీలకంగా మారింది. 2019 ఎన్నికల నాటికి నియోజకవర్గాల పెంపు జరిగే అవకాశం లేదు కాబట్టి అధికార పక్షానికి ఆశనిపాతంలా మారిందని చెప్పాలి. వైకాపా నుంచి టిడిపిలో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి వారి స్థానాల నుంచి టిడిపి తరపున పోటీ చేసేందుకు సిద్ధపడతారు. అలాగే గత ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓటమికి గురై అనంతరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జులుగా కొనసాగుతున్నవారు వచ్చే ఎన్నికల్లో టిడిపి తరపున టిక్కెట్లు ఆశిస్తారు. అలాగే కొందరు నాయకులు ఎప్పట్నుంచో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వెళ్లాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటివారు ఈసారి నియోజకవర్గాల పెంపుతో అవకాశం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి వారందరికీ సీట్లు పెంపు లేదనే విషయం మింగుడుపడడం లేదు. ఇక పశ్చిమగోదావరి జిల్లా విషయానికి వస్తే గతంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగిన ఈ జిల్లాలో 2009లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఒకటి తగ్గి 15 నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. అంతకుముందు ఉండే అత్తిలి నియోజకవర్గం రద్దు అయింది. ప్రస్తుతం 15 అసెంబ్లీ నియోజకవర్గంలో నియోజకవర్గాలు పెంపు జరిగితే మరో రెండు నియోజకవర్గాలు కొత్తగా పెరుగుతాయని అంచనా వేసారు. గత ఎన్నికల్లో అన్ని సీట్లు గెలుచుకున్న ఈ జిల్లాలో టిడిపికి వైకాపా నుంచి వచ్చినవారు ఎవరూ లేకపోయినప్పటికీ ఆ పార్టీలోనే ఎమ్మెల్యేలు టిక్కెట్లు ఆశించేవారు అధికంగా ఉన్నారు. గతంలో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ముళ్లపూడి బాపిరాజు ప్రస్తుతం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈయన అసెంబ్లీకి పోటీ పడతారని ≫2

ఉద్యోగుల ప్రయోజనాలకు
నష్టం రానివ్వం
సిఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు2 ప్రభాతవార్త: ఫండమెంటల్, పెన్షన్స్ రూల్స్ సవరణ, ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, 30సంవత్సరాల సర్వీస్ అమలు వంటివి ప్రభుత్వం ఆమలు చేయబోతోందని వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాల జెఎసీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో జెఎసీ రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్‌బాబు బుధవారం వెలగపూడి సచివాయలంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయోపరిమితిని వర్తింపజేయడం, ఫండమెంటల్ పెన్షన్ రూల్స్‌ను సవరించడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్న వార్తల నేపథ్యంలో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఉద్యోగులకు ఇప్పటివరకు రెండు విడతల డిఏ బకాయిలు ఉందని, 3వ విడత డిఏ ప్రకటించవలసిన సమయం వచ్చినప్పటికి ఇప్పటివరకు విడుదలపై ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారని, అలాగే పిఆర్‌సి ఎరియర్స్ చెల్లింపులపై కూడా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి ఆశోక్‌బాబు తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఎట్టిపరిస్థితుల్లో ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలిగించదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికి ఉద్యోగులకు ఇవ్వవలసిన రాయితీలను ప్రకటిస్తూనే ఉన్నట్లు తెలిపారు. ఉద్యోగుల వయోపరిమితిని 58నుండి 60సంవత్సరాలకు పెంచడం జరిగిందని, 2 జూన్ 2014నుంచి పెంచిన వయోపరితి వర్తింప జేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఎక్సైజ్‌శాఖలో ఉద్యోగుల పదోన్నతులపై ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. ఉద్యోగుల పనితీరు 90 శాతం సంతృప్తికరంగా ఉందని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగుల సేవలను అభినందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారని ఆశోక్‌బాబు తెలిపారు. ముఖ్యమంత్రిని ≫2

ప్రజాసాధికార సర్వేలో

అందుబాటులో లేకపోవడం సర్వేలో నమోదుకు ఆసక్తి చూపకపోవడం వంటి కారణాలతో 54లక్షల మంది సర్వేకు అవకాశంలేదని గుర్తించామని వారిని మినహా 5లక్షల 90వేల మందిని ఇంకా సర్వే చేసి నమోదు చేయాల్సి ఉందని ఇందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సి ఉంటున్నారు. ఇందుకు గాను ప్రతి మండలం, మున్సిపల్ కేంద్రాల్లో ఎన్‌రోల్మెంట్ కేంద్రాలని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్, జెసి నోడల అధికారిగా ఆయా జిల్లాల్లో ప్రజాసాధికార సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాసాధికార సర్వే డేటా అందుబాటులో లేదన్న ఫిర్యాదులను అధికమించేందుకు త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేసి ప్రజలందరినీ ఈ వివరాలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. చంద్రన్న భీమా కింద నమోదు కాని వారిని కూడ ప్రత్యేకడ్రైవ్ ద్వారా త్వరితగంగా నమోదుకు చర్యలు తీసుకోల న్నారు. ఆ సమావేశంలో సిసిఎల్ఏ అనిల్ చంద్ర పునీత్, ఏపి ఫైబర్ గ్రిడ్ సీఈవోబాబు, కార్మికశాఖకమిషనర్ వరప్రసాద్ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల విస్తరణ పెంచాలి..

రాష్ట్రంలో ఉద్యానవన పంటలను మరింత విస్తరించడంతోపాటు పండిన పంటకు తగిన మార్కెటింగ్, ఎగుమతి సౌకర్యాలను కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సెరీ కల్చర్‌శాఖలపై ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ కేవలం ఉద్యానవన పంట ఉత్పత్తికే ప్రాధాన్యత ఇవ్వకుండా ఆ పంటసాగు విస్తరణకు చర్యలు తీసుకోవడంతోపాటు ఆ రైతులు పండించిన పంటకు తగిన మార్కెటింగ్, ఎగుమతి సౌకర్యాలు కల్పించేల దృష్టి సారించాలని స్పష్టం చేశారు. గిట్టుబాటు ధరలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పంటను నిల్వ చేసేందుకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో కూడిన కోల్డు స్టోరేజీ గోదాములను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాక తగిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాట్లు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లెనిన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీటివల్ల మరుకుగా పనిచేసే స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. ఎన్జీఆర్ జలసిరి పథకంతో అనుసంధానం చేయడం ద్వారా పెద్దఎత్తున ఉద్యానవన సాగును విస్తరణకు కృషి చేయాలన్నారు.

జీరో వేస్ట్‌పై దృష్టి సారించి రైతుబజారుల వద్ద కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

ఆహార వస్తువులు పదార్థాల వృధాను అరికట్టటంలో ప్రత్యేక దృష్టి సారించి రైతు బజారుల వద్ద కంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సిఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. దేశ లో పండే ఆహార ఉత్పత్తుల్లో 40శాతం వృధా అవుతున్నాయని కావున ప్రతి ఒక్కరు జీరో వేస్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆహార పదార్థాలు వృధా కాకుండా చూడాలని ప్రధాని తరచూ నొక్కిచెబుతున్నారని గుర్తు చేశారు. రైతు బజారుల్లో అమ్ముకు కాక మిగిలిపోయిన కూరగాయలు ఇతర ఉత్పత్తులను రైతుల నుండి సేకరించి అక్కడ ఏర్పాటు చేసిన కంపోస్టు యూనిట్ల ద్వారా వాటిని ఎరువుగా తయారా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవనశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పెంపు లేనట్లే!

భావించారు. కాని సీట్లు పెంపు లేకపోవడంతో ఈ యన ఆశలపై నీళ్ళు చల్లిన ట్లయింది. మొత్తం మీద సీట్లు పెంపు లేదనే విషయంపలువురు ఆశా వహులకు నిరాశను కలిగి స్తోంది. అలాగే అధికార పక్షా నికి ఇబ్బందికర పరిస్థితుల ను సృష్టించేలా ఉంది.

వారం - వర్జ్యం

3-8-2017 గురువారం
హేవళంబి నామ సంవత్సరం దక్షిణాయనం
శ్రావణమాసం శుక్లపక్షం
ఏకాదశి సా. 4.15
జ్యేష్ఠ రా. 7.09
రా. ము. 1.30-3.00
దు. ఉ. 9.59-10.50
వర్జ్యం లేదు



బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న గవర్నర్ నరసింహన్

తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే

అభివృద్ధిని అడ్డుకునేందుకు 196 కేసులు వేశారు: తెలంగాణ సిఎం కెసిఆర్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు2: దేశంలో ఎక్కడా లేని విచిత్రమైన పరిస్థితిని తెలంగాణలో చూస్తున్నామని, రాష్ట్రానికి కాంగ్రెస్ నెం.1 విలన్‌గా మారిందని టిఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన విద్యుత్ కార్మికుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేయడం వెనుక కాంగ్రెస్ దాఖలు చేసిన పిల్ ఉండటంతో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతూ ఆయన బుధవారం రాత్రి ప్రగతి భవన్‌లో మీడియాతో మాట్లాడారు. త్వరలో రాష్ట్రమంతా పర్యటించి కాంగ్రెస్ దుష్ట పన్నాగాలను తిప్పి కొడతానని తెలిపారు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి మూడేళ్లలో కాంగ్రెస్ ఇప్పటి వరకు 196 కేసులను కోర్టుల్లో దాఖలు చేసిందని వివరించారు. అధికారంలోకి వచ్చాక టిఆర్‌ఎస్ చేపడుతున్న పవిత్రమైన పథకాలు, ప్రొయాక్టీవ్ రోల్ చూసి తమకు ఇక పుట్టగతులు ఉండవనే కేసులు పురాణం మొదలు పెట్టి తెలంగాణ ప్రజల పట్ల పిశాచిలా తయారయ్యారని దుయ్యబట్టారు. ఎన్నికేసులు పెట్టినా సమర్థంగా ఎదుర్కొంటామని, తెలంగాణను అభివృద్ధిచేయడమే తమ లక్ష్యమన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులపై మొత్తం 164 కేసులు దాఖలు చేయగా, అందులో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే 119 కేసులు దాఖలు చేశారన్నారు. పాలమూరు-రంగారెడ్డిపై 23 కేసులు, డిండి ఎత్తిపోతలపై పిల్ దాఖలు చేశారన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా 10 పిల్ ్ దాఖలు చేయగా, ఇందులో 872 మంది పేర్ ్తో పిటీషన్లు దాఖలు చేశారని, ఇందులో 7గురు మృతుల పేర్లు, వేర్వేరు ప్రాంతాల పేర్లు ఉన్నాయన్నారు. సుందిళ్ల బ్యారేజీపై 20 రోజుల్లో 5 కేసులు వేశారని తెలిపారు. ఉద్యోగాల నోటిఫికేషన్లపై 16 కేసులు వేశారని, అందులో గ్రూప్1,గ్రూప్2,టెట్‌తో పాటు గురుకుల ఉపాధ్యాయ పోస్టులపై కేసులు వేశారని తెలిపారు. 20వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే జీఓపై కోర్టుకు పోయి కొట్టేయించారని, కానీ ఈ సందర్భంగా హైకోర్టు ఇంటిరిమ్ ఆర్డర్‌ను ఇచ్చిందని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయొద్దని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినందున ఈ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సమర్థించడం, వారికి వేతనాలు పెంచాలని సూచన చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సంస్థల్లో రాత్రింబవళ్లు కష్టపడి కాంట్రాక్ట్ దోపిడి కింద నలిగిపోతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలోకి తీసుకోవాలని మాత్రమే నిర్ణయించిన విషయాన్ని న్యాయస్థానం గుర్తించాలని సూచించారు. అయితే దశాబ్దాల వ్యవస్థలను తొలగిస్తూ న్యాయస్థానం మానవతా దృక్పథంతో వ్యవహరించిందని, ఒప్పంద సిబ్బందికి రూ.21,784 ఇవ్వాలని బోర్డు ప్రతిపాదిస్తే, హైకోర్టు రూ.22వేలు ఇవ్వాలని, సూచించిందని, కానీ తమ ప్రభుత్వం ఆ కార్మికులకు రూ.23వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను తాము రెగ్యులరైజ్ చేయలేమని కానీ వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని, అందుకనే కోర్టు సూచించిన దాని కంటే వెయ్యి రూపాయల చొప్పున అదనంగా వేతనాలు పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు విద్యుత్ సంస్థల విధానం నిర్ణయించుకుంటున్నామన్నారు. ఈ వేతనాల పెంపుతో విద్యుత్ సంస్థలపై రూ.25కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. ఒప్పంద కార్మికులకు సమాన వేతనం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇలా అన్ని శాఖల్లోనూ ఒప్పంద ఉద్యోగుల వివరాలను సేకరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనేదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. వారిని కాంట్రాక్టర్ల బారి నుంచి ప్రభుత్వం విభాగాల పరిధిలోకి తీసుకొచ్చి నేరుగా వేతనాలు ఇచ్చే విధానంపై నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. కాంట్రాక్టు కార్మికులను, ఉదోగులను కాంట్రాక్టర్లు దోచేస్తున్నారని, వారి నుంచి 15శాతం కమిషన్ తీసుకుంటున్నారని, అందుకనే వారిని ప్రభుత్వం అబ్జార్బ్ చేసుకుంటుందని కోర్టులో చెప్పామన్నారు. రాష్ట్రంలో అన్ని సెక్షన్ల కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ ఇదే విధానం పాటిస్తామని, హోమ్‌గార్డులను కూడా ఇదే పద్ధతిలో వేతనాలు పెంచేందుకు విధానాలను రూపొంది స్తున్నామన్నారు.

SINGAM KUIL RED WEDNESDAY
Draw No:112 DrawDate on:02/08/17

SINGAM SERIES
1st Prize Rs.10,000/- S 194977
2nd Prize Rs.7,000/- 56465
3rd Prize Rs.3,500/-
18395 19315 32116 41144 53862
64411 75016 77677 83815 84382
4th Prize Rs.200/-
1024 1816 3128 3560 5731 6118 7221
7606 8158 8999
5th Prize Rs.100/-
1679 2522 2528 3303 4131 5064 6157
7707 9094 9695
6th Prize Rs.50/-
0009 1397 3046 5001 5937 7376 8549
0342 1690 3114 5014 5999 7431 8552
0379 1729 3273 5017 6193 7445 8657
0468 1759 3554 5022 6256 7491 8671
0521 1850 3788 5115 6363 7621 8716
0611 1965 3974 5131 6375 7790 9044
0753 2076 4223 5174 6395 7863 9260
0760 2082 4230 5339 6466 7890 9655
0827 2100 4287 5347 6563 7973 9833
0904 2113 4386 5384 6693 7987 9841
0913 2119 4658 5494 6880 8094
1286 2450 4710 5515 6910 8134
1312 2567 4725 5614 7038 8172
1332 2601 4831 5705 7062 8486
1362 2689 4976 5830 7285 8500

KUIL SERIES
1st Prize Rs.10,000/- K 237404
2nd Prize Rs.7,000/- 06041
3rd Prize Rs.3,500/-
13707 38607 52296 56930 63239
64104 69552 84760 89528 96828
4th Prize Rs.200/-
0045 0859 0949 1656 2789 4618 5953
7551 8524 9850
5th Prize Rs.100/-
0650 1055 1698 4045 4964 5526 6235
7067 7420 8587
6th Prize Rs.50/-
0062 1146 2413 3954 5822 7501 8944
0063 1224 2420 4075 5890 7593 9191
0096 1277 2529 4286 5903 7625 9277
0126 1351 2593 4315 5971 7700 9318
0139 1396 2633 4318 6004 7768 9490
0279 1623 2666 4429 6006 7778 9838
0333 1630 2757 4480 6192 7826 9888
0499 1735 2819 4787 6491 7977 9904
0622 2072 2870 4922 6568 8226 9912
0783 2135 2994 4989 6616 8297 9961
0875 2137 3109 5351 6624 8542
0956 2204 3420 5375 6702 8583
0961 2233 3457 5510 6847 8616
0993 2289 3745 5529 7044 8682
1093 2333 3872 5802 7380 8809

ROSA DEER PEARL WEDNESDAY
Draw No:112 DrawDate on:02/08/17

ROSA SERIES
1st Prize Rs.10,000/- R 108835
2nd Prize Rs.7,000/- 87933
3rd Prize Rs.3,500/-
02471 09710 26750 38327 49678
57300 80076 89485 91076 99479
4th Prize Rs.200/-
0634 1590 3587 4070 4116 6250 7051
7935 8602 9562
5th Prize Rs.100/-
0516 2294 2521 2872 4550 4901 7591
8078 8891 9628
6th Prize Rs.50/-
0058 1467 2853 4571 5954 7889 9228
0281 1569 2857 4734 6350 7957 9503
0477 1632 2888 4835 6460 7985 9577
0566 1703 3105 4958 6463 8133 9614
0682 1731 3186 5078 6513 8141 9676
0773 1853 3189 5119 6752 8155 9736
0843 2208 3595 5149 6941 8168 9760
1008 2272 3705 5237 6964 8296 9857
1113 2379 3810 5327 7089 8407 9885
1172 2391 3821 5390 7253 8453 9946
1249 2643 3892 5514 7281 8724
1347 2709 4128 5641 7320 8942
1353 2772 4154 5698 7432 9007
1371 2832 4362 5782 7594 9186
1377 2851 4474 5928 7879 9217

DEER SERIES
1st Prize Rs.10,000/- D 586679
2nd Prize Rs.7,000/- 79854
3rd Prize Rs.3,500/-
01674 08478 34124 40043 47780
57937 61040 68573 76076 97575
4th Prize Rs.200/-
2752 3871 4008 4997 5841 6079 6106
7000 9070 9751
5th Prize Rs.100/-
0182 0883 4440 5330 5944 6280 7148
7265 7489 9928
6th Prize Rs.50/-
0027 1925 3522 4325 5637 7325 8969
0064 1935 3649 4381 5824 7440 9003
0099 2131 3666 4403 5949 7608 9221
0247 2232 3690 4472 6163 7727 9307
0309 2252 3768 4559 6169 7867 9396
0524 2395 3777 4566 6245 7911 9426
0552 2537 3785 4630 6248 8037 9687
0578 2724 3847 4652 6311 8082 9702
0716 2749 3927 4774 6351 8216 9846
1119 2769 3940 4908 6538 8272 9944
1189 2867 3971 5021 6592 8348
1225 2882 3981 5362 6737 8375
1660 3415 3992 5365 6809 8449
1842 3470 4297 5406 7147 8824
1856 3506 4317 5429 7295 8963

THANGAM NALLANERAM FORTUNE WEDNESDAY
Draw No:112 DrawDate on:02/08/17

THANGAM SERIES
1st Prize Rs.10,000/- T 693068
2nd Prize Rs.7,000/- 72532
3rd Prize Rs.3,500/-
12365 16815 27296 36547 57675
60078 65515 68555 75283 87328
4th Prize Rs.200/-
2250 3232 5073 6530 7246 7309 7870
8744 8788 8998
5th Prize Rs.100/-
0286 0689 0891 1533 2446 2475 4258
5642 8202 8466
6th Prize Rs.50/-
0028 1786 3249 4379 6165 7178 8988
0260 1799 3354 4404 6171 7198 9091
0311 1980 3435 4551 6204 7238 9107
0362 2071 3543 4553 6259 7596 9122
0394 2316 3597 4583 6318 7697 9135
0424 2462 3651 4615 6493 7803 9180
0495 2553 3657 4651 6514 7918 9199
0530 2781 3861 5317 6517 8193 9469
0763 2915 3865 5430 6518 8231 9874
1281 2967 3899 5662 6682 8428 9947
1567 3006 3921 5735 6875 8496
1612 3053 4019 5979 6889 8624
1617 3067 4098 6043 6992 8643
1710 3106 4115 6117 7128 8709
1776 3191 4361 6153 7170 8784

NALLANERAM SERIES
1st prize Rs.10,000/- N 797937
2nd Prize Rs.7,000/- 19588
3rd Prize Rs.3,500/-
05111 22534 36795 53855 69485
76785 81505 88260 97322 98057
4th Prize Rs.200/-
0879 1256 1810 2591 3483 4184 5756
5786 7556 9816
5th Prize Rs.100/-
3883 3902 4108 4888 5719 6105 6705
7614 7667 9478
6th Prize Rs.50/-
0125 1839 3360 4499 5965 7791 9093
0143 1882 3571 4591 6216 7875 9309
0288 1974 3579 4663 6301 8142 9388
0336 2020 3787 4771 6400 8248 9510
0340 2031 3812 4906 6734 8333 9529
0449 2184 3863 4930 6743 8480 9550
0967 2360 3932 4962 6763 8539 9708
1049 2433 3991 4983 7013 8546 9739
1063 2440 4016 5008 7160 8561 9803
1283 2463 4036 5184 7193 8609 9860
1447 2655 4085 5381 7228 8640
1642 2684 4163 5448 7277 8778
1665 2743 4166 5605 7627 8902
1685 2807 4307 5773 7629 8949
1802 2824 4425 5849 7785 8987

KUMARAN VISHNU STAR WEDNESDAY
Draw No:112 DrawDate on:02/08/17

KUMARAN SERIES
1st prize Rs.10,000/- K 741785
2nd Prize Rs.7,000/- 74772
3rd Prize Rs.3,500/-
02160 05221 16235 26098 32638
51341 52572 59824 71496 81639
4th Prize Rs.200/-
2040 2085 3550 4309 4460 5328 8816
8996 9136 9415
5th Prize Rs.100/-
0426 0982 1151 2745 2844 5259 6569
7699 8183 8897
6th Prize Rs.50/-
0033 2126 4503 5522 6826 8182 9643
0195 2263 4509 5545 6924 8435 9706
0503 2320 4616 5559 7073 8507 9720
0624 2359 4809 5670 7127 8551 9808
0715 2719 4843 5939 7212 8685 9820
0908 2989 4853 5997 7287 8854 9862
1092 3116 4883 6142 7335 8882 9867
1164 3133 4924 6213 7388 8994 9916
1453 3234 5040 6265 7481 9167 9929
1532 3376 5089 6392 7652 9374 9953
1814 3796 5096 6456 7822 9419
1861 4009 5118 6521 7838 9445
1921 4275 5162 6660 8062 9450
2001 4357 5322 6670 8110 9483
2005 4385 5517 6677 8131 9521

VISHNU SERIES
1st prize Rs.10,000/- V 224971
2nd Prize Rs.7,000/- 90012
3rd Prize Rs.3,500/-
09845 10649 36983 42689 43882
56644 58852 66020 74013 75963
4th Prize Rs.200/-
2495 3165 3515 3953 4028 5155 6188
7631 7939 9789
5th Prize Rs.100/-
0138 0579 0987 1841 1872 4224 5273
5422 7738 8570
6th Prize Rs.50/-
0026 1311 2619 4135 5629 6810 8456
0037 1367 2820 4160 5803 6869 8479
0047 1388 2885 4250 6178 6902 8502
0146 1451 3013 4367 6221 7071 8536
0233 1580 3038 4456 6240 7298 8690
0291 1714 3055 4479 6258 7536 8734
0344 1918 3071 4593 6287 7595 9067
0349 1992 3123 4632 6361 7610 9355
0588 1993 3265 4686 6415 7623 9843
0636 1998 3358 4723 6423 7736 9973
0740 2262 3572 5219 6499 7880
0741 2378 3684 5294 6511 7975
0896 2453 3763 5433 6524 8212
0957 2564 3910 5458 6596 8340
1205 2577 4073 5537 6634 8440

కలసిరాని ఖరీఫ్!

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కేవలం 36 శాతం మాత్రమే రైతులు పంటలు వేశారు. కృష్ణా నదికి ఎగువ నుండి నీరు రాకపోవడంతో సాగర్ ఆయ కట్టులో రైతాంగం నారుమళ్లు పోయలేదు. అదేవిధంగా పత్తి సాగు విషయంలో 3.70 లక్షల హెక్టార్లలో వేశారు. గుంటూరు, కర్నూలు మినహా సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయడంలో అధికారుల వైఫల్యం కారణంగా మిగిలిన జిల్లాల్లో సగటున 12 వేల హెక్టార్లకు మించి పత్తిని వేయలేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా గత ఖరీఫ్ సీజను కంటే ప్రస్తుతం తగ్గుదల నమోదైంది. మరోపక్క ఈఖరీఫ్‌లో కౌలుతోపాటు ఎకరానికి దాదాపు 34 వేల రూపాయలు పైగా పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే అవి కూడా ఎంత వరకూ వస్తాయనేది సందేహాస్పదమే అవుతోంది. దోమలు, తెగుళ్లు, సాగునీటి సరఫరా వంటి కారణాలతో ఎకరానికి కేవలం 25 నుండి 28 బస్తాల వరకూ దిగుబడి వస్తుండగా, ఎకరానికి దాదాపు ఏడు వేల రూపాయలకు పైగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతున్న పరిస్థితుల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజను రైతులకు కడగండ్లను మిగిల్చేదిగా తయారైంది.

నష్టం రానివ్వం

కలిసిన వారిలో రాష్ట్ర జెఎసి నేతలు ఎన్ చంద్రశేఖరరెడ్డి, ఐ వెంకటేశ్వరరావు,కమలాకర్, పాండురంగప్రసాద్, నరసింహారావు, ఉదయభాస్కర్, ఎన్ సాంబశివరావు తదతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బుధవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

చక్రపాణి జంప్

అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ పరిశీలకులు బావిస్తున్నారు. శిల్పా మోహన్‌రెడ్డి టిడిపి జిల్లా అధ్యక్షుడిగా రెండేళ్ళ, ఎంఎల్‌సిగా రెండు దఫాలు, శ్రీశైలం నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ఆయన టిడిపిని వీడటంతో ఆ పార్టీకి బారీగానే షాక్ తగిలింది. ఇంత కాలం టిడిపిలో పనిచేసి అందరికీ అందుబాటులో ఉన్న శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ శ్రేణులు ఆవేదనకు గురయ్యారు. శిల్పా మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో నంద్యాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు భారీగా మారే అవకాశం ఉంది. అలాగే ఈ నెల 23న జరగనున్న నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో శిల్పా ప్రభావం పడనుంది. శిల్పా చక్రపాణిరెడ్డి మొదటి నుంచి దివంగత సిఎం వైఎస్ వెంట ఉంటూ కొన్ని ఎళ్లు మీళ్ల దూరంగా ఉంటూ తాజా రాజకీయ పరిణామాల క్రమంలో మళ్లి వైఎస్ కుటుంబానికి చెరువ అవుతున్నారు. 2004,2009 అసెంబ్లీ ఎన్నికల్లో తన అన్న శిల్పా మోహన్‌రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలువడంలో శిల్పా చక్రపాణి రెడ్డి ప్రధాన భూమిక పోషించారు. 2009 ఎన్నికల తరువాత అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత కాంగ్రెస్ నుంచి జగన్ మోహన్‌రెడ్డి బయటకు వచ్చి వైకాపాను స్థాపించడంతో ఆ పార్టీలో కొద్దికాలం పాటు క్రియా శీలకంగా పనిచేశారు. కొత్తగా ఏర్పడిన శ్రీశైలం నియోజకవర్గంపు ఇన్‌చార్జ్‌గా కొద్ది కాలం పాటు పనిచేశారు. అయితే వైఎస్ జగన్ ప్రస్తుత ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కినుక వహించి వైకాపాను వీడి 2011లో టిడిపిలో చేరారు. ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తు శిల్పా చక్రపాణి రెడ్డి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అయితే సిఎం చంద్రబాబు నాయుడు టిడిపి జిల్లా అధ్యక్షుడిగా 2015లో ఆయనను నియమించారు. అదే సంవత్సరంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి నుంచి ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో మరోసారి శిల్పా చక్రపాణిరెడ్డి ఆ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే తన అన్న నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి విజయం కోసం ఆయన వైకాపాల్లో చేరే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మొదటి నుంచి వైఎస్ కుంటుంబం వేంటే శిల్పా సోదరులు : నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంపు వైకాపా అభ్యర్థి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఆయన తమ్ముడు ఎంఎల్‌సి శిల్పా చక్రపాణి రెడ్డి కొన్ని ఎళ్లు మినహా మిగత కాలమంతా దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుంటుంబం వెంటే నిలిచారు. వ్యాపారంలో స్థిరపడ్డ శిల్పా మోహన్ రెడ్డికి మొదటి సారిగా 2004 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నంద్యాల నుంచి కాంగ్రెస్ పార్టీ టిటెట్ ఇచ్చి గెలిపించుకున్నారు. అటుతరువాత ఇదే నియోజకవర్గం నుంచి 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి గెలిచారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రిగా కొన్ని ఎళ్ల పాటు పనిచేశారు. కొద్ది కాలం తరువాత జిల్లాలోని ఆత్మకూరు ప్రాంతంలో వైఎస్ఆర్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తరువాత ముఖ్యమంత్రిగా రోషయ్య పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన క్యాబినెట్‌లో శిల్పాకు స్థానం దక్కలేదు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. రాష్ట్ర విభజనతో ఆయన కాంగ్రెస్‌ను వీడి 2014లో జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసి తమ సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి దివంగత ఎంఎల్ఎ భూమా నాగిరెడ్డి చెతిలో ఓటమి చెందారు. ఏడాది క్రితం భూమా నాగిరెడ్డి వైకాపాను వీడి టిడిపిలో చేరారు. ఆయన చేరికను శిల్పా మోహన్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి వ్యతిరేకించారు. మార్చిలో భూమా నాగిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో తనకే టిడిపి టికెట్టు కావాలని శిల్పా మోహన్ రెడ్డి సిఎం చంద్రబాబును పట్టుబట్టారు. అయితే సిఎం ఎటు తేల్చక పోవడంతో ఆయన నెల క్రితం టిడిపిని వీడి వైకాపాలో చేరారు. దీనితో వైఎస్ జగన్ తమ అభ్యర్థిగా శిల్పా మోహన్ రెడ్డిని నిర్ణయించారు. గత నెల రోజులుగా ఆయన నంద్యాల నియోజకవర్గంలో తమ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొంటూన్నారు. అయితే ఆయన తమ్ముడు శిల్పా చక్రపాణిరెడ్డి ఈ పరిణామాలతో ఇటు టిడిపికి అటు తన అన్న శిల్పా మోహన్ రెడ్డికి దూరంగా ఉంటు వచ్చారు. నెల సమయంలో సిఎం చంద్రబాబు ఆయన తనయుడు మంత్రి లోకేష్ నంద్యాల్లో పర్యటించిన ఆ కార్యక్రమాలకు శిల్పా చక్రపాణిరెడ్డి దూరంగా ఉంటూ వచ్చారు. సోమవారం నాడు ప్రచారంలో బాగంగా శిల్పా మోహన్ రెడ్డి నంద్యాల పట్టణంలోని తన తమ్ముడు శిల్పా చక్రపాణి రెడ్డి ఇంటికి వెళ్లి ఇద్దరం ఒకే పార్టీలో ఉందామని వైకాపాలో రావాలని ఆహ్వానించారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాల్వ శ్రీనివాసులు, సిఎం రమేష్‌లు స్థానిక నాయకులు ఎవి సుబ్బారెడ్డి చక్రపాణి రెడ్డిని కలిసి పార్టీ వీడొద్దని సముచిత స్థానం కల్పిస్తామని హామి ఇచ్చారు. అయితే ఆయన కార్యకర్తల అభిప్రాయ మేరకే నడుచుకుంటానని వారికి స్పష్టం చేశారు. ఈలోగా వైకాపా సీనియర్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఎంఎల్ఎ రవీంద్రరెడ్డి, శిల్పా మోహన్ రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి తదితరులు శిల్పా చక్రపాణిరెడ్డితో చర్చలు జరపడంతో ఆయన వైకాపాలో చేరేందుకు సిద్ధపడ్డారు.

టిడిపి అవమానించింది, ఏ పార్టీలో పనిచేసినా నిబ్బద్ధతతో పనిచేశా : శిల్పా చక్రపాణి రెడ్డి: జిల్లాలో టిడిపి అభివృద్ధికి ఎంతో పనిచేశానని, అయితే తనను ఆ పార్టీ అవమానించిందని ఎంఎల్‌సి శిల్పా చక్రపాణిరెడ్డి అనా ్నరు. టిడిపికి రాజీనామా చేసిన అనంతరం నంద్యాలలో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తాను కాంగ్రెస్‌లో, వైకాపా, టిడిపిల్లో పనిచేశానని తాను ఏ పార్టీలో పనిచేసినా నిబద్ధతతో, అంకిత భావంతో పనిచేసినట్లు చెప్పారు. స్థానిక పరిస్థితుల కారణంగానే తాను టిడిపికి రాజీనామా చేసినట్లు ఆయన చెప్పారు. బుధవారం వైఎస్ జగన్ సమక్షంలో వైకాపాలో చేరనున్నట్లు తెలిపారు. తన అన్న శిల్పా మోహన్ రెడ్డిని గెలిపించుకుంటానని ఎంఎల్‌సి శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు.

నంద్యాలలో నువ్వా-నేనా

ప్రారంభించింది కూడా. నంద్యాల పట్టణ చరిత్రలోనే అత్యంత కీలకమైన నిర్ణయంగా రోడ్ల విస్తరణ కార్యక్రమం పట్టణంలో నూనెపల్లికి వెళ్లే రహదారి కొన్ని దశాబ్దాలుగా అత్యంత ఇరుకుగా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాలతో ప్రజలకు విసుగుపెట్టిస్తుంది. గత ప్రభుత్వంలోనే రోడ్ల విస్తరణ జరగాల్సి ఉన్నప్పటికీ, వ్యాపారుల నుంచి ఇబ్బందులు ఉంటాయని ఆ పనులు చేపట్టలేదని అక్కడ ప్రజలు చెబుతున్నారు. ప్రజలు ఎంతకాలంగానో కోరుకుంటున్న రోడ్ల విస్తరణకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దుకాణాదారులు, వ్యాపారులతో సంప్రదించి వారికి ప్రత్యామ్నాయ హామీలు ఇచ్చి ఆ భవనాలను కూల్చి వేసింది. ఇందులో రెండు పార్టీలకు చెందిన వారు ఉన్నారు. అంతెందుకు ఎమ్మెల్సీ ఎన్.ఎండీ.ఫరూక్ కుటుంబానికి చెందిన సినిమాహాలు, ఇతర దుకాణాలు కూడా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రులు, పలువురు శాసనసభ్యులు, ముఖ్య నేతలు నంద్యాలలో తిష్టవేసి ఒకవైపు అభివృద్ధి ప్రచారం, మరోవైపు ఓటర్లను ఆకట్టుకునే వివిధ మార్గాల్లో ముందుకుపోతున్నారు. మంత్రి భూమా అఖిలప్రియ, అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి, వారి కుటుంబం మొత్తాన్ని ప్రచారానికే పరిమితం చేశారు.

శిల్పా బలానికి తోడైన వైఎస్సార్సీ వరాలు: నంద్యాల నియోజకవర్గంలో శిల్పా చక్రపాణిరెడ్డి బలానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వరాలు తోడ య్యాయి. 2009, 2014 శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా కూడా పని చేసిన శిల్పా మోహన్‌రెడ్డికి పట్టణంలో బాగానే పట్టుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరిన ఆయన భూమా నాగిరెడ్డి చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. తాజాగా వైసీపీ తీర్థం తీసుకున్న శిల్పా తన బలానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తోడవడంతో గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఇటీవలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్లీనరీ విజయవంతం కావడం, ప్లీనరీ వేదికగా జగన్ ప్రకటించిన తొమ్మిది వరాలను నమ్ముకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా తమ పార్టీకి చెందిన ముఖ్యనేతలు, శాసనసభ్యులందరినీ నంద్యాల్లో మోహరింపజేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీరును వైసీపీ శ్రేణులు దుమ్మెత్తిపోస్తున్నాయి. నం ద్యాలలో వైసీపీని గెలిపించడం ద్వారా రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమికి పునాది వేయాలని ఆ పార్టీ వర్గాలు అహర్నిశలు శ్రమిస్తున్నాయి.

నంద్యాలలో రెండోసారి ఉప ఎన్నికలు: నంద్యాల నియోజకవర్గం ఉప ఎన్నికలు జరగడం ఇది రెండవసారి. 1955 సంవత్సరంలో ఒకసారి ఉప ఎన్నికలు జరగగా, 62 సంవత్సరాల తర్వాత తాజాగా మరోసారి ఇక్కడ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నియోజకవర్గం తరచూ ఎన్నికల్లోనూ ఉత్కంఠ పోరుకు వేదికవుతోంది. 2004లో కాంగ్రెస్ ప్రభంజనం, 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ కూడా రంగంలోకి దిగడంతో జరిగిన త్రిముఖపోటీ కారణంగా శిల్పా మోహన్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందిగా, రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014లో పోరు అత్యంత ఉత్కంఠగా జరిగింది. కేవలం 2.06 శాతం ఓట్ల తేడాదితో తెలుగుదేశం పార్టీని వైఎస్సార్ కాంగ్రెస్ ఓడించింది. ఆ ఎన్నిలకు కొన్ని నెలల ముందు జరిగిన మున్సిపల్, జడ్పీటిసి, ఎంపిటీసి ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య నువ్వా-నేనా అన్నట్లే పోటీ జరిగింది. ఆ ఎన్నికల్లో కూడా రెండు పార్టీలు పొందిన ఓట్ల శాతంలో స్వల్ప తేడానే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆధిక్యం ప్రదర్శించింది.

2014లో జరిగిన వివిధ ఎన్నికల్లో పొందిన ఓట్ల శాతం

	టిడిపి	వైసీపి
శాసనసభ	44.91	46.97
మున్సిపల్	49.74	43.66
జడ్పీటీసి	50.64	48.97
ఎంపీటీసి	50.40	49.23

పార్టీల వారీ గెలుపొందిన స్థానాలు

	టిడిపి	వైసీపీ
కౌన్సిలర్	29	13
జడ్పీటీసీ	1	1
ఎంపీటీసి	14	14


ప్రధాన కులాల వారీగా ఓటర్లు

ముస్లిం	51802
రెడ్డి	23386
మాల	26405
బలిజ	12085
మాదిగ	12307
వైశ్య	10121
బోయ	9209
యాదవ	6593
దూదేకుల	5647
చాకలి	4940

రూ.30వేల కోట్లు

ప్రాజెక్టు చేపట్టడానికి తీసుకునే రుణం రూ.500కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల అద్దె చెల్లింపుల ద్వారా సమకూరే నిధులను ఉపయోగించి తీసుకువచ్చే స్ట్రక్చర్డ్ బాండ్లు రూ.1000కోట్లు, పీపీపీ పద్ధతిలో సమకూ ర్చుకునే రూ.1600కోట్లు, ఏటా రాష్ట్ర ప్రభుత్వ అదనపు బడ్జెట్ కేటాయింపులు రూ.1500కోట్లు మొత్తం కలిపి రూ.7,600కోట్లు ఉంటాయని చెప్పారు. ఇవిగాక, కలెక్టివ్ ఇన్వెస్టుమెంట్ స్కీమ్(సీఐఎస్)కింద రూ. 2000కోట్లు, కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.500కోట్లు, మసాలా బాండ్ల ద్వారా రూ.1000కోట్లు చొప్పున మరో రూ.3,500కోట్లు సమకూర్చుకునే వీలుందని తెలిపారు.తొలి 11ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏటా రూ.1500కోట్లు మేర బడ్జెట్ కేటాయింపులు అవసరమని చెప్పారు. దీర్ఘకాలి వాయిదా సౌకర్యం కల్పిస్తూ నిర్మాణ సమయంలో మారటోరియానికి అంగీకరించే ఆర్థిక సంస్థలచే సంప్రదించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. విద్యుత్, ఫైబర్ ఆప్టిక్ కేబుల్, పైప్‌లైన్ల ద్వారా అందించే గ్యాస్ వంటి మౌలిక సదుపాయాలు ప్రాథమికంగా తమకు ఆర్థిక వనరులుగా ఉంటాయని సీఆర్డీఏ కమిషనర్ వివరించారు.

-ఎవరికి ఎంత విస్తీర్ణంలో నివాసాలు..?: న్యాయమూర్తులు, శాసనసభ్యులు, ఉభయ సభల అధిపతులు, మంత్రులు, ఉద్యోగుల నివాస భవంతులపై సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. ప్రధాన న్యాయమూర్తికి నిర్మించబోయే భవనం కనీసం 8,550చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలని, రాష్ట్ర పోలీస్‌శాఖ అధిపతికి 5000నుంచి 8000చదరపు అడుగుల మేర ఉండాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల నివాస భవనాలు కూడా ఆయన అధికార నివాస సముదాయంలో భాగంగా ఉండాలని అధికారులు ప్రతిపాదించారు. శాసనసభ్యులకు అపార్ట్‌మెంట్ తరహాలో బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తారు. వీరికి ఒక్కొక్కరికి 35చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాసాలు వుండాలని సీఆర్డీఏ ప్రతిపాదించింది. ఇక మంత్రుల భవనాలు 6వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ముఖ్యమంత్రి అధికారిక భవనాన్ని 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 7500చదరపు అడుగులు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులకు 5000చదరపు అడుగులు, కార్యదర్శులు, అదనపు కార్యదర్శులకు 4000చదరపు అడుగులు చొప్పున నివాసాలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇతర అఖిల భారత సర్వీస్ అధికారులకు, నాన్ కేడర్ శాఖాధిపతులకు 3500, టైప్ 1 గెజిటెడ్ అధికారులకు 1800, టైప్2 గెజిటెడ్ అధికారులకు 1500, నాన్ గెజిటెడ్ అధికారులకు 1200, క్లాస్ 4 ఉద్యోగులకు 800చదరపు అడుగుల చొప్పున నివాసాలు ఉండాలని సీఆర్డీఏ ప్రతిపాదనలు రూపొందించింది. దీనిపై అన్ని వర్గాలతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.



బుధవారం సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

విజయవాడలో లైట్ మెట్రో రైల్ భేష్: విజయవాడ నగరానికి లైట్ మెట్రో రైల్ అన్ని విధాలుగా అనుకూలమని జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యూ సంస్థకు చెందిన ప్రజా రవాణా రంగ నిపుణుడు ఎడ్వర్డ్ డాట స్న్ సూచించారు. విజయవాడ నగరంలో మెట్రో రైలు అవసరాలు, అనుకూల, ప్రతికూల అంశాలపై రెండు వారాలుగా అధ్యయనం జరిపిన ఎడ్వర్డ్ బృందం సీఆర్డీఏ సమావేశంలో నివేదిక సమర్పించింది. లైట్ మెట్రో రైల్ వ్యవస్థ ఏర్పాటుకు మొత్తం రూ.4,273కోట్లు వ్యయం కాగలదని అంచనా వేశారు. ప్రధాన మార్గం 1లో నిడమానూరు నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు 13.27కిలోమీటర్లు, ప్రధాన మార్గం 2లో పెనమలూరు నుంచి పీఎన్‌బీఎస్ వరకు 12.76కిలోమీటర్లు పూర్తిగా లైట్ మెట్రో రైలు మార్గాలను సూచించారు. లైట్ మెట్రో రైలులో 2నుంచి 6కోచ్‌లు వరకు ఉంటాయి. 35కిలోమీటర్ల సరాసరి వేగంతో ప్రయాణిస్తాయి. కిలోమీటరుకు రూ.164.16కోట్లు చొప్పున మొత్తం 26కిలోమీటర్ల మే లైట్ మెట్రో రైల్ మార్గాన్ని నిర్మించాల్సి వుంటుందని పేర్కొన్నారు. రానున్న కాలంలో అటు అమరావతికి, ఇటు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి దీన్ని పొడిగించే వీలు ఉంటుంది. లైట్ మెట్రోతో రూ.600కోట్ల వ్యయం కాగల 60ఎకరాతల మేర భూసేకరణ భారం ప్రభుత్వంపై తగ్గనుంది. కేంద్రప్రభుత్వం కూడా లైట్ మెట్రో ప్రతిపాదనకు అంగీకరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సిట్టింగ్‌లకే తిరిగి అవకాశాలు

కొత్త నియోజక వర్గాలు లేనట్టే
కేంద్రం ప్రకటనతో ద్వితీయశ్రేణి నాయకుల్లో అంతర్మథనం

మహబూబ్‌నగర్ ఆగస్టు02,ప్రభాతవార్త ప్రతినిధి: కొత్త నియోజకవర్గాలపై ఆశలు పెట్టుకున్న టిఆర్ఎస్ నేతలకు ఊహించని షాక్. కొత్త నియోజకవర్గాలు ఇప్పట్లో లేనట్లేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో నేతల ఆశలన్నీ అడియాశలయ్యాయి. మొదటి నుంచి ముఖ్యమంత్రి కెసిఆర్ కొత్త నియోజక వర్గాలపై కసరత్తులు చేసినప్పటికీ సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు కావాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అవ్వాల్సిన అవసరం ఉందని హోంమంత్రిత్వశాఖ స్పష్టం చేయడంతో కొత్త నియోజకవర్గాల ఏర్పాటు ఇప్పట్లో లేనట్లేనని భావిస్తున్నారు.రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనతో తనదైన ముద్ర వేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు చేసి పాలనా పరంగా సంస్కరణలు తీసుకొచ్చారు.ప్రభుత్వ పరంగా ఒక వైపు పార్టీ పరంగా మరో వైపు పటిష్ఠం చేయాలన్న ఆలోచనతో కెసిఆర్ కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తామని గతంలో ప్రకటించారు.ఈ నేపథ్యంలో అనేక మంది మాజీ ఎమ్మెల్యేలు,ద్వితీయ శ్రేణి నాయకులు, ఇతర పార్టీలోని ముఖ్య నేతలు అనేక మంది టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇప్పుడు కొత్త నియోజకవర్గాలపై కేంద్రం మోకాలడ్డటంతో నేతల్లో అంతర్మధనం ఏర్పడు తోంది.వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే చాన్స్ ఉంటుందని ముఖ్యమంత్రి కెసిఆర్ పలు సందర్భాల్లో హామీ ఇవ్వడంతో ద్వితీయ శ్రేణి నాయకులు రాజకీయ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో అనేక మంది టిఆర్ఎస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా గద్వాల, అలం పూర్, వనపర్తి,కల్వకుర్తి,మఖ్తల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్,కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, దేవరకద్ర నియోజక వర్గాలను టిఆర్ఎస్ కైవసం చేసుకుంది. నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో టిడిపి గెలిచింది. అయితే ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మఖ్తల్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి,నారాయపేట నుంచి టిడిపి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిలు టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆ పార్టీ బలం 9కి చేరింది.జిల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అనేక మంది నాయకులు కూడా టిఆర్ఎస్‌లో చేరారు.కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే కొత్త వారికి అందులో చాన్స్ ఇవ్వాలన్న సంక ల్పంతో కెసిఆర్ ప్రయత్నించారు.అయితే కేంద్రం కెసిఆర్ ఆలోచనకు గండి కొట్టడడంతో ఇప్పుడు కొత్త వారికి ఎలా సర్థుబాటు చేయాలన్నది అంతుబట్టని సమస్యగా మారింది. నారాయణపేటలో రాజేందర్‌రెడ్డి గతంలో టిడిపి నుంచి గెలిచినా అప్పట్లో టిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన శివకుమార్‌రెడ్డి స్వల్ప మెజార్టీతోనే ఓడిపోయారు. అయితే ఈ సారి సిట్టింగ్ రాజేందర్‌రెడ్డికే ఆవకాశం కల్పిస్తే శివకుమార్‌రెడ్డి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది. అలాగే మఖ్తల్‌లో దేవరిమల్లప్పతోపాటు నర్వకు చెందిన ఒక ప్రముఖ కాంట్రాక్టర్ కూడా ఆశలు పెట్టుకున్నారు. మహబూబ్‌నగర్ విషయంలో అనేక మంది నేతలు ఉన్నారు. మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌తో పాటు గతంలో పోటీచేసి ఓడిపోయిన ఒక మైనార్టీ నాయ కుడు ఉన్నారు. జడ్చర్లలో టిఆర్ఎస్ అద్యక్షులు శివకుమార్ ఆశలు పెట్టుకున్నారు. అలాగే షాద్ నగర్‌లో అనేకమంది నాయకలు ఆశలు పెట్టుకున్నారు. కల్వకుర్తిలో జైపాల్ యాదవ్‌తో పాటు అనేక మంది రంగంలో ఉన్నారు. అచ్చంపేటలో మాజీ మంత్రి రాములు ఆశిస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లో ప్రస్తుతం ఎవరూ లేక పోయినప్పటికీ చివిరి నిమిషంలో ఏమి జరుగుతుందో తెలియదు. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లికి తప్ప ఇతరుల నుంచి పెద్దగా పోటీ లేదు. వనపర్తిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డికే చాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈయనకు ఇక్కడ పోటీ లేరు. దేవరకద్రలో ఆలవెంకటేశర్‌రెడ్డికి కూడా పోటీపడే సత్తాఉన్న నాయకులు లేరనే చెప్పాలి. ఆలంపూర్‌లో మందా జగన్నాథం కుమారుడితో పాటు మరి కొందరు ఆశిస్తున్నారు.గద్వాల్లో కృష్ణమోహన్‌రెడ్డితో పాటు మరి కొందరు ఆశిస్తున్నారు. కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యేతో పాటు కృష్ణ కూడా ఆశిస్తున్నారు. ద్వితీయశ్రేణి నాయకులకు ఎక్కడ సర్దుబాటు చేయాలన్నా చక్కబడే పరిస్థితులు కనిపిం చడం లేదు.బౌగోళికంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెద్ద జిల్లా కావడంతో జనాభా కూడా 43 లక్షలకు పైగా ఉంది.నియోజకవర్గాల పునర్విభజన జరిగి ఉంటే జిల్లా నుంచి మరో నాలుగు నియోజక వర్గాలైనా పెరిగేవని భావించారు. అయితే అలాంటిది ఏవీ లేకపోవడంతో పాత నియోజకవర్గాల కొనాసాగనున్నాయి.



మహబూబ్‌నగర్ జిల్లా మ్యాప్ (ఫైల్)

ఎదురు చూపులు

ముస్తాబైన డబుల్ బెడ్ ఇళ్లు - సిఎంతో ప్రారంభోత్సవానికి సన్నాహాలు - ఫలించనున్న పేదల ఇంటి స్వప్నం

మహబూబ్‌నగర్ ఆగస్టు 2, ప్రభాతవార్త ప్రతినిధి: పేదల ఇంటి స్వప్నం డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఈ పథకం అత్యంత ప్రీతిపాత్రం కావడంతో ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు పనులను వేగవంతం చేస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంఎల్ఎలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేగంగా ఇళ్లను పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు మంత్రులు ఆదేశించి వెళ్లారు.ఈ నేపథ్యంలో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. సర్వే నెంబర్ 523లో చేపడుతున్న ఇళ్లు పూర్తి అయిన వెంటనే ముఖ్యమంత్రి కెసిఆర్‌తో ప్రారంభించాలని ఎంఎల్ఏ శ్రీనివాస్‌గౌడ్ ప్రయత్నిస్తున్నారు. బహుశ వచ్చేనెలలోనే సిఎం పర్యటన ఉండే అవకాశాలు ఉన్నాయి. బైపాస్ రోడ్డుతో పాటు,మెడికల్ కళాశాల, డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభం,మిషన్ భగీరథ, జాతీయ రహదారి విస్తరణ వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు పునాదులుపడే సూచనలు ఉన్నాయి..అన్నీ అనుకున్నట్లు జరిగితే సిఎం పర్యటన సెప్టెంబర్ లేక అక్టోబర్‌లో ఉండే అవకాశాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికారులు సంబందిత లబ్దిదారులను ఎంపిక చేసే ఎలో ఉన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మొత్తం 3900 డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరయ్యాయి. సర్వే నెంబర్ 523 లో 350 ఇళ్లు, దివిటి పల్లె వద్ద సుమారు 1000 ఇళ్లు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాలను హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ కంపెనీ తీసుకొని నడిపిస్తోంది.గతంలో ఇళ్ల నిర్మాణాల్లో ఆ కంపెనీ ఎలాంటి అవకతవకలు లేకుండా క్లీయర్‌గా ఉండడంతో ప్రభుత్వం ఆ కంపెనీకి అప్పగించింది. ఒక్కో ఇంటికి రూ,5.50 లక్షలు వెచ్చిస్తున్నారు. లబ్దిదారులకు అవసరమైన పార్కింగ్‌తో పాటు విద్యుత్, నీటి సదుపాయం, మరుగుదొడ్లు వంటివన్నీ పూర్తిచేసి తాళం చేతికిస్తారు. గతంలో ముఖ్యమంత్రి జిల్లా కేంద్రంలోని పాత తోట, వీరన్నపేట,రైతుబజార్ ప్రాంతంలో పర్యటించిన సమయంలో ప్రజలు ముందుకు వస్తే ఇక్కడే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఈ కాలనీల్లో కొందరు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.అయితే కొందరు డబుల్ బెడ్ ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్న ఇళ్లను కూల్చుకున్నారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.ఇదిలా ఉండగా గత కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రొనాల్డ్‌రొస్ వీరన్న పేట చివరిలో ఉంటున్న ప్రభుత్వ అసైన్డ్ భూమిలో ఉన్న వారికి సర్దిచెప్పి ఆ భూమిని స్వాదీనం చేసుకున్నారు.ఈ భూమిలో నష్టం కల్గిన వారితో పాటు ఇతర లబ్దిదారులకు ఇక్కడ డబుల్ బెడ్ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు వారు ఒప్పుకోవడంతో అక్కడ కూడా డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే నిర్మాణాలు వేగంగా జరుగుతండగా, ఇతర జిల్లాల్లో కొన్నింటిలో టెండర్లు పూర్తి కాగా మరి కొన్ని జిల్లాలో ఇంకా మొదలే కాలేదు.ఇక్కడ కూడా ఇళ్ల నిర్మాణాలను వేగవంతంచేయాలని సంబందిత అధికారులకు ఆదేశాలు వెళ్లాయి.



దివిటి పల్లె వద్ద వేగంగా నిర్మాణాలు జరుగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

వేలల్లో ధరఖాస్తుదారులు: ఇప్పటికే డబుల్ బెడ్ ఇళ్లకోసం మహబూబ్‌నగర్ తహశీల్దార్ ప్రభాకర్‌రావు దరఖాస్తులను ఆహ్వానించారు.నిర్ణీత గడువులో దరఖాస్తులను తీసుకున్నారు. సుమారు పదివేలకు పైగా దరఖాస్తులు అందాయి. వచ్చిన ధరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గతంలో ఇళ్లు ఉందా లేదా, స్థిరాస్తులు ఎమైనా ఉన్నాయా, ప్లాట్లు ఉన్నాయా, గతంలో ప్రభుత్వం తరుపు అర్బన్ హౌసింగ్ కింద ఇళ్లు తీసుకున్నారా వంటి వాటితో పాటు సమగ్ర సర్వే నివేదిక ద్వారా లబ్దిదారుల ఎంపిక జరిగే అవకాశాలు ఉన్నాయి.ఇళ్ల మంజూరులో మద్య దళారులను ఆశ్రయించవద్దని, ఎవరైనా లంచం అడిగితే చెప్పుతో కొట్టాలని గత నెల రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన కెటిఆర్ హెచ్చరించి వెళ్లారు. ప్రస్తుతం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలపై తహశీల్ కార్యాలయ అధికారులు విచారణ చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో అనేక మంది నిజమైన పేదలకు డబుల్ బెడ్ ఇళ్లు కళ సాకారమయ్యే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి పర్యటనలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు కటాయించే అవకాశాలు ఉన్నాయి.

గులాబీనేతల పక్కచూపులు...

పునర్విభజన కాదని తేలడంతో కొత్తదారులు
దేశం,కాషాయం నేతలతో సంప్రదింపులు
సీట్లు ఖాయమంటే జెండా మారేందుకు సిద్ధం
అధికార పార్టీకి వలస బెడద తప్పదంటున్న నాయకులు

హైదరాబాద్,ఆగస్టు 2 ప్రభాతవార్త : మహా నగరంలో అధికార గులాబీ పార్టీల్లో వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ సీటుపై ఆశలు సన్నగిల్లిన నాయకులంతా జెండా మారేందుకు కొత్తదారులు వెతుకుతున్నారు.ఇప్పటికే ఒక నియోజవర్గానికి ముగ్గరు నేతలు పోటీ ఉన్నారు.గడించిన ఎన్నికల్లో పార్టీకోసం శ్రమించిన నాయకులతో పాటు టిఆర్ఎస్ అధికార చేపట్టిన తరువాత తెలుగుదేశం పార్టీకి చెందిన 10మంది శాసనసభ్యులు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.దీంతో ఆయా నియోజకవర్గాలల్లో పార్టీని నిలబెట్టిన నాయకులు ఆందోళణ పడ్డారు.ఇన్నాళ్లు తాము కష్టపడి ఫలితం అక్కరకు రాకుండ పోతుందని,భావించి అప్పట్లో పార్టీ పెద్దలకు తమ రాజకీయ భవిష్యత్తు అంధకారంలో పడుతుందని మొరపెట్టుకున్నారు.వెంటనే సీనియర్లు స్పందించి వారితో చర్చలు జరిపి వచ్చే ఎన్నికల వరకు కొత్త అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుంది,దాంతో మీ రాజకీయాలకు ఢోకా లేదని భరోసా ఇచ్చారు.అప్పటి నుంచి తెలంగాణ ఉద్యమంలో శత్రువులుగా ఉన్న నాయకులంతా మిత్రులుగా మారి ఒకే వేదికపై ప్రసంగాలు చేస్తునా న్నరు.ఇంతలో రాష్ట్రపతి ఎన్నికలు రావడంతో అసెంబ్లీ పునర్విభజను వేగవంతం చేయాలని సిఎం కెసిఆర్ హస్తిను వెళ్లి ప్రధాని చర్చలు జరపగా,కొత్త సీట్లుపెంపు అడ్డంకులు ఉన్నాయని స్పష్టం చేయడంతో ఆయన సీట్లు అంశం ఇప్పుడు ప్రాధాన్యత అంశంకాదని తేల్చిచెప్పారు.ఈదెబ్బతో ఇన్నాళ్లుగా ఎమ్మెల్యే సీట్లుపై కలలు కన్న నేతల ఆశలపై నీల్లు చల్లినట్లైంది.అయిన ఆనాయకులంతా టిడిపి,బిజెపి పార్టీల్లో నాయకుల సంఖ్య తక్కువ ఉన్నందున న అక్కడ చోటు దొరుకుతుందని అంచనాలు వేస్తూ తమకు పరిచయమున్న సీనియర్లతో మంతనాలు షూరు చేశారు.ఈసారి ఖచ్చితంగా సీటు వచ్చేలా అవకాశం కల్పిస్తే జెండా మారి,భారీగా పార్టీ పండ్‌కు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నట్లు సమాచారం.ముందుగానే ఖరారు చేసుకుంటే అప్పట్లో సీట్లు లభిస్తుందని ఎవరి ప్రయత్నాలు చేస్తునా న్నరు.గత సార్వత్రిక ఎన్నికల్లో యూసుఫ్‌గూడ నుంచి మురళీగౌడ్ టిఆర్ఎస్ నుంచి,టిడిపినుంచి మాగంటి గోపినాద్,ఎంఎఐ తరుపుత నవీన్‌యాదవ్,కాంగ్రెస్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి బరిలో నిలిచారు.వీరిలో మాగంటి గోపినాథ్ విజయం సాదించారు.ఏడాది తరువాత మాగంటి గులాబీ జెండా పట్టారు.దీంతో పాత నాయకులు ఇబ్బందిపడ్డారు.తరువాత జరిగిన గ్రేటర్‌ఎన్నికల్లో మరికొంతమంది సీనియర్లు కార్పొరేటర్లుగా పోటీ చేశారు.ఈఎన్నికల్లో గెలిచి నాయకులు కూడా అసెంబ్లీ సీట్లుపై కన్నెశారు.ప్రస్తుతం ఆనియోజకవర్గంలో మురళీగౌడ్,బాబా ఫసియెద్దీన్,మాగంటి సీటు వేటలో పడట్లు పార్టీలు వెల్లడిస్తున్నాయి. సనత్‌నగర్ నుంచి టిఆర్ఎస్ తరుపున దండెం విఠల్,టిడిపి నుంచి తలసాని,కాంగ్రెస్ సీటు మర్రి శశిధర్‌రెడ్డి దక్కించుకున్నారు.అక్కడ తలసాని విజేతగా నిలిచారు.ఆయన ఆరునెల దాటగానే కెసిఆర్ మంత్రివర్గంలో చోటు సంపాదించుకున్నారు.ఈనియోజకవర్గంలో తలసాని,విఠల్,కట్టెల శ్రీనివాస్‌లు పోటీ పడుతున్నారు.కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు,ముద్దం నర్సింహ్మాయాదవ్,గొట్టెముక్కల బరిలో నిలవగా కృష్ణారావు గెలిచారు.కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన ముద్దం,టిఆర్ఎస్‌లో చేరి కార్పొరేటర్ సీట్లు కైవసం చేసుకున్నారు.ఇక్కడ నుంచి కృష్ణారావు,ముద్దం,పండాల సతీష్ గౌడ్ ఆశిస్తున్నారు.శేరిలింగంపల్లిలో టిడిపి తరుపున అరికెపూడి గాంధీ,టిఆర్ఎస్ నుంచి శంకర్‌గౌడ్,కాంగ్రెస్ భిక్షపతియాదవ్ బరిలో నిలవగా,గాంధీ విజయం సాధించారు.ఆయన కూడా ఏడాదిలోగా అదికార పార్టీలో చేరారు.ఇప్పుడు అక్కడ నుంచి గాంధీ,శంకర్‌గౌడ్,కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సీటు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఖైరతాబాద్ నియోజకవర్గంలో కూడా తీవ్రమైన పోటీ నెలకొంది.నియోజకవర్గ బాధ్యులు గోవర్ధన్‌రెడ్డి ఉండగా,అప్పుడు వైకాపా నుంచి విజయారెడ్డి నిలిచారు. వెంటనే ఆమె గులాబీలో చేరారు.వచ్చేఎన్నికల్లో పోటీ చేసేందుకు గోవర్ధన్‌రెడ్డి,విజయారెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి సీటు కోసం దారులు వెతుకుతున్నారు.ముషీరాబాద్‌లో ముఠా గోపాల్,హోంమంత్రి అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి,సాయన్న కూతురు లాస్యనందిత కూడా చాన్స్‌వస్తే అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు ఆలోచన చేస్తున్నారు.కంటోన్మెంట్ నుంచి గజ్జెల కాంతం,సాయన్న,గజ్జెల నాగేష్‌లు పోటీ చేయగా సాయన్న విజయం సాధించారు.ఆయన కూడ గూలాబీగూటికే చేరారు.దీంతో అక్కడ నుంచి కూడ వీరేకాకుండా కార్పొరేటర్ కూడా ఉన్నారు.ఎల్బినగర్‌లో రాంమెహన్‌గౌడ్, విఠల్‌రెడ్డి, పక్క జిల్లాకు చెందిన మంత్రి ఇక్కడే నుంచి బరిలో ఉంటారని ప్రచారం జరుగుతుంది.మహేశ్వరం నియోజకవర్గంలో కూడా నాయకుల మధ్య నువ్వానేనా అన్నట్లు సాగుతుంది.ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి,మనోహర్‌రెడ్డి,బిసి వర్గం నేత పల్లె రవికుమార్‌గౌడ్‌లు సీటు దక్కించుకునే పనిలో పడ్డారు.ఇకా పాతబస్తీకి చెందిన ఏడుసీట్లు ఎంఐఎందే హవా తప్పదు.అక్కడ ఏపార్టీయినా నామమాత్రంగా అభ్యర్దులను నిలపడం తప్ప మజ్లీస్‌ను ఢీకొనే పార్టీలు కనిపించడం లేదు.ఈసారి ఎన్నికలు ఆరునెలల ముందుగా వస్తాయని నాయకులు అంచనా వేస్తున్నారు.నగరంలో పలు నియోజకవర్గాలనుంచి గులాబీ నుంచి సీటు ఆశిస్తున్న వారిలో కొందరు మాత్రమే రెండు రోజుల నుంచి బిజెపి,తెలుగుదేశం పార్టీ నాయకులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.అధికార పార్టీలో పరిస్దితి అనుకూలించకపోతే తమకు రాజకీయ జీవితానికి బాటలు చూపించాలని వేడుకుంటున్నట్లు వారి అనుచరులు వ్యాఖ్యానిస్తున్నారు.ఖచ్చితంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచి చట్టసభలో అడుగుపెట్టేందుకు ఎత్తులు,జిత్తులు వేస్తూ రాజకీయ ఉనికి కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు.

ప్రైవేటుకు ఆర్టీసి ధారాదత్తం!

మెట్రో రైల్‌తో అనుసంధానం
మెట్రో పరుగుతో ఆర్టీసి ఆదాయానికి గండి
తగ్గనున్న సర్వీసులు, రూట్లు- ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం
కొత్త మార్గాల అన్వేషణ వేగవంతం

హైదరాబాద్, ఆగస్టు2 ప్రభాతవార్త: ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసేవిధంగా అడుగులు నెమ్మదిగా ఒక్కొక్కటిగా పడుతువన్నాయి. ఆర్టీసీ భారీ నష్టాలను మూటగట్టుకుంటుందనే పేరుతో ఒక్కొక్క విభాగాలుగా ప్రైవేట్ వశం చేయడానికి అధికారులు ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. హైదరాబాద్ మెట్రోరైల్‌తో ఆర్టీసీని కలపాలని ప్రతిపాదించారు. ఆర్టీసీ నష్టాన్ని పూడ్చుడానికి కొత్త కొత్త ప్రణాళికలను యాజమాన్యం రూపొందిస్తున్నప్పటికీ అవి ఆశించమేరకు కాకపోయినా కొంతలో కొంత వరకు అయినా ఆర్టీసీని గట్టెక్కిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా డిపోల్లో ఉన్న ఆర్టీసీ భూములను పెట్రోల్ బంకులు, ఇతర వాటికి లీజుకి ఇస్తున్నారు. ఇక బస్సుల విషయానికి వస్తే దాదాపు డిపోల్లో 30 శాతం వరకు అన్నీ హైర్ బస్సులే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు కొత్తగా మరో ప్రతిపాదనను అధికారులు తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే ఆర్టీసీని మెట్రోతో అనుసంధానంచేసి నష్టాలను పూడ్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొన్ని నెలల్లో మెట్రో రైలు నగర వీధుల్లో తిరగనుంది. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడే అవకాశాలు ఉన్నాయి. దీంతో కొత్త రూట్లను అన్వేషించే పనిలో ఆర్టీసీ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులకు చేరువయ్యేందుకు కొత్తదారులని వెతుక్కునే పనిలో పడింది. ఇప్పటికే మెట్రో రైలు పరుగులు పెట్టాల్సి ఉంది. ముందస్తుగా అనుకున్న సమయం దాటింది. ఆలస్యమైనా మెట్రో పరుగులు మాత్రం ఖాయం. మెట్రో రైల్ రాకతో సర్వీసులు, రూట్లు, ట్రిప్పుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. ఇది సంస్థపై భారం కానుంది. దీంతో ఆర్టీసీకి వచ్చే ఆదాయం తగ్గుతోంది. మెట్రో స్టేషన్లు కూడా చకచకా పూర్తవుతున్నాయి. టెక్నికల్, ఇతర పనులు కూడా పూర్తై సేవలు అందించేందుకు మెట్రో సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ఏమేరకు అవసరం అవుతాయే అనే దానిమీద ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. కానీ మెట్రో ప్రారంభానికి సమయం దగ్గరపడుతుండటంతో ఆదాయనికి పెంచడానికి అధికారులు కొత్త మార్గాలను అన్వేషించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

పాలమూరు అంచనాలు పైపైకి

రూ.35,200 కోట్ల నుంచి
రూ.49,595 కోట్లకు చేరిక
నిర్వాసితుల వ్యయానికి కోత
నిర్మాణ వ్యయానికి మోత

హైదరాబాద్ ఆగస్టు 2, ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మిస్తున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అంచనాలు కాలం గడుస్తున్నా కొద్ది పలుమార్పులు చోటుచేసుకుంటూ అంచనా వ్యయం పెరగుగుతూ పోతోంది. నిర్వాసితులకు అందే భూసేకరణ, పునరావాసంకు సంబంధించిన వ్యయంలో మాత్రం ఏ విధమైన మార్పు రాలేదు లేదు సరికదా.. పైగా దానికి కోత పెట్టడంతో ఆ వ్యయం తగ్గింది. ఇవి తప్ప మిగిలిన పనుల అంచనాలన్ని పైపైకి పోతున్నాయి. తొలుత ఈ పథకం అంచనా వ్యయం రూ.35,200కోట్లు కాగా ప్రస్తుతం దీని అంచనా వ్యయం రూ.49,595కోట్లకు పెరిగింది. మరో వైపు పునరావాసం, భూసేకరణకు వెచ్చించాల్సిన వ్యయం రూ.405కోట్లు తగ్గింది. అన్ని రకాల వస్తువులకు ధరలు పెరగడం, కాలువలు, సొరంగమార్గాల సామర్థ్యాల పెంపులు జరిగాయి. దీంతో ఈ సామర్థ్యం మేరకు మోటార్లు, పంపులు నిర్మించాల్సి రావడంతో నిర్మాణ వ్యయం పెరిగింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.3లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించే లక్ష్యంతో ఈ పథకం నిర్మిస్తున్నారు. తొలుత దీని కోసం రూ.35,200కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో పాటు రూ.18 ప్యాకేజీ పనులకు రూ.29,339కోట్లతో పనులకు ఒప్పందాలు కూడా జరిగాయి. కొన్ని పనులు టెండర్లు పిలవకుండానే మిగిలిపోయాయి. దీంతో ఈ పనులకు 2016-17 ధరలతో తిరిగి అంచనాలు తయారుచేశారు. పెరిగిన అంచనాల తీరును ఓసారి పరిశీలిస్తే... లిఫ్టల వద్దకు400కెవి విద్యుత్ సరఫరా లైన్లు, 400కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం తొలి అంచనాలో లేదు. దీనిని సవరించిన పనుల్లో జోడించారు. దీంతో దీనికి అయ్యే వ్యయం రూ.3300.52కోట్లు సవరించిన అంచనాల్లో అదనంగా వచ్చి చేరింది. అలాగే పెరిగిన ధరలకు సంబంధించిన వ్యయం మొదటి అంచనాల్లో లేదు. ఇలా ధరలు పెరగడం వల్ల పెరిగిన వ్యయం రూ.1292.34కోట్లను సవరించిన అంచనాల్లో పొందుపరిచారు. మొదట ప్రతిపాదించిన డిపిఆర్ ప్రకారం కాలువ పొడువు 39.15కిలోమీటర్లు. దీనిని మార్చి 50.165కిలోమీటర్లకు పెంచారు. అలాగే సొరంగమార్గం తొలి ప్రతిపాదనల్లో 54.475కిలోమీటర్లు కాగా దీనిని 62.216కిలోమీటర్లకు పెంచారు. దీని వల్ల కాలువల, సొరంగ మార్గాల వ్యయం పెరిగింది. మొదటి దాని ప్రకారం వీటి వ్యయం రూ.3894.41కోట్లు కాగా సవరించిన వాటి ప్రకారం వీటి వ్యయం రూ.5522.56కోట్లకు పెరిగింది. తొలుత ఈ ప్రాజెక్టుకు మొదట 3445మెగావాట్ల సామర్థ్యం గల 26పంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మారిన లెక్కల ప్రకారం 4720మెగావాట్ల సామర్థ్యంతో పంపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అంటే 1275మెగావాట్ల సామర్థ్యం అదనంగా పెరిగింది. దీంతో వీటి కోసం అయ్యే వ్యయం రూ.3638.86కోట్లు అదనంగా పెరిగింది. భూసేకరణ కోసం మొదట రూ.2565కోట్లు అవుతుందని అంచనా వేశారు. తాజాగా భూసేకరణ కోసం రూ.2446కోట్లు అవుతుందని అంచనా వేశారు. అంటే భూసేకరణకు వ్యయం తగ్గి దాదాపు రూ.117కోట్లు ఆదా అవుతోంది. ఇక పునరావాసానికి తొలుత రూ. 598కోట్లు అవుతుందని అంచనాలు వేయగా ఇది ప్రస్తుతం రూ.300కోట్లు అవుతుందని తేల్చారు. అంటే పునరావాసానికి అయ్యే ఖర్చు మొదటి దానికి ఇప్పటి దానికి దాదాపు సగం(రూ.298కోట్లు) తగ్గింది. మొత్తం మీద పరిశీలిస్తే నిర్వాసితులకు వెచ్చించాల్సింది గణనీయంగా తగ్గగా గుత్తేదారులకు ఇవ్వాల్సింది మాత్రం అమాంతంగా పెరిగింది.

విదేశాలలో ఉద్యోగం పేరుతో నిరుద్యోగులకు కుచ్చుటోపీ

హైదరాబాద్ (మలక్‌పేట), ఆగస్టు 2 ప్రభాతవార్త: మాల్దీవ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 29 మంది విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.25 లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఒక హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని బాధిత విద్యార్థి తల్లి మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చంపాపేట గ్రీన్‌పార్క్ కాలనీలో నివాసముంటున్న సామ సుధారాణి కుమారుడు సామయోగేందర్‌రెడ్డి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్యన్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గత ఏడాది చేరాడు. మాల్దీవ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కొద్ది రోజుల క్రితం యోగేందర్‌రెడ్డి నుంచి కళాశాల నిర్వాహకులు రూ.4.25 లక్షలు తీసుకున్నారు. తమతో పాటు మరో 29 మంది విద్యార్థుల నుంచి ఇదే విధంగా కళాశాల నిర్వాహకులు డబ్బులు తీసుకున్నట్లు సుధా రాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులందరిని వర్క్ పర్మిట్ వీసాపై కాకుండా కేవలం విజిటింగ్ వీసాపై మాలేకు తీసుకువెళ్లిన కళాశాల నిర్వాహకులు అక్కడ దినసరి అద్దెపై ఒక గదిలో ఉంచారు. ఎలాంటి ఉద్యోగాలు ఇప్పించలేదు. దీంతో చేసేదేమి లేక 10 మంది విద్యార్థులు తిరిగి ఇంటికి చేరుకోగా మిగిలిన వారు అక్కడే దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఫిర్యాదురాలు పేర్కొన్నారు. విద్యార్థులను మోసం చేసిన నారాయణరెడ్డి, నందు, చైతన్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదురాలు పోలీసులను కోరారు.

హైదరాబాద్‌లో మహిళలను వేధిస్తున్న 87మందిని పట్టుకొన్న షీటీమ్ పోలీసులు

హైదరాబాద్ (నాంపల్లి) ఆగస్టు 2 ప్రభాతవార్త : గత నెలలో నగరంలోని వేర్వేరు ప్రదేశాలలో వివిధరకాలుగా వేధిస్తున్న 87 మందిని షీటీమ్‌కు పట్టుబడ్డారు. అందులో 72మంది మేజర్స్, 15 మంది మైనర్లు ఉన్నట్లు నగర క్రైమ్స్, సిట్ అదనపు పోలీసు కమిషనర్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల్లోకి వెళితే ... పట్టుబడ్డ వీరిలో ఇద్దరిపై నిర్భయ చట్టం కింద, మరో ఇద్దరిని ఐపిసి సెక్షన్ కింద, 10మందిపై పిట్టీ కేసులు, మిగతా వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. నిర్భయ చట్టం కింద సోషల్ మీడియా ద్వారా వివిధరకాల వేధింపులకు గురిచేస్తున్న తలాబ్‌కట్ట నివాసి 23 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగి మిర్జా మహ్మద్ అలీ బేగ్‌ను నేరం యొక్క మొత్తం సాక్ష్యాలను సేకరించి అదుపులోకి తీసుకున్నారు. ఇంకొక కేసులో సోషల్ మీడియా ద్వారా మాజీ సహోద్యోగిని వివిధరకాలుగా వేధిస్తున్న అభిషేక్ పెద్దిభొట్లను పూర్తి సాక్ష్యాధారాలు సేకరించి ఐటి చట్టం కింద కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్స్ పోలీసు స్టేషన్‌కు తదుపరి విచారణ చర్యల నిమిత్తం అప్పగించారు. అదేవిధంగా ఫోన్‌కాల్స్ ద్వారా మహిళను వేధిస్తున్న నకిరేకల్, నల్గొండ జిల్లా నివాసి 27 ఏళ్ల ఆవుల జానయ్యను షీటీమ్ పోలీసులు పూర్తి విచారణ తర్వాత అదుపులోకి తీసుకొని 507, 509 ఐపిసి కింద కేసు నమోదుచేసి ఉస్మానియా విశ్వవిద్యాలయ పోలీసు స్టేషన్‌లో తదుపరి చర్యల కోసం అప్పజెప్పారు. ఈ సందర్భంగా నగర క్రైమ్స్, సిట్ అదనపు పోలీసు కమిషనర్ బాధితులు నిశ్శబ్ధంతో బాధపడవద్దని, నగర షీటీమ్ పోలీసులకు 100 నంబరు కాల్ చేయడం ద్వారా, హాక్ఐ మొబైల్ యాప్ అప్లికేషన్ ద్వారా, వాట్సప్ యాప్ నంబరు 9490616555కు ఫిర్యాదు, హెచ్‌వై డిషీటీం ఎట్‌జిమెయిల్.కాం, ఫేస్‌బుక్ పేజీ షీటీమ్, హెచ్‌వైడిషీటీమ్స్‌కు ట్వీట్/ట్విట్టర్ ద్వారా, సరాసరి కళాంజలి, నాంపల్లి వద్దనున్న షీటీమ్ కార్యా లయం భరోసా సెంటర్‌కు వచ్చిగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు.

కల్లుగీత సొసైటీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి : పల్లె లక్ష్మణ్‌గౌడ్
తెలంగాణ గౌడ సంఘం నగర నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 2 ప్రభాతవార్త : నగరంలో సర్దార్ సర్వాయ్ పాపన్న భవనం నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే సహాయసహకారాలు అందించాలని, కల్లుగీత సొసైటీలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లెలక్ష్మణ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ గౌడ సంఘం హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం బొగ్గులకుంట, తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నగర, డివిజన్ల నూతన కార్యవర్గానికి ఎన్నికైన వారికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణ్‌గౌడ్ నియామకపత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18న సర్దార్ పాపన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

వార్త

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.

-సోక్రటీస్

ఆర్టీసిని ఆదుకోవాలి

లక్షలాది కార్మికుల శ్రమ, ప్రజల ఆదరాభిమానాలు దూరదృష్టి కలిగిన కొందరు అధికారులు, నేతలు చేపట్టిన చర్యలు, మరికొందరు త్యాగనిరతితో అంచెలంచెలుగా ఎదిగిన రోడ్డు రవాణా సంస్థ (ఆర్‌టిసి) నేడు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నది. ఒకనాడు రవాణా రంగంలోనే అద్వితీయ ప్రతిభను అసమాన సేవానిరతిని కనబరిచి గిన్నిస్‌బుక్‌ఆఫ్‌రికార్డును సంపాదించిన మన ఆర్టీసి రాజకీయ గ్రహణాలతో కనుమరుగైపోతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. కొందరు నాయకులు తీసుకున్న నిర్ణయాలు స్వార్థం, స్వలాభాపేక్ష,వీటన్నింటికి మించి పెరిగిన అవినీతి అక్రమాలతో నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్టీసి పరిస్థితి ఆందోళన కరంగా తయారైంది. ఈపార్టీ, ఆపార్టీ అని తేడా లేకుం డా అధికారంలోకి రాగానే ఒక విధానం అంటూ ఏమీలేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఆర్థికంగా ఆర్టీసికి గడ్డుపరిస్థితులు దాపురించాయి. అటు ఆంధ్రప్ర దేశ్‌లోకానీ,ఇటు తెలంగాణాలోకానీ అప్పుల భారంతో పాటు పెరిగిపోతున్న వడ్డీలు, సిబ్బంది నెలవారీ జీతాలు చెల్లించలేని పరిస్థితికి చేరుకుంటుందేమోననే అను మానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసి పరిస్థితి రెండు రాష్ట్రాల్లో ఇలా ఉంటే ఇదే తెలుగు రాష్ట్రాల్లో తిరుగున్న ప్రైవేట్ బస్సుల పరిస్థితి మూడు పర్మిట్‌లు ఆరు ట్రిప్పులుగా విరాజిల్లుతున్నది.

ఈ రోడ్డు రవాణా సంస్థకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. 1936లో నిజాం రైల్వేలోనే రోడ్డు రవాణా ఒక శాఖగా ఉండేది. 1950లో నిజాం రైల్వే భారత్ రైల్వేలో విలీనం కావడంతో 1951 అక్టోబరు 31వ తేదీన ఏజెన్సీ పద్ధతిలో రోడ్డు రవాణా ప్రత్యేక శాఖ ఏర్పడింది. 1958 జనవరి 11న పదహారు డిపోలు, 609 బస్సులు, ఐదు వేలఎనభైఒక్క కార్మికులతో రోడ్డురవాణా సంస్థ అవతరించింది. అప్పటి నుండి ప్రజాభిమానం చూరగొంటూ నేడు రెండు రాష్ట్రాల్లో రెండువందలకుపైగా డిపోలు, ఇరవై వేలకుపైగా బస్సులు లక్షకుపైగా సిబ్బందితో అతి పెద్ద రవాణా సంస్థగా ప్రపంచంలోనే అగ్రస్థానం సంపాదించింది. కానీ పెరిగిన రాజకీయ జోక్యం, మరికొందరు అసమర్థులు, అవినీతిపరులైన అధికారుల చర్యల వల్ల ఆర్టీసి అప్పులఊబిలో కూరుకపోవడం ప్రారంభమైందని చెప్పొచ్చు. ఒకపక్క అప్పులు వాటిపై వడ్డీ మరోకపక్క పెరుగుతున్న నిర్వహణ వ్యయంతో ఆర్థికంగా కుదేలైపోతున్నది. దూర ప్రాంతాల సర్వీసుల్లో కొన్ని లాభాలు వస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసికి పోటీగా ఉన్న రవాణా సదుపాయాన్ని నియంత్రించలేకపోవడంతో నష్టాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. గతంలో కూడా ఇలాంటి నష్టాల్లో ఆర్టీసి కూరుకుపోతున్నప్పుడు సమర్థులైన అధికారులను నియమించి నష్టాల బాట నుంచి తప్పించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడిగా ఉన్నప్పుడు నష్టాల్లో ఉన్న ఆర్టీసి విడిపోయిన తర్వాత కూడా ఆ పరిస్థితుల నుంచి బయటపడలేకపోతున్నది. కొన్నిసార్లు జీతాలు చెల్లించేందుకు సైతం బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవాల్సిన దుర్భరపరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే తెలంగాణాలో ఆర్టీసి వివిధ బ్యాంకుల నుండి 2,200 కోట్ల రూపాయల అప్పులు తీసుకుంది. వడ్డీరూపంలో ఏడాదికి రెండువందల కోట్లకుపైగా చెల్లించాల్సి వస్తుంది. నష్టాల్లో ఉన్న ఆర్టీసికి అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో మరింత ఊబిలోకి దిగబడిపోతున్నది. ఎవరి సలహానో మరెవరి ప్రేరణో కానీ వజ్రా పేరిట తెలంగాణ ఆర్టీసి చేసిన మిని బస్సుల ప్రయోగం విఫలమైందని చెప్పొచ్చు. ఇలా పాలకులు మారినప్పుడు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఆర్టీసికి నష్టాలు మరింత పెంచుతున్నాయి. మరొకపక్క పెరుగుతున్నడీజిల్, టైర్లు, ట్యూబ్‌ల తదితర విడిభాగాల ధరలను దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల ఛార్జీలను పెంచడం అనివార్యమవుతున్నది. ఇప్పటికే రైల్వేఛార్జీలకు ఆర్టీసి ఛార్జీలకు పొంతన లేకుండాపోయింది. మూడునాలుగింతలు రైల్వే ఛార్జీల కంటే ఆర్టీసి ఛార్జీలు అదనంగా ఉన్నాయి. దీనికితోడు ప్రైవేట్ వాహనాలు విజృంభించడంతో ప్రయాణీకులు ఆ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆటోలు, జీపులు, సెవెన్ సీటర్లు, డిసిఎంలు, మెటాడోర్ వాహనాలు, విచ్చలవిడిగా రోడ్లపైకివచ్చాయి. గతంలో యాభై అరవైవేలకు మించని ఈ వాహనాలు ఇప్పుడు ఏడు, ఎనిమిది లక్షలకుపైగా చేరుకున్నాయి. ఫలితంగా గ్రామాలకు వెళ్లేబస్సులో ఆక్యుపెన్సీ రేటు పడిపోయింది. ఇక ప్రైవేట్ బస్సుల విషయం ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. కొందరు నాయకులు ప్రైవేట్ బస్సులను వారి బంధు మిత్రుల పేరుతోనో, బినామీ పేరుతోనో, పర్మిట్‌లతోనేకాదు అసలు పర్మిట్‌లే లేకుండా నడుపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్ వాహనాలవల్ల ఆర్టీసికి ఏటా పదిహేనువందల కోట్ల రూపాయలకుపైగా ఆదాయాన్ని కోల్పోతుందని అధికారుల అంచనా. దీనికితోడు ఇష్టానుసారంగా ఇస్తున్న రాయితీలు సంస్థను కోలుకోనివ్వడం లేదు. రాజకీయ సభలకు, సమావేశాలకు ఆర్టీసి బస్సులను ఉపయోగించుకుంటున్న రాజకీయ పార్టీలవల్ల కూడా నష్టం జరుగుతున్నది. ఇన్నిరకాలుగా ఆర్టీసినుండి సేవలు అందుకుంటూ ప్రైవేట్‌కంటే ఆర్టీసిదగ్గర రెట్టింపు పన్నులు వసూలు చేస్తున్నారు. భారత రైల్వేలకు ప్రైవేట్ రంగంలో నడుస్తున్న విమానాలకు కూడా నాలుగుశాతం వాణిజ్య పన్నుతో ఇంధనాన్ని సరఫరా చేస్తున్న పాలకులు ఆర్టీసి విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారనే కార్మికులవాదనలో అర్థంలేకపో లేదు. రోజూ కోటిమందికి పైగా సేవలు అందిస్తూ లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న ఆర్టీసిని ఇలాంటి పరిస్థితులకు నెట్టివేయడం క్షంతవ్యం కాదు.

"వెయ్యిరూపాయలు, ఐదువందల రూపాయల నోట్ల రద్దుతో ఉగ్రవాదులకు, మావోయిస్టులకు నిధుల సరఫరా నిలిచిపోయింది."

■ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ



"చైనా ఏ దేశంలోని ప్రాంతాన్ని దురాక్రమించుకోదు. కానీ తన భూభాగాన్ని లాక్కోవాలని చూస్తే ఊరుకోదు."

■ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్



ప్రజావాక్కు



శ్రమైక సౌందర్యమే సంపద

పేదరికానికి మూలకారణాలు అధిక సంతానం. విద్యారాహిత్యం. విద్యలో నాణ్యత లేకపోవడం, శ్రమవల్లనే సంపద పొందగలమన్న ఆలోచనలేకపోవడం, దేశంలో పేదలు లేకపోతే రాజకీయ నాయకులకు మనుగడ ఉండదు. పేదలు ఆగ్రహిస్తేపాలక పక్షం అధికారాన్ని పోగొట్టుకుని ప్రతిపక్షానికి అవకాశం దక్కుతుంది. అందుకే అధికారంలో ఉన్నవారు తిరిగి గెలవటానికి ప్రతిపక్షంలో ఉన్నవారు పాలనాపగ్గాలు చేపట్టేందుకు పోటీపడి సంక్షేమ పథకాలను ప్రకటిస్తుంటారు. వేలాదికోట్ల నిధులు ఖర్చు చేసి పేదలను పరాన్న భుక్కులుగా చేసి రాష్ట్రాలను రుణగ్రస్తం చేస్తున్నారు. పరిమిత కుటుంబం, ప్రామాణికంగా విద్య, శ్రమ ద్వారానే సంపన్నులం కాగలమని పేదలు గ్రహించాలి. ఇందుకు అవసరమైన నైతిక విలువల గురించి బాల్యం నుంచే అవగాహన కల్పించాలి. అలాకాకుండా మేం తినిపిస్తాం, ఇళ్లిస్తాం, బట్టలిస్తాం, పెళ్లిచేస్తాం, మీరు చేయాల్సింది ఒక్కటే మాకు ఓటువేయండి. అన్న రాజకీయ నాయకులకు స్వస్తి చెప్పాలి.

● వులాపు బాలకేశవులు, గిద్దలూరు,ప్రకాశంజిల్లా

అసభ్య ప్రకటనలపై నిషేధం లేదా?

స్త్రీల అర్థనగ్నదృశ్యాలతో కూడిన వ్యాపారప్రకటనలు, చిత్రాలు ప్రసార మాధ్యమాల్లో పెచ్చరిల్లుతున్నాయి. ఇలాంటి వాటిని ప్రచురించడం, ప్రసారం చేయడం చట్టరీత్యా నేరం. అయినా నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక సెల్‌ఫోన్ ఇంటర్నెట్‌లో నీలిచిత్రాలు ఉంటున్నాయి. సెల్‌ఫోన్ కొనుక్కొని ఆదృశ్యాలు చూస్తు యువకులు దారి తప్పుతున్నా రు. మహిళల అశ్లీలచిత్రాలు యువతను రెచ్చగొట్టే విధంగా ఉంటున్నాయి. మహిళలపై అత్యాచారాలు జరగడానికి ఇదీ ఒక కారణం కావచ్చు. స్త్రీని గౌరవించడం భారతదేశపు సంప్రదాయం. భారతీయ మహిళల స్థాయిని తక్కువ చేసి చూపుతున్న ఇలాంటి ప్రకటనలను నిలువరించడానికి ప్రభుత్వం చొరవగా దీటైన చర్యలు తీసుకోవడానికి ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది.

● జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

హరితహారం గొప్ప ప్రయత్నం

వానలకు, వనాలకు సంబంధంఉన్నది. చెట్లులేకుండా వర్షాలు రావు. అందుకే తెలంగాణ వ్యాప్తంగా అడవుల శాతాన్ని పెంచి గ్రీన్ కవర్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మన ముఖ్యమంత్రి 'హరిత హారం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అడవులు 33 శాతం ఉండేట్లుగా ప్రభుత్వం ఈ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. మూడేళ్లలో 230 కోట్ల మొక్కలను అటవీ ప్రాంతాల్లో 100 కోట్లు, అటవీ ప్రాంతాల అవతల 120కోట్లు నాటడం జరుగుతుంది. మరో పది కోట్లు హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసి పరిధిలో నాటుతారు. ప్రతి గ్రామంలో 40 వేలు, ప్రతి నియోజకవర్గానికి 40లక్షలు లక్ష్యంగా పెట్టుకొని తెలంగాణప్రభుత్వం పచ్చదనాన్ని పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన గొప్ప ప్రయత్నాల్లో తెలంగాణ హరితహారం మూడవ అతిపెద్ద మానవ ప్రయత్నం.

● గుండమల్ల సతీష్‌కుమార్, నారాయణపురం

పొరుగు దేశాలతో జాగ్రత్త

దశాబ్దకాలం తర్వాత భారత ప్రధాని ఇజ్రాయిల్ దేశంలో పర్యటించి అనేక కీలక అంశాలలో ఒప్పందాలు కుదుర్చుకోవడం మోడీ దౌత్య విజయం. వ్యూహాత్మక అడుగుగా భావించవచ్చు. ముఖ్యంగా ఇప్పటిదాకా భారత్‌ను శత్రువుగా భావించిన ఇజ్రాయిల్ భారత్‌తో తన స్నేహసంబంధాలను, వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించుకునే విధంగాస్నేహహస్తం చాపడం శుభపరిణామం. అయితే ఇటీవలి కాలంలో పశ్చిమాసియాలో ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌కు బద్ధ శత్రువుఅయిన సౌదీ అరేబియా ఇజ్రాయిల్‌తో తన సంబంధాలు పునరుద్ధరించుకుంది. ఇరాన్ ఇజ్రాయిల్‌లో బహిరంగ యుద్ధం ప్రకటించింది. ఈ కారణంగా భారత్, ఇరాన్ సంబంధాలు దెబ్బతింటాయని మేధావులు అంచనా వేస్తున్నారు.

● సి.ప్రతాప్, శ్రీకాకుళరాస్ప

ఆస్పత్రిలో మూఢాచారాలా?

ప్రపంచంలో ఎక్కడా వినని, కనని వింత మన హైదరాబాద్ మహానగరంలోని ప్రభుత్వగాంధీఆస్పత్రిలో నెలకొనడం దురదృష్టకరం. ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో ఈ మధ్యకాలంలో బాలింతలు, శిశువుల మరణాలు అధికమయ్యాయని భావించి వాటిని నివారించేందుకు పటిష్టమైన వైద్యసేవలు అందించాల్సి ఉండగా దానిని విస్మరించి మూర్ఖమైన ఆలోచనలు చేసి ఆ వైద్య విభాగాధిపతి మూఢవిశ్వాసాలకు మోకరిల్లిఆస్పత్రిలో 'వాస్తుదోషం ఉందని అందువల్ల ఈమరణాలు సంభవిస్తున్నాయంటూ గాఢంగా విశ్వసించి నివారణ కోసం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. మూఢవిశ్వాసాలకు మోకరిల్లడం, వైద్యసేవలను అవహేళన చేయడం ఎంత బాధాకరం.

● బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్

అసలు దోషులు దొరకరా?

మొన్న నయీం వ్యవహారం, నిన్నమియాపూర్ భూకుంభకోణం, నేడు డ్రగ్స్ మాఫియా. ఎంతటి వారినైనా వదిలేది లేదు. చట్టం తనపని తాను చేసుకుపోతోంది. కాని జరుగుతున్నది ఏమిటి? ఇప్పటివరకు ఎవరూచట్టానికి పట్టుబడలేదు. చిన్నచితక వాళ్లు మాత్రమే తెరపైకి వచ్చారు. బడాబడా వ్యక్తులు వారి పుత్రరత్నాలు బాగానే ఉన్నారు. డ్రగ్స్ తీసుకున్న బాధితులు దోషులు కారు. వ్యాపారం చేసే వాళ్ల మాత్రందోషులు. కొత్తభాష్యాలు చెప్పుతున్నారు. మరి మద్యపానం తాగేవారిది తప్పా లేక వ్యాపారం చేసేవారిది తప్పా? ప్రభుత్వానికి ఏది అనుకూలమో అది చేస్తుంది.

● మిస్సుల శివరామకృష్ణ, హైదరాబాద్

ఆర్టీసి బస్సులను తగ్గించవద్దు

ఆర్టిసి వారు రాయచూర్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. రాయచూర్ పక్కనున్న సింధునూరు, సిరిగుప్ప లాంటి ప్రాంతాలలో తెలుగువారు నివసిస్తున్నారు. వీరు మన తెలుగు ప్రాంతాలకు తరచు ప్రయాణాలు చేస్తుంటారు. గతంలో రాయచూర్‌కు చాలా బస్సులు ఉండేవి. ఏ కారణం చేతనో కానీ ఈ ప్రాంతానికి చాలా బస్సులు రద్దు చేశారు. ఆర్టిసి తగుచర్యలు తీసుకోవాలి.

● షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

ఎడిట్ పేజీకి... ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

అవయవ దానానికి అవరోధాలెన్నో!

మోహన్‌రావు

దేశంలో కిడ్నీ, కాలేయం, గుండె, ఊపిరి తిత్తులు వంటి ముఖ్యమైన అవయవాల కోసం నిరీక్షిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. దాతలు కూడా తమ అవయవాలను దానం చేయడానికి అంతగా ఉత్సాహం చూపడం లేదు. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. సంప్రదాయ సంస్కృతి ఒకవైపు, అపోహలు మరోవైపు దాతలను సందిగ్ధావస్థలో పడేస్తున్నాయి. ఈ అపోహలు వట్టివే అని, అవయవ దానం చేయడం ప్రాణదానంతో సమానమని స్పష్టంగా అవగాహన కల్పించే వారు లేకపోవడం, అవయవాలను దాతల నుంచి వేరు చేసే ఏర్పాట్లు కూడా ఆస్పత్రుల్లో లోపించడం సమస్యగా పరిణమిస్తోంది.

ఏటా 85వేల మంది కాలేయ వైఫల్యరోగులు జాబితాలో చేరుతుండగా మూడు శాతం కన్నా తక్కువ మందే కాలేయ దానాన్ని పొందగలుగుతున్నారు. తాజాగా కిడ్నీవైఫల్యం చెందినరెండు లక్షల మంది రోగులు కిడ్నీల కోసం నమోదు చేయించుకోగా ఎనిమిదివేల మందే కిడ్నీలు మార్పించుకోగలిగారు. వేలమంది గుండె , ఊపిరితిత్తుల కోసం నిరీక్షిస్తున్నారు. వీరిలో ఒక్కశాతం మందికే సమయానికి దాతల నుంచి అవయాలు అందుతున్నాయి. గత అయిదేళ్లలో అవయవదానం నాలుగింతలు పెరిగినా డిమాండ్, సరఫరా మధ్య భేదం యథాస్థితిలోనే కొనసాగుతోంది. ఏటా 2.5 లక్షల మరణాలు అవయవాల వైఫల్యం వల్లనే జరుగుతున్నాయి. భారతదేశంలో అవయవదానం స్థాయిని పరిశీలిస్తే 2016లో మిలియన్ జనాభాకు 0.8 శాతం మంది మాత్రమే దాతలు ఉన్నట్టు తేలింది. స్పెయిన్‌తో పోల్చుకుంటే మిలియన్ జనాభాకు 36 శాతం మంది క్రోటియల్ 32 శాతం, అమెరికాలో 26శాతం అవయవదాతలు ఉన్నట్టు స్పష్టమయింది. దేశంలో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రెండు అవయవదానంలో చురుకుగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా, ఈశాన్యరాష్ట్రాలు ఇంకా చొరవ చూపాల్సి ఉంది. అయితే చాలామంది అవయవదానం చేయడానికి అపోహలు ఎదురవుతున్నాయి. ఏవైనా కేసులో ఇరుక్కుంటామేమోనన్న భయం కూడా కొందరిలో ఉంది. కొందరు తమ అవయవాలను దానం చేయడానికి సిద్ధపడినా ఆ అవయవాలను సేకరించే ఏర్పాట్లు ఆస్పత్రుల్లో ఉండటం లేదు. కానీ దేశంలో చాలా అవయవాలు ఎవరికీ దానం ఇవ్వకుండానే వృథాఅవుతున్నాయి. ఈసందర్భంగా నేషనల్ ఆర్గన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డాక్టర్ విమల్ భండారి ఈ అవయవదానంపై కొన్ని వివరాలు తెలియచేశారు. అవయవాలకు ఎంత కొరత ఉందో, ఎన్ని లక్షల మంది అవయవదాతల కోసం ఎదురుచూస్తున్నారో ప్రభుత్వానికి తెలుసునని చెప్పారు. ప్రపంచంమొత్తంమీద అవయవదానం, సేకరణల్లో అగ్రగామిగా ఉన్న స్పెయిన్ దేశంలో భారత్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. దాదాపు 100దేశాలు స్పెయిన్ విధానాలను నేర్చుకుంటున్నాయని తెలిపారు. మనదేశంలోని అయిదు రీజినల్ కో ఆపరేటివ్ సెంటర్లకు చెందిన అయిదుగురికి అవయవాల సేకరణ విధానాలపై స్పెయిన్ నిపుణులు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రూపొందించడానికి స్పెయిన్‌కు 30ఏళ్లు పట్టిందని అన్నారు. అయితే స్పెయిన్ దేశంలోలా కాకుండా మనదేశంలో బ్రెయిన్‌డెత్ కేసులు ఎక్కువగా హెమరేజి వల్ల జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలే ఈ దారుణాలకు కారణాలవుతున్నాయి. ఇప్పుడు భారతదేశంలో కూడా అవయవ సేకరణ, దానాలకు సంబంధించి మౌలిక వనరుల సదుపాయాల ఏర్పాటు విస్తృతమవుతోంది. నగరాలు, రాష్ట్రాల మధ్య అవయవదానం పంచుకునేలా నేషనల్ నెట్ వర్కు కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. గత ఏడాది ఇద్దరు విదేశీయులకు ఇక్కడ గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేసి సంరక్షించినట్టు డాక్టర్ భండారీ చెప్పారు. దేశం మొత్తం మీద ఈ విషయంలో దశాబ్దకాలంగా తమిళనాడు ముందడుగు వేస్తోంది. కుటుంబాలు పోస్టుమార్టమ్‌కు ముందే అవయవాలను దానం చేయడం జరుగుతోంది. అభివృద్ధిచెందిన దేశాల మాదిరిగా తమిళనాడు రాష్ట్రంలో కిడ్నీ, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ఆస్పత్రులు ఉచితంగానే చేస్తున్నాయి. మహారాష్ట్రలో గత ఏడాది 100 అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. గత అయిదేళ్లలో1064 అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. ముంబై కన్నా పూనెలో అవయవదానం ఎక్కువగా జరుగుతోంది. 2017 ఏప్రిల్ వరకు 69 అవయవ దానాలు జరిగాయి. హైదరాబాద్, తెలంగాణాలోని ఇతర జిల్లాల్లో 2013 వరకు వెయ్యి వరకు అవయవదానాలు జరిగాయి. మిలియన్ జనాభాకు ఒకశాతం కన్నా తక్కువగా అవయవదానం అందుతుంది. అయితే ఇప్పుడు అవయవదానం 4.4 శాతానికి పెరిగింది. 2013లో 41అవయవదానాలే జరగ్గా 2016లో 106 అవయవదానాలు, 2017లో ఇప్పటి వరకు 80 దానాలు జరగడం విశేషం. అయితే చాలా కేసుల్లో బ్రెయిన్‌డెత్‌ను నిర్ధారించి ప్రకటించడానికి డాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. అందుకని ఈ విషయంలో డాక్టర్లకు పూర్తి అవగాహన అవసరం. ఇది ప్రభుత్వ ఆస్పత్రుల్లో వాస్తవంగా జరుగుతోంది. కర్ణాటకరాష్ట్రంలోనూ అవయవదానం శాతం పెరుగుతోంది. 2013లో 18 అవయవ దానాలు జరగ్గా 2016లో 70 వరకు దానాలు పెరిగాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వం అవయవ దాన ప్రక్రియను జీవన సార్థకత పేరున అధికారికంగా పారదర్శకంగా నిర్వహిస్తోంది. ఆధార్‌కార్డులతో ఈ ప్రక్రియను అనుసంధానం చేసింది. దాతలు తమ ఆధార్‌కార్డుల నమోదుద్వారా అవయవాలనుసులువుగా దానం చేయవచ్చు. కేరళ వంటి రాష్ట్రాలు ఈ విషయంలో కొన్ని సమస్యలతో వెనుకబాటులో ఉన్నాయి. 2016లో 73 అవయవమార్పిడి జరగ్గా ఈ ఏడాది ఇప్పటికి 11 మాత్రమే జరిగాయి.

అవయవదానం అంటేప్రాణదానంతో సమానం. శరీరంలో ముఖ్యమైన అవయవాలు దెబ్బతిని చావుబతుకుల మధ్య అల్లాడుతున్న దీనులకు కావలసిన అవయవాలు సకాలంలో అందించగలిగితే మరి కొన్నేళ్లు బతకడానికి వీలవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో అవయవదానానికి డిమాండ్ బాగా పెరుగుతోంది. కిడ్నీ, నేత్రాలు, కాలేయం వంటి ఇంద్రియ అవయవ దానానికి ఎంతో డిమాండ్ ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఈ అవయవాలు ఎవరు దానానికి కాకపోయినా విక్రయిస్తే కొన్ని లక్షలు ధారపోసి కొనుక్కుందామని అవయవ అర్థులు ఆరాటపడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని అవయవదానం భారీవాణిజ్యంగా మారింది. అవయవాలను దాతల నుంచి సేకరించడంలో కొంతమంది డాక్టర్లు ఆస్పత్రుల సిబ్బందితో పాటు మరికొంతమంది కుమ్మక్కుయి'మాఫియా'గా విస్తరిస్తున్నారు. వర్ధమానదేశాలు భారత్, పాక్ వంటివి ఈ వాణిజ్యానికి ఆధారంగా విస్తరిస్తున్నాయి. గల్ఫ్, ఆఫ్రికా, బ్రిటన్‌కు చెందిన కొందరు మాఫియా సూత్రధారులుగా అవయవాల మార్కెట్‌ను దర్జాగా సాగిస్తున్నారు. కొన్ని కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇటీవలనే పాకిస్థాన్‌లోని లాహోర్, ఇస్లామాబాద్ ఆస్పత్రుల్లో భారీ ఎత్తున సాగుతున్న కిడ్నీవాణిజ్య రాకెట్ అధికారుల దాడుల్లో బట్టబయలయింది. ఈ మాఫియా ఏజెంట్లు పద్ధతి ప్రకారమే ప్రభుత్వ అనుమతులు పొంది కిడ్నీ దాతల నుంచి కిడ్నీలను సేకరించగలగడం విశేషం. ఆ తరువాతనే ఈకిడ్నీలు మార్కెట్ రంగంలో చెలామణి అవుతున్నాయి. అనుమతులు పొంది, శస్త్రచికిత్సలు నిర్వహించడానికి ఒక్కొక్కరికి 23వేల డాలర్ల వరకూ ఖర్చవుతోంది. కిడ్నీలు (మూత్రపిండాలు) వైఫల్యంతో పాకిస్థాన్‌లో ఏటా 25వేల మంది ఆస్పత్రులకు వస్తున్నారు. వారు ఆస్పత్రుల్లో చేరిన తరువాత బయట వేరే ఆస్పత్రుల్లోమూత్రపిండాలు విక్రయిస్తున్నారని తెలిసివెంటనే అక్కడకు తరలిపోతున్నారని ప్రభుత్వ డాక్టర్లు కొందరు ఉదహరించడం గమనార్హం. ఏటామూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్న వారిలో10శాతం మంది మాత్రమే డయాలిసిస్ చేయించుకోగలుగుతున్నారు. 2.3శాతం మాత్రమే కిడ్నీమార్పిడి చేయించుకొంటున్నారని కరాచీకి చెందిన సింధ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ అండ్ ట్రాన్స్‌ప్లాంట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ ప్రాంతీయ వైద్యుడు డాక్టర్ అమ్మాద్ పేర్కొన్నారు. ఈ డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లోని కూలీ బతుకులకు గొప్పవరంగా అవకాశం కల్పిస్తోంది. ఫ్యాక్టరీల్లో, వ్యవసాయంలో, ఇటుకబట్టీల్లో కూలీలుగా పనిచేస్తున్న పేదలు తమ అవసరాల కోసం చేసిన రుణాలు తీరడానికి తమ పిల్లలను కూడా ఆయా పనుల్లో పెట్టినా చాలీచాలని వేతనాలతో చివరకు కిడ్నీలను అమ్ముకోడానికి సిద్ధపడి కోరి కిడ్నీ రాకెట్ మాఫియా వర్గాలను ఆశ్రయిస్తున్నారు. పాకిస్థాన్ అధికార యంత్రాంగం ఈ ఏప్రిల్‌లో లాహోర్‌లో ఈ రాకెట్ గుట్టు బట్టబయలు చేయగలిగింది. ఈ సందర్భంగా 16 మందిని అరెస్టు చేశారు. ఇదే విధంగా ఇస్లామాబాద్ జనరల్ ఆస్పత్రిలో సాగుతున్న రాకెట్‌ను పట్టుకోగలిగారు. కిడ్నీలు అరుదుగా లభించడంతో ధనికులు ఎన్ని లక్షలయినా ఇచ్చి కిడ్నీలను కొనుక్కొంటున్నారు. ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం పాకిస్థాన్ ముస్లింలు ఎవరూ తమ మూత్రపిండాలను దానంఇవ్వడానికి లేదా విక్రయించడానికి ఇష్టపడడం లేదు. అందువల్ల కిడ్నీ మాఫియా రాకెట్ గ్రామాల్లోని పేదవర్గాలపై వల విసురుతోంది. చాలా తక్కువగా డబ్బిచ్చి కొనుగోలు చేస్తోంది.

అన్ని దేశాలకన్నా భారత్, పాకిస్థాన్ దేశాల్లోనే తక్కువ ధరకు అవయవాలు ముఖ్యంగా మూత్రపిండాలు లభిస్తుండడంతో వివిధ దేశాల నుంచి ప్రధానంగా గల్ఫ్, ఆఫ్రికా, బ్రిటన్ దేశాల నుంచి ఏజెంట్లు వచ్చి అవయవాల క్రయవిక్రయాలు నిరాఘ టంగా సాగిస్తుండటం పరిపాటి అయింది. కొన్ని దేశాల్లో ఇది పరిమితం అయినప్పటికీ పాకిస్థాన్, భారత్ వంటి దేశాల్లో అవయవ దానం, విక్రయాలు నియంత్రణకు పదునైన చట్టాలు లేవు. ఈ సందర్భంగా పాక్ ప్రభుత్వం హ్యూమన్ ఆర్గన్స్ ట్రాన్స్‌ప్లాంట్ అథారిటీ (హెచ్ఒటిఎ) ప్రస్తుత చట్టాలకు అంత పదును లేదని వ్యాఖ్యానించింది. దాతలు తమ అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తే తాము చేసేదేమీ లేదని పేర్కొంది. అయితే ఏప్రిల్ 30న లాహోర్ ఆస్పత్రిపై దాడి చేయడంతో కఠిన చర్యలకు శ్రీకారం చుట్టినట్లయిందని ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఎ) డిప్యూటీ డైరెక్టర్‌జమ్మిల్ అహ్మాద్ ఖాన్‌మేయో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉన్న చట్టాలు ప్రొవిన్షియల్ అథారిటీ చేతులో ఉన్నాయని అధికార పరిధుల్లో వాటికి పరిమితులున్నాయని జమీల్ అహ్మాద్ చెప్పారు. ఈ ఏడాది మార్చి వరకు ఉన్న ఆంక్షలను ఆ తరువాత సడలించడంతోనే దాడులు చేయడానికి స్వేచ్ఛ లభించింది. ఇంత వరకు కిడ్నీల రాకెట్‌కు స్థావరంగా అవయవాల అక్రమ వ్యాపారానికి స్వర్గధామంగా ముద్రపడిన పాకిస్థాన్ ఇప్పుడు సాగుతున్న దాడులు, అరెస్టుల కారణంగా అపఖ్యాతిని తుడుచుకోవడానికి అవ కాశం కలిగింది.

నిధులున్నా సాగని బడిచదువులు

దొరయ్య

దేశవ్యాప్తంగా జరిగిన సర్వే ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 600కుపైగా జిల్లాల్లో 44 శాతానికిపైగా బడులకు తరగతి గదులు సరిగ్గా లేవని తేలింది. విద్యాహక్కు చట్టంకింద8కోట్లమంది బాలలను బడిబాట పట్టించాలని, ఉపాధ్యాయ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. అదనపు తరగతి గదుల ఏర్పాటుతోపాటు బోధకుల నియామకంవంటి కార్యక్రమాల అమలుకు సర్వశిక్షా అభియాన్ కింద 2005-06లో కేంద్రం 7156 కోట్లు కేటాయించింది. ఆ తరువాత సంవత్సరం 10,004కోట్ల వరకు కేటాయింపు పెంచారు. 2011-12 బడ్జెట్‌లో 40 శాతం అధికంగా కేటాయించారు. ఆ తరువాత ఏడాది రూ. 25,555 కోట్ల వరకు నిధులు పెంచారు. ఇలా కేటాయింపులు పెరుగుతున్నాయే తప్ప ప్రధాన సమస్యలు పరిష్కారం కావడంలేదు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం దేశంలోని వివిధ పాఠశాలల సంఖ్య 13లక్షలు. వాటిలో 10.3లక్షలకుపైగా ఉపాధ్యాయపోస్టులు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. దేశంలో ఏకోపాధ్యాయులతో నెట్టుకొస్తున్న బడులు లక్షకుపైగా ఉన్నాయి. జార్ఖండ్‌లో 70 శాతం, ఉత్తరప్రదేశ్ లో సగం మాధ్యమిక పాఠశాలల్లో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాలల్లో 20000, తెలంగాణలో 14000 పోస్టులు ఇంకా భర్తీ కావలసి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాహక్కు బాలలకు కల్పించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తేనే తప్ప పసివాళ్ల చదువులు సజావుగా సాగవు. ఇక మిగతాసమస్యలను పరిశీలిస్తే పాఠశాలల పరిసరాలుకూడా విద్యార్థుల చదువుకు ఆటంకాలు కలిగించే విధంగా ఉంటున్నాయి. కొన్ని పాఠశాలల పక్కనే మద్యపాన విక్రయాలు జరుగుతుండడం, అలాగే తాగుబోతులు బెడద ఎక్కువగా ఉండడం దురదృష్టకరం. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు లందుతున్నా పట్టించుకోవడం లేదు సరికదా ఆ ప్రాంతం నుంచి మద్యం షాపులనుతరలిస్తే ఆదాయం తగ్గిపోతుందని సాకులు చెప్పడం విస్మయం కలిగిస్తోంది.

కొన్ని గ్రామాల్లో పాఠశాలల పక్కనే స్మశాన వాటికలు ఉండడంతో దహన క్రియలు ఎప్పుడు జరిగినా ఆ పొగ అంతా పాఠశాల గదుల్లోకి కమ్ముకురావడం, విద్యార్థులు భరించలేని ఆ దుర్గంధంతో ముక్కులు మూసుకొని కూర్చోవాలసి రావడం, శవాల పూడ్చివేత, ఇతర అంతిమక్రియలు విద్యార్థులు కళ్లె దుటే జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇవన్నీ చదువులకు ఆటం కాలు కలిగిస్తున్నాయి. కొన్ని పాఠశాలలను ఆయాగ్రామాల పెత్తందారులు బందెలదొడ్లుగా వాడుతున్నారు. దానివల్ల తరగతిగదుల్లో పరిశుభ్రత కనపడకుండా పోతుంది. రాత్రిపూట జూదరులు, వ్యభి చారులు, తరగతి గదుల్లోకి చొరబడటం అసాంఘిక కార్యకలాపాలు సాగించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల గిరిజన ప్రాంతాల్లో పాములు, తేళ్లు, మొదలైన విష ప్రాణులు తరగతి గదుల్లోకి పాకుతున్నాయి. గిరిజనప్రాంతాలలో పాఠశాల ఆవరణలోనే పాముకాటుకు విద్యార్థులు గురైన సంఘటనలు ఎన్నో జరిగాయి. మధ్యాహ్నభోజనం తయారు చేయడానికి వేరేషెడ్‌లు కావలసి ఉండగా పాఠశాల ఆవరణే వంటశాలగా మారుస్తున్నారు. ఇలా ఉంటే చదువులు ఎలా ముందుకు సాగుతాయో ఆలోచించాలి. బాలలకు చదువు రాజ్యాంగ పరమైన హక్కుఅన్నది ఎవరూ కాదనలేరు. చదువుకోవడానికి నెలవైన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకుంటే చదువు ఎలా వంటబడుతుంది? అలాగే పాఠశాలల పరిసర వాతావరణం కూడా విద్యార్థులు ప్రశాంతంగా చదువుపైనే దృష్టి కేంద్రీకరించేందుకు అనువుగా ఉంటే తప్ప చదువు సాగదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు చదువుకోవడానికి కావలసిన సదుపాయాలు సమకూర్చడంలో విఫలమవుతున్నారు. విద్యార్థులను బడిబాట పట్టించాలంటే మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్న లక్ష్యంతో తెలుగురాష్ట్రాలు ముందుకు కదులుతున్నాయి. దశలవారీగా ప్రాథమిక సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేకనిధిని ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ నిర్ణయించగా వందకోట్ల రూపాయలతో పాఠశాలల్లో ఐదువేల శౌచాలయాలు నిర్మించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. అయితే పాఠశాలలకు ఎన్నోసమస్యలు పట్టిపీడిస్తున్నాయి.

పక్కా రెవెన్యూ వ్యవస్థతోనే భూ సమస్యల పరిష్కారం

రావుల రాజేశం

ఎన్నో దశాబ్దాల నుండి గ్రామస్థాయిలో చిన్నాభిన్నమైన రెవెన్యూ రికార్డులను సరిదిద్ది, నిజమైన పట్టాదారులకు భూములు అందించడానికి ప్రభుత్వం నడుం బిగించటం హర్షణీయం. నిజాం కాలంలో ఉన్న సర్వే నెంబర్లు ఇప్పటికి ఉన్నాయి. 'మోఖా' మీద ఉన్న వారికి న్యాయం జరగలేదు. గత 50 ఏళ్లుగా పాలకులు రెవెన్యూ శాఖ మీద నిఘా పెట్టకుండా గ్రామానికో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌లను నియమించకుండా పాలనను భ్రష్టుపట్టించారు. పట్టాదారుల పేర్లు రెవెన్యూ రికార్డులనుంచి చాలా చోట్ల అవినీతి రెవెన్యూ అధికారులు మాయం చేశారు. భూమి ఎవరిది? పట్టాదారు ఎవరి పేరిట ఉంది? కబ్జాదారు నిజంగా ఎవరు ఉన్నారో ఇప్పటిదాకా రెవెన్యూ యంత్రాంగానికి తెలియదు. తెలంగాణలోని 13జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో రెవెన్యూ రికార్డులు తప్పుల తడకగా ఉన్నాయి. తమ పేర్లు తప్పు పడ్డాయని సవరించాలని రైతులు కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన సందర్భాలు అనేకం. గ్రామస్థాయిలో విలేజి రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్ఎ) విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోస్టుల్ని భర్తీచేయకపోవడం వల్ల గ్రామస్థాయి రెవెన్యూ రికార్డులు, ట్యాంపరింగ్‌కు గురయ్యాయి.

తెలంగాణా సర్కారు ఇటీవల రైతు సమగ్ర సర్వే నిర్వహించింది. అన్ని ఆధారాలు వ్యవసాయ అధికారులు జిరాక్స్‌లతో సహా సేకరించారు. రెవెన్యూ శాఖ ద్వారా పట్టాదారులు అయితేనే ఎకరానికి నాలుగువేలు ఇస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ప్రకటించడంతో భూముల మీద రైతుల దృష్టి మళ్లింది. రైతు సమగ్ర సర్వేలో రైతులు ఇచ్చిన డేటా కరెక్టేనా? కాదా! అనే విషయమై తెలంగాణ సర్కారు సందిగ్ధంలో పడింది. ఒక్కో జిల్లాలో ప్రభుత్వ భూములు ఎన్ని? ప్రైవేట్ భూములు ఎన్ని? సాగులో ఉన్న భూములు ఎన్ని? పడావు ఉన్న భూములు ఎన్ని?దేవాదాయ శాఖ భూములు ఎన్ని? ఫారెస్టు డిపార్టుమెంట్ భూములు భద్రంగా ఉన్నాయా? అనే విషయాలను సమగ్రంగా తెలుసుకోడానికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు తెలంగాణ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. ఆన్‌లైన్ పత్రాల్లో అక్షర దోషాలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సర్వే నెంబర్లు ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. ఇంతకాలం ఐబి పొంద డానికి రైతులు పడుతున్న కష్టాలకు చరమగీతం పాడాలని పాలకులు నిర్ణయించారు. ఆగస్టు నెలలో నోటిఫికేషన్ ఇచ్చి మూడు నెలల్లో రికార్డుల ప్రక్షాళన పూర్తిచేయనున్నారు. గత నెలలో వ్యవసాయశాఖ అధికారులు రైతు సమగ్ర సర్వేకోసం ఊరూరు తిరిగినప్పుడు రెవెన్యూశాఖ వల్ల రికార్డుల తప్పులతడకగా ఉన్న విషయం బయటపడింది. భూములవిస్తీర్ణం, పట్టాదారులు, కబ్జాదారుల మధ్య భారీ తేడాలు బయటపడ్డాయి. చనిపోయిన వారి పేరిట పట్టా ఉండరాదు. 'విరాసత్' కోసం మృతుని వారసులు దరఖాస్తు పెట్టుకున్న తహశీల్దార్ కార్యాలయాల్లో 'విరాసత్' చేయడం లేదనే విషయం బయటపడింది. ఒక సర్వేనెంబర్‌లో మూడు నుండి ఆరుగురికి పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వేనెంబర్, కబ్జాదారులు, దరఖాస్తుదారుల వివరాలకు పొంతన లేదు. వచ్చే ఏడాది నుంచి నిజమైన రైతులకు పంటకు ఎకరాకు నాలుగువేల చొప్పునబ్యాంక్ అకౌంట్‌లో జమచేయాలని ముఖ్యమంత్రి సర్కారు నిర్ణయించడంతో గ్రామాల్లో గందరగోళం ఏర్పడింది. రైతులు భూముల తప్పులను సరిచేయించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. రైతు సర్వేలో పట్టాదారుల వివరాల సేకరించారు. వాటిని కంప్యూటరైజింగ్ చేస్తున్నారు. రైతుల పహాణి, 1బి పత్రాలను రెవెన్యూ అగ్రికల్చర్ అధికారులు సేకరిస్తున్నారు. తప్పులతడకగా ఉన్న రెవెన్యూ రికార్డులను సవరించి నూతన పాసు పుస్తకాలను డిజిటల్‌గా అందించడానికి నిర్ణయించడం మంచిదే. రెవెన్యూరికార్డుల ఆధారంగా సర్వేనెంబర్ల వారీగా క్షేత్రస్థాయికి పరిశీలించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. భూ సర్వేలో భూముల వివరాలు పక్కాగా నమోదుకానున్నాయి. తెలంగాణ, ఆంధ్ర, రాష్ట్రాల్లో ఎక్కువమంది రైతులు '1బి'సమస్యను ఎదుర్కొంటున్నారు. దరఖాస్తులో పేరు ఉన్నా, పట్టాలో పేరులేని వారెందరో, ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న1బి అసలేరాదు. భూమిని ఎన్నోఏళ్ల నుంచి అనుభవిస్తున్న వారి పేర్లు ఎక్కడ నమోదుకావు. భూములు కొన్న రైతులకు పాసు పుస్తకాలు అందడంలేదు. సాదాబైనామాలో భూములు కొన్న వారికి ఆర్.వో. ఆర్ ద్వారా భూములు రికార్డులకు లెక్కలేదు. విరాసత్ కోసం అధి కారుల మామూళ్ల పర్వం తప్పడం లేదు. రైతులకు పూర్తి హక్కులు ఉండాలంటే పట్టాదారు పాస్ పుస్తకం టైటిల్ రేడ్, 1బి పట్టాలోకి ఎక్కవలసి ఉండగా 50 శాతం భూములు ఎక్కడంలేదు. ప్రజావాణి కార్యక్రమాల్లో రెవెన్యూ తప్పుల మీద దరఖాస్తులు పెట్టి చేసేది లేక తలపట్టుకుంటున్న రైతులు ఉన్నారు. భూములను రెండు రకాల జాబితాలో సర్వే చేస్తారు. 11 అంశాలతో కూడిన ప్రశ్నావళి ఉంటుంది. ఇందులో మృతుల పేరిట విస్తీర్ణం ఎంత? బాధితుల స్వాధీనంలోనే భూములు ఉన్నాయా? అనే విషయాలు సేకరించనున్నారు. మృతుని వారసుల స్వాధీనంలో కబ్జాలో భూమిఉండే విరాసత్‌ద్వారా పట్టాహక్కులు తక్షణమే కల్పించనున్నారు. రెండో జాబితాలో 20 అంశాలు ఉంటాయి. ఇందులో సర్వేనెంబర్ ఆధారంగా విస్తీర్ణంఎంత?పట్టాదారుజీవించి ఉన్నాడా? సర్వేనెంబర్‌లో విస్తీర్ణం ప్రకారంగా పట్టాదారులు పాసు పుస్తకాలు కలిగి ఉన్నారా? అనే వివరాలు క్షేత్రస్థాయికి వెళ్లి పక్కాగా నమోదు చేయాలి. ఒక సర్వేనెంబర్‌లో ఎక్కువ మందికి భూములు ఎక్కువ, తక్కువ అనే విషయాలను తేల్చనున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి నిజమైన పట్టాదారులకు పహాణీ, 1బిలను సవరించి జారీ చేయడం జరుగనున్నది. ఎంతకాలం కాళ్లరిగేలారెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా భూ సమస్యలు పరిష్కారం కాలేదు. కాని రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం తర్వాత కష్టాలు తీరనున్నాయి.

రైతు ఆధార్ నెంబర్ క్లిక్‌చేస్తే సదరు రైతుకు సంబంధించిన సమగ్ర సమాచారం లభించేలా కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. నేలల స్వభావం, పంటలు పండే అవకాశాలు, ప్రభుత్వం నుండి ఎన్ని పథకాలు పొందారు?ఎన్ని పథకాల ద్వారా సబ్సిడీ పొందారు? అనే వ్యవహారం బయటపడితే ఇప్పటికి ఒక్క సర్కారు రుణం, సర్కారు ట్రాక్టర్ పొందని రైతులకు న్యాయం జరుగనున్నది. ప్రతి గ్రామానికి ఒక వి.ఆర్.వో పోస్టు ఉంటే మంచిది. రాష్ట్రంలో ఎనిమిది వేల గ్రామ పంచాయితీలున్నాయి. ప్రస్తుతం మూడువేల విలేజ్ రెవెన్యూ అధికారుల పోస్టులు ఖాళీగా ఎన్నో ఏళ్ల నుండి ఉన్నాయి. ప్రతి వి.ఆర్.వోకు నాలుగు గ్రామాల పాలన బాధ్యతలు ఇస్తే ఏం లాభం. రెవెన్యూ సర్వేయర్లు వి. ఆర్వో, తహశిల్దార్లు, కార్యాలయ సిబ్బంది వంటి ఎనిమిదివేల ఖాళీ లను సర్కారు భర్తీచేస్తే రెవెన్యూ పాలన గాడినపడే అవకాశం ఉంది.

బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలి

- చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్స్‌లు రద్దు - ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి - అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశం

విజయవాడ, ఆగస్టు 2, ప్రభాతవార్త: మద్యం బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్స్‌లు రద్దుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను స్పష్టం చేశారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎన్ని బెల్ట్‌షాపులను తొలగించింది. ఎన్నీ కేసులు నమోదు చేసింది వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, అధిక ధరలకు ఇసుక అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 294ఇసుక రీచ్‌లను తెరిచినట్లుగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 1.45కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక గుర్తించామని, ఉచిత ఇసుక విధానం కింద 68.58లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగంలో వచ్చిందని, జూలై నెలాఖరుకు 76.82లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని, పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. కొత్త రీచ్‌లు తెరవడం ద్వారా ఇసుక అందుబాటును పెంచాలన్నారు. ప్రతి నెలా జిల్లా స్థాయి కమిటీలు ఇసుక ధరలను సమీక్షించి మైనింగ్ కార్యదర్శికి నివేదికలు పంపాలన్నారు. ఇసుక, మద్యం, భూములపై అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



జవాబుదారీగా ఉంటేనే గౌరవం పెరుగుతుంది

ప్రజలకు జవాబుదారీగా ఉంటేనే పాలకులు, అధికార యంత్రాంగం గౌరవం పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అవినీతికి పాల్పడితే వ్యవస్థలపై నమ్మకం పోతుందన్నారు. నమ్మకాలు పోతే విశ్వసనీయత దెబ్బతింటుందంటూ, తనను ప్రజలు అపార్థం చేసుకునే పరిస్థితి వస్తుందని చెప్పారు. ప్రజలు, పాలనా యంత్రాంగం మధ్య సత్సంబంధాలు ఉండేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ దోహదపడుతుందన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకోవాలని, త్వరితగతిన స్పందించాలని, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాజకీయ లాభాల కోసం కొందరు సృష్టిస్తున్న వదంతులను నమ్మవద్దని ముఖ్యమంత్రి కోరారు. బాగా పనిచేయాలని, జవాబుదారీగా ఉండాలని చెబితే ఉద్యోగులను తొలగిస్తున్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నారనా ఆవేదన వెలిబుచ్చారు. గతంలో కఠినంగా వ్యవహరిస్తే భయంతో పనితీరు మందగించిందని, అందుకే ఉద్యోగులకు నచ్చజెప్పి పనిచేయిస్తున్నానని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి, నియంత్రణపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్న విషయం ప్రస్తావించారు. సమస్యల పరిష్కారమే మన కర్తవ్యమని, సుస్థిర ఆర్థికాభివృద్ధే మన లక్ష్యమని తెలియజేశారు.

ఒకటి శాతం అవినీతిని నిరోధించడం అసాధ్యం ఏమీకాదు

పెన్షన్ల పంపిణీపై ప్రజల్లో 97 శాతం సంతృప్తి వచ్చిందని, దీనిని 100 శాతం తీసుకెళ్లడం పెద్ద కష్టమేమీ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖ పట్టాల పంపిణీపై 98శాతం సంతృప్తి వ్యక్తం చేశారని, కేవలం ఒకటి శాతం మాత్రమే అవినీతిపై ఫిర్యాదు చేశారని, దీనిని పూర్తిగా నియంత్రించడం అసాధ్యం ఏమీకాదన్నారు. ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని 70 శాతం కోరారంటూ, దీనిపై ప్రభుత్వ యంత్రాంగం పూర్తిదృష్టిసారించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఎక్సైజ్ మంత్రి జవహర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ లక్ష్మీనరసింహం, వెంకటేశ్వరరావు, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ శ్రీధర్, రియల్ గవర్నెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తోంది: మంత్రి కామినేని



బుధవారం మండవల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్

మండవల్లి, అగస్టు 2, ప్రభాతవార్త: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశ ప్రభుత్వం భాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తునట్లు వైద్యఅరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కృష్ణాజిల్లా మండల కేంద్రమైన మండవల్లి గ్రామంలో రెవెన్యూశాఖ ఏర్పాటుచేసిన మీ ఇంటికి – మీభూమి కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రసుత ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకున్నదని ఈ ఏడాది కృష్ణానదీ జలాలతో నాట్లు వేయడం సాధ్యపడేదికాదని ముఖ్యమంత్రి ముందుచూపు కారణంగా పట్టిసీమ ద్వారా గోదావరి నదీ జలాలను కృష్ణానదికి మళ్లించుట కారణంగా ఈ ఏడాది అగస్టు ప్రారంభం నాటికే నాట్లు పూర్తై రైతుల కళ్లల్లో అనంద ం నిండిందని మంత్రి కామినేని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కైకలూరు నియోజకవర్గం అక్వారంగంలో అభివృద్ధిచెంది మొదటిస్తానంలో నిలిచిందని అదాయమార్గాలతో అర్దికపరిస్తితి మెరుగుపడినట్లు మంత్రి కామినేని శ్రీనివాస్ వివరించారు. అక్వారంగం ద్వారా త్రాగనీరు రహదార్లు దెబ్బతింటున్నప్పటికి అదాయమార్గాల ద్వారా అభివృద్ధిని మెరుగుపరుచుకుంటున్నట్లు డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను కృషిచేస్తున్నట్లు తెలుపుతూ రైతులకు ప్రాధన్యత కల్పించి వారి సమస్యలపై నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. రెవెన్యూశాఖా అద్వర్యంలో చేపట్టిన మీ ఇంటికి మీభూమి కార్యక్రమం మహోన్నతమైనదని మీ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు మీ గ్రామానికి రావడం జరిగిందని వారికి వివరించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మాజి జడ్పిటీసి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా గుడివాడ అర్డీవో చక్రపాణి,మంత్రితోపాటు ప్రముఖులకు స్వాగతం పలికి రెవెన్యూ సదస్సు మొక్క ప్రాముఖ్యతను వివరించారు.మాజి ఎమ్మెల్సి కమ్మిలి విఠల్‌రావు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించగా రాష్ట్ర చేపల సంఘ అధ్యక్షుడు సీతారామారాజు, ఎంపిపి జసింతా, ఎంపిడీవో పూర్ణచంద్రరావు, తాహాసీల్దార్ మధుసూధన్‌రావు, ఎఎమ్‌సి చైర్మన్ శివకృష్ణ, దేవాలయ కమిటీ చైర్మన్ రంగారావు, మండల వైస్‌చైర్మన్ సత్యనారాయణతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

జిఎస్టీ విధానంలో కొన్ని మార్పులుచేస్తే బహుళ ప్రయోజనం

- వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై స్పష్టత ఇవ్వాలని సూచన

- బిల్లులోని కొన్ని అంశాలపై క్లారిటీ ఇవ్వాలి: ఎంపి గల్లా



గుంటూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త ప్రతినిధి: ఒక దేశం ఒక పన్ను విధానం భారత దేశ కీర్తిని విశ్వవాప్తం చేసిందన్నారు. లోక్‌సభలో జిఎస్టీ బిల్లుపై అనేక అంశాలను ప్రస్తావించిన గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ అమెరికా, చైనాలాంటి అగ్రదేశాలకంటే ప్రస్తుతం భారతదేశ మార్కెట్ పురోగతి బాటలో ప్రయాణిస్తోందన్నారు. ఒక దేశం, ఒక పన్ను పేరుతో జిఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీకి గల్లా బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. జిఎస్టీ పన్ను విధానంపై అటు వ్యాపారుల్లో, ఇటు ప్రజల్లో కొంత గందరగోళం నెలకొన్నా.. ఇప్పుడు అందరికీ ఈ విధానంపై ఓ స్పష్టత వచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ఇప్పటికే ఆర్థికశాఖ మంత్రి జిఎస్టీ కౌన్సిల్‌కు వస్తున్న విజ్ఞప్తులే ఇందుకు ఉదాహరణగా తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గుంటూరు పార్లమెంట్‌లో కూడా ఓ సమస్య ఉన్నట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. జయదేవ్ మాట్లాడుతూ జిఎస్టీ క్లాసిఫికేషన్‌లో కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను, వ్యవసాయేతర ఉత్పత్తులుగా పేర్కొన్నారని తెలిపారు. ఉదాహరణకు పచ్చిమిరపకాయలపై జిఎస్టీ పన్ను లేదని ప్రకటించారు. అదే తరుణంలో పండుమిర్చిపైమాత్రం 5 శాతం జిఎస్టీ విధించారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పండు మిర్చి సాగుఎక్కువగా ఉందని తెలిపారు. ప్రపంచ మార్కెట్‌కు ఎక్కువగా ఎగుమతి అయ్యే పండు మిర్చి, గుంటూరు మార్కెట్ నుండే వెళ్తుందని అన్నారు. పండు మిర్చినీ జిఎస్టీ పరిధినుంచి తొలగించాలని గల్లా కోరారు. పసుపు విషయంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎండ బెట్టిన పసుపుపై 5 శాతం పన్ను విధించటం ఆరబెట్టిన పసుపుపై పన్ను విధించకపోవటం సరికాదన్నారు. పసుపు పంటపై కూడా ఈ జిఎస్టీ పన్నును తొలిగించాలని కోరారు. పై విషయాలను ఆర్థిక శాఖ మంత్రి పరిగణలోకి తీసుకుని ప్రాసెసింగ్ చేయని, ప్రకృతి సహజంగా ప్రాసెస్ కాబడుతున్న వ్యవసాయ ఉత్పత్తులనపై 28శాతం పన్నుగా ప్రకటించటంతో పొగాకు రైతులతోపాటు, ఎగుమతిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు విదేశీ ఎగుమతులపై కూడా ఈ ప్రభావంపడే అవకాశం ఉందన్నారు. పొగాకు ఎగుమతులద్వారా మన దేశానికి 6 వేల కోట్ల ఆదాయం ప్రతి ఏటా వస్తోందని గుర్తు చేశారు. ముడి పొగాకుపై పన్ను తొలిగించటంతోపాటు, పొగాకు ఉత్పత్తులపై 5 శాతంకు పన్ను పరిమితిని తగ్గిస్తే మంచిదన్నారు. వస్త్ర తయారీ రంగంపై కూడా జీఎస్టీ విధానంలో స్వల్ప మార్పులు చేయాల్సిన అవసరమున్నట్లు ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. రిలయల్ ఎస్టేట్ రంగంలో కూడా ఒడుదుడుకులు ఎదుర్కొంటోందని ఇన్‌పుట్ సబ్సిడీ క్రెడిట్ కాలపరిమితి విషయంలో సడలింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి విద్యుత్ ఉత్పాదనతో నడిచే వాహనాలను పూర్తిగా అందుబాటులోకి తీసుకుని రావాలని ప్రయత్నిస్తుంటే జీఎస్టీ చట్టంలోమాత్రం అలాంటి వాహనాలపై సాధారణ పెట్రోల్, డీజల్ వాహనాలకంటే ఎక్కువగా పన్ను విధించటంపై కూడా ప్రభుత్వం మరోసారి ఆలోచించాలన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలద్వారా ఎలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయో ఇప్పటికే ఢిల్లీలాంటి నగరాలు ఉదాహరణగా నిలిచిన నేపథ్యంలో, ఖచ్చితంగా ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వాహనాలపై పన్ను శాతం తగ్గించాలని కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉత్తారాఖాండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలతో సమానంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇస్తామన్న హామీని మరోసారి గుర్తు చేశారు. ఎంపీ గల్లా జయదేవ్ జీఎస్టీ కొత్త చట్టంలో కూడా ఆ ప్రోత్సాహకాలను తమ రాష్ట్రానికి కొనసాగించాలని ఇప్పుడిప్పుడే విభజననష్టం నుంచి కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కొనసాగించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైనే ఉందని ఆయన అన్నారు.

టిడిపి అభ్యర్థిగా బ్రహ్మానందరెడ్డి నామినేషన్ దాఖలు



టిడిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల, ఆగస్టు 2, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లాలోని నంద్యాల అభ్యర్థిగా భూమా బ్రహ్మానంద రెడ్డి బుధవారం నంద్యాల ఆర్‌డిఓ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు అందించారు. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి వెంట ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి, పర్యాటకశాఖ మంత్రి అఖిలప్రియ, మౌనిక, జగత్‌విఖ్యాతరెడ్డి ఉన్నారు. టెక్కె మార్కెట్ యార్డు నుంచి ర్యాలీ ప్రారంభమై ఆర్‌డిఓ కార్యాలయానికి చేరుకుంది.

నేడు పోలవరం సందర్శించనున్న జెపి

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ ఆగస్టు 3, 4 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఆగస్టు 3న పోలవరం ప్రాజెక్టును జెపి పరిశీలించి అక్కడి వివరాలు తెలుసుకుంటారని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. 4న ఉదయం పదిన్నర గంటలకు భీమవరంలోని ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాల, మధ్యాహ్నం రెండున్నరకు బివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో జెపి ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారని బాబ్జీ తెలిపారు.

నంద్యాల ఉప ఎన్నికల్లో ధనప్రవాహాన్ని అడ్డుకోండి

భన్వర్‌లాల్‌కు ఎన్నికల నిఘా వేదిక ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: నంద్యాల అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికకు సంబంధించి విచ్చలవిడిగా జరుగుతున్న ధనప్రవాహం, మద్యం వినియోగం, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని ఎన్నికల నిఘా వేదిక ఎపి కమిటీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్‌కు ఫిర్యాదు చేసింది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛగా వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈమేరకు వేదిక రాష్ట్ర చైర్మన్ డా. అంబటి లక్ష్మణరావు, కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కొత్త ఓటర్ల నమోదులో అనేక లోపాలు జరుగుతున్నాయనీ, ఇప్పటికే వివిధ ప్రాంతాలలో ఓటుహక్కు కలిగి ఉన్నవారు తిరిగి ఓటుకోసం నమోదు చేసుకుంటున్నారని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఓటు హక్కు కల్పించాలని పేర్కొన్నారు. గతంలో దేశంలోని ఏ నియోజకవర్గంలోనూ జరగనివిధంగా ఓటర్లను ప్రలోభపర్చడానికి అత్యధిక ఎన్నికల వ్యయం జరిగే అవకాశం ఉన్నందున నిఘా, తనిఖీ బృందాలను ఏర్పాటుచేసి డబ్బుల పంపిణీని ఏర్పాటుచేయాలన్నారు. మంత్రులు ప్రభుత్వ వాహనాలను వినియోగించడం, అధికార దుర్వినియోగం చేయడం జరుగుతోందనీ, దీనిపై పూర్తి నిఘా ఉంచాల్సిందిగా కోరారు. పోలీసు, అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, మూడు సంవత్సరాలపాటు నంద్యాల నియోజకవర్గంలో పనిచేసిన అధికారులను బదలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో అక్రమాలను నివారించడానికి టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటుచేసి తగిన సిబ్బందిని నియమించి ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టడానికి కృషి జరగాలని వారు విజ్ఞప్తి చేశారు.

విద్యకు రూ.459 కోట్లు

హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త: కాలేజీ విద్య నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 459,22,26,000 రూపాయలను విడుదల చేసింది. 2017–18 వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుండి వీటిని మంజూరు చేసింది. దీంతోపాటు వివిధశాఖలకు నిధులను విడుదలచేస్తూ ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులను జారీచేసింది. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు గాను ప్రభుత్వం మరో రూ.347,08,19,400లను మంజూరుచేసింది. పంచాయతీరాజ్‌శాఖకు రూ. 303,78,02,000లు, ఆర్‌యుఎస్ఎ పథకంకింద కాలేజీ విద్యకు రూ.44,91,66,000లను ప్రభుత్వం విడుదల చేసింది.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

- కమిషన్ చైర్మన్ కారెం శివాజీ



బుధవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడుతున్న కారెం శివాజీ

నెల్లూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త-సంక్షేమం: అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు సత్వర న్యాయం చేకూర్చడంతోపాటు పరిహారం అందజేసి వారిని ఆదుకుంటామని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు.నగరంలోని రోడ్లు భవనాల అతిథి భవనంలో బుధవారం కమిషన్ సభ్యులు బద్దెపూడి రవీంద్రతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ రాష్ట్రంలో దళితులపై కుల ధూషణలు, దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన కారెం దాడులు చేసిన వారిపై తక్షణమే కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. ఇటీవల రాష్ట్రంలో రెండుచోట్ల దళితులపై దాడులు, గ్రామ బహిష్కరణ వంటి సంఘటనలు జరిగాయని కమిషన్ స్పందించి న్యాయం చేకూర్చడం జరిగిందన్నారు. గతంలో దళితులకు ఏదైనా అన్యాయం జరిగితే రక్షణగా ఉద్యమాలు జరిగేవని ,కానీ నేడు సామాజిక ఉద్యమాల పేరుతో రాజకీయ పార్టీల అండతో ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో త్వరలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. విద్యతోనే సామాజికంగా అభివృద్ధిని సాధించగలమని పేర్కొన్నఆయన ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని కోరారు. సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధి పరచాలని నిధులు దారి మళ్లితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం జిల్లా అధికారులు జె.సి.2 వెంకటసుబ్బారెడ్డి ,సాంఘీక సంక్షేమ శాఖ డి,డి.మధుసూదన్ రావు, ఐటిడిఎ పి.ఓ. కమలకుమారి, డిటిడబ్ల్యుఓ జ్యోత్స్న ,అట్రాసిటీ కమిటీ సభ్యులు బషీర్ తదితరులు ఛైర్మన్ ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.



తిరుమలలో పవిత్రోత్సవాలకు అంకుర్పారణ చేస్తున్న అర్చకులు

శ్రీవారి ఆలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు

శాస్త్రోక్తంగా సేనాధిపతి ఊరేగింపు

తిరుమల, ఆగస్టు 2, ప్రభాతవార్త: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. మొదటిరోజు పవిత్రోత్సవాల్లో పవిత్రప్రతిష్ఠను నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి 7గంటల నుంచి 9గంటల మధ్య సేనాధిపతిని ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపుచేసి మృత్సంగ్రహణం, అంకురార్పణం,ఆస్థానం నిర్వహించారు. ఆ తరువాత పవిత్రమండపంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పవిత్రోత్సవాల ప్రారంభంకారణంగా సాయంత్రం ఆలయంలో జరగాల్సిన వసంతోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టిటిడి రద్దుచేసింది. తోమాల,అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించారు. రాత్రి 9గంటలనుంచి 10గంటల మధ్య ఘనంగా అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఇవో అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు,ఆలయ డిప్యూటీ ఇవో కోదండరామారావు, సివిఎస్‌వో ఆకే రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త: గత ఏడాది రాష్ట్రంలో ఏర్పడిన అకాల వర్షాలకుగాను రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సంబంధించి బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. గత ఏడాది మార్చి, జూన్ నెలల్లో రాష్ట్రంలోని అనంతపురం, శ్రీకాకుళం, విజయనగరం, కడప, కృష్ణా, చిత్తూరు, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లోని 5,247 మంది రైతులకు చెందిన 2,138.99 హెక్టార్ల విస్తీర్ణంలోని ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందుకుగాను ప్రభుత్వం 19,08,04,000 రూపాయలను ఇన్‌పుట్ సబ్సిడీగా విడుదల చేసినట్లు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీకి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

విశాఖకు టిడిసిని కేటాయించడంతో మంత్రి శిద్ధా హర్షం

విజయవాడ, జూలై 2, ప్రభాతవార్త: టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ సెంటర్ (టిడిసి)ను విశాఖపట్నంకు కేటాయించడంపట్ల రాష్ట్ర సాంకేతికశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యతినిస్తోందన్నారు. ఈ సెంటర్‌ను రాష్ట్రానికి కేటాయించినందుకు కేంద్ర మంత్రులు హర్షవర్ధన్, సుజనాచౌదరిలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కేంద్రాలు దేశంలో పంజాబ్, గుజరాత్ మరియు కర్నాటకలలో మాత్రమే ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎపిసిఓఎస్‌టి) ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. శాస్త్ర సాంకేతిక ప్రదర్శన కేంద్రాన్ని రాష్టానికి మంజూరు చేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ గతంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేసిందని, దీనికి సంబంధించిన ప్రాజెక్టు వివరాలను పంపవలసిందిగా కేంద్రం రాష్టాన్ని కోరడం జరిగిందన్నారు. ఈ కేంద్రం నిర్మాణానికి కావాలసిన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సమకూరుస్తుందన్నారు. నూరు శాతం కేంద్ర నిధులతో దీనిని నిర్మిస్తుస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం స్పష్టమైన హామీ ఇచ్చిందని అన్నారు. ఈ టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ సెంటర్(టిడిసి)కు మొదటి విడతగా రూ.25కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు. దీనిని అభివృద్ధి చేయడానికి కావలసిన నిధులను దశల వారీగా కేంద్రం మంజూరు చేస్తుందన్నారు. ఈ



టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ యొక్క ముఖ్యద్దేశం తక్కువ సాంకేతిక వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్, సోలార్ పవర్, విండ్ పవర్, వాటర్ హార్వెస్టింగ్ టెక్నాలజీ ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రదర్శనలను పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈ సెంటర్‌లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

కొత్త జిల్లాల్లో చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం



బుధవారం సచివాలయంలో అధికారులతో భేటీ అయిన మంత్రి తుమ్మల

కేరళ తరహా పద్ధతిపై అధ్యయనం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాల్లోనూ చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంబంధిత ఫైలు ఇప్పటికే సీఎం ఆమోదం కోసం వెళ్లిందనీ, త్వరలోనే ఇవి ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. బుధవారం సచివాలయంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజర్ కమిటీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. కొత్త రాష్ట్రంలో నవజాత శిశువు దత్తతలన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయని, ఈ పద్ధతిలో దాదాపు 20 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి ఆరా తీసి పిల్లల దత్తత విషయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని వారికి వివరించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ విధానంలో ఎదురవుతున్న ఇబ్బందులను పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రుల పరిష్కరించాలని మంత్రి పేర్కొన్నారు. నవజాత శిశువుల దత్తత విషయంలో సబ్ రిజిస్ట్రార్లు, రిజిస్ట్రార్ల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను కూడా మంత్రి దృష్టికి తీసుకు రాగా, సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ తరహాలోనే స్టేట్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీన్ని వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు ఇందులో పనిచేసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను కూడా నియమించి చిన్న పిల్లల దత్తత విషయంలో తనిఖీలు నిర్వహించి ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చేస్తామన్నారు. కేరళ రాష్ట్రంలో ఎవరైనా తల్లిదండ్రులు తమ నవజాత శిశువులను వద్దనుకుంటే అక్కడ సర్కారు ప్రత్యేక పద్ధతిని అవలంబిస్తోందని, కానీ అందుకు భిన్నంగా మన రాష్ట్రంలో వారిని కంప పొదల్లోనో, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిని నియంత్రించడానికి కేరళ తరహాలో ఇక్కడ కూడా అటువంటి పద్ధతిని ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే శిశు సంక్షేమానికి సంబంధించి కేంద్ర పథకాల ద్వారా వచ్చే నిధులకు సంబంధించి ఏవైనా ప్రతిపాదనలు పంపాల్సి ఉందా అనే విషయాలపై త్వరలోనే ఆ శాఖ సెక్రటరీ జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్రతో సమావేశమై సూచనలు ఇవ్వాలని కోరారు.

ఓయులో ఎఐఎస్ఎఫ్ లాంగ్ మార్చ్‌కు ఘనస్వాగతం



బుధవారం హైదరాబాద్‌లో ర్యాలీలో పాల్గొన్న ఎఐఎస్ఎఫ్ విద్యార్థులు

హైదరాబాద్ (ఉస్మానియా యూనివర్సిటీ),ఆగస్టు 2, ప్రభాతవార్త: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్-వైఎఫ్) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న లాంగ్‌మార్చ్ బుధవారం ఓయూకు చేరుకోవడంతో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఎన్‌సిసి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంమ్రేడ్ వల్లీఉల్లా ఖాద్రి, అపరాజిత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గోరక్షక్ పేరుతో దళితులు, మైనార్టిలపైన దాడులు జరుగుతున్నాయని, ప్రజల హక్కులను కాలరాస్తు న్నారని తెలిపారు. స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తూ దేశాన్ని కాశాయికరణ చేస్తున్నారని తెలిపారు. యూని వర్సిటీ విద్యార్థులు వాటిని తిప్పికోడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మేఘమథనం చేయించండి: సిఎంకు సిపిఐ లేఖ

హైదరాబాద్ ఆగస్టు 2, ప్రభాతవార్త: రాష్ట్రంలో మేఘమథనం చేయించి కృత్రిమ వర్షాలు కురిపించాలని విజ్ఞప్తి చేస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి బుధవారం ముఖ్యమం త్రి కెసిఆర్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో 20రోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తిన విత్తనాలు ఎండిపోతున్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా వేరుశనగ, పత్తి వంటి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు వృధాగా భూమిలో కలిసిపోతాయని ఆందోళన వ్యక్త_ం చేశారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఇరుక్కుపోయిన అన్నదాతకు ఇది గోరు చుట్టు పై రోకలిపోటులా మారుతుందన్నారు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేపథ్యంలో మేఘమథనం చేయించి కృత్రిమ వర్షాలు కురిపించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. దీని వల్ల వేల కోట్ల విలువచేసే పంటలను కాపాడబడతాయని ఆయన పేర్కొన్నారు.

శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతికి సంతాపం: సిసిఎంబి శాస్త్రవేత్త పిఎం భార్గవ మృతిపట్ల చాడ వెంకటరెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబసభ్యులకు సిపిఐ సానుభూతి తెలియచేసిందన్నారు. చాడవెంకటరెడ్డితో పాటు సిపిఐ జాతీయకార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషాలు బుధవారం పిఎం భార్గవ కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. భార్గవ ప్రతిభావంతుడైన శాస్త్రవేత్త అని, అనేక పరిశోధనలు చేసి దేశానికే వన్నె తెచ్చారని అన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్‌కు సంస్కరణ పురస్కార్ నిధులు

హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త: ఉత్తమ ప్రతిభ కనబరచిన గ్రామపంచాయితీలు దీన్ దయాల్‌ఉపాధ్యాయ్ పంచాయత్ సంస్కరణ పురస్కార్ కింద జిల్లా పరిషత్, మండల, గ్రామ పంచాయితీలకు 2015-16 అవార్డులను ప్రకటించారు. కరీంనగర్ జిల్లా పరిషత్‌కు రూ.50లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లా ఘన్‌పూర్, వరంగల్ జిల్లా తాడ్వాయికి రూ.25లక్షలు, నిజామాబాద్ వెల్‌పూర్, వాయిపూర్‌కు రూ.12లక్షలు, కరీంనగర్ జిల్లా సిరిసిల్లా కసేబ్‌కట్‌కూర్, మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకాల్ నిజాపూర్, కరీంనగర్ జిల్లా సిరిసిల్లా గోపాలపల్లి గ్రామపంచాయితీలకు రూ.8లక్షల చొప్పున, సిద్దిపేట జిల్లా ఇబ్రహింపూర్ గ్రామానికి రూ.10లక్షల అవార్డులను ప్రకటించారు.

ఎసిబికి చిక్కిన ఫ్యాక్టరీస్ ఉన్నతాధికారి వద్ద మరిన్ని అక్రమాస్తుల గుర్తింపు

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్న కేసులో అరెస్టయిన ఫ్యాక్టరీస్ విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వై.గంగాధర్ రెడ్డి వద్ద మరిన్ని అక్రమాస్తులను ఎసిబి అధికారులు తాజాగా గుర్తించారు. ఈ మేరకు ఎసిబి మెదక్ రేంజి డిఎస్‌పి సూర్యనారాయణ బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుద ల చేశారు. గత నెల 27వ తేదీన గంగాధర్ రెడ్డిని ఎసిబి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్న కేసుల్లో అరెస్టు చేశారు. ఈ సమయంలో ఆయనతోపాటు బంధువుల ఇళ్లలో జరిపిన సోదాల్లో రెండు కోట్ల 18 లక్షల 19వేల రూపాయల అక్రమాస్తులను గుర్తించారు. దీని తరువాత గంగాధర్ రెడ్డిని అరెస్టు చేసిన ఎసిబి అధికారులు ఆయన్ను రిమాండుకు తరలించారు. ఈ ఉదంతం తరువాత గంగాధర్ రెడ్డి వద్ద మరిన్ని అక్రమాస్తులున్నట్లు సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు దీ నిపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక కిలో బంగారు నగలు, పెద్ద ఎత్తున బీమా పత్రాలు, మరిన్ని భూ పత్రాలు లభించాయి. వీటిని కూడా ఎసిబి అధికారులు జప్తు చేశారు.

ఎఐటి వర్క్‌షాప్‌కు ఇద్దరు అధికారులు

హైదరాబాద్ ఆగస్టు 2, ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9,10తేదీల్లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా టాబులేషన్(ఏఐటి)వర్క్‌షాప్‌కు తెలం గాణ నుంచి ఇద్దరు అధికారులు హాజరవు తున్నా రు. 72వ రౌండ్ ఎన్‌ఎస్‌ఎస్ నమూనా జాబితాపై ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. దీనికి ప్లానింగ్ శాఖకు చెందిన డిప్యూటి స్టాటిస్టికల్ ఆఫీసర్లు ఎన్. శ్రీనివాస్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌లు వెలు తున్నారు. ఈమేరకు వారికి వెల్లేందుకు అనుమ తినిస్తూ బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ బిపి.ఆచార్య ఉత్తర్వులు జారీచేశారు.


బిసి కమిషన్ స్పెషల్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్

హైదరాబాద్, ఆగష్టు 2, ప్రభాతవార్త: తెలంగాణ బిసి కమిషన్ స్పెషల్ ఆఫీసర్‌గా డిప్యూటి కలెక్టర్ వి. చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ నియామకం డిప్యూటేషన్‌పై జరిగింది. ప్రస్తుతం బిసి కమిషన్ స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటేషన్‌పై భర్తీ చేయడంతో ఈ సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కెటిఆర్ మంత్రి పదవికి అనర్హుడు

కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం: సిపిఎం నేత తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: సీఎం కేసీఆర్ కుమారుడు కేటీఆర్ మంత్రి పదవిలో ఉండి, ప్రైవేటు కంపెనీలో డైరెక్టరుగా కొనసాగడం చట్టవిరుద్ధమని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కేటీఆర్ వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. తమ్మినేని ఆధ్వర్యంలో పలు లెఫ్ట్ పార్టీల నేతలు బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా_డుతూ హిమాన్షు మోటార్స్‌లో తనకు 3 లక్షల షేర్లు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి కేటీఆర్ స్పష్టం చేసినట్లు చెప్పారు. 2017లో కేటీఆర్ డిజిటల్ సిగ్నేచర్‌తో వార్షిక రిటర్న్స్ దాఖలు చేశారనీ, మంత్రి పదవిలో కొనసాగడానికి ఆయన అనర్హుడని పేర్కొన్నారు. మంత్రివర్గం నుంచి కేటీఆర్‌ను తొలగించాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ అవినీతి వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర ఎన్నికల అధికారి హామీ ఇచ్చారని తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'సినారే స్మృతిలో... విశ్వంభరుడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తదితరులు

సినారె లేనిలోటు పూడ్చలేనిది

పుస్తక ఆవిష్కరణసభలో వక్తలు

హైదరాబాద్ (పంజాగుట్ట), ఆగస్టు 2, ప్రభాతవార్త: తెలుగు సాహిత్య పుస్తకంలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయులు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అడుగుజాడలు పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన సినారె స్మృతిలో... విశ్వంభరుడు అనే పేరుతో పుస్తకాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్ల నారాయణ ఆవిష్కరించారు. పుస్తకరూపకర్తల్లో ఒకరైన, బీసీ కమీషన్ సభ్యులు జూలూరీ గౌరిశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ మాట్లాడుతూ సినారే సాహితి జీవితం, గొప్పదనం గురించి పుస్తకం తీసుకరావడం చాలా సంతోషంగా ఉందన్నారు. వివిధ పత్రికలలో ఆయనపై వచ్చిన వ్యాసాలు, ప్రముఖుల అభిప్రాయాలు, అరుదైన ఫోటోలు పుస్తకంలో ఉన్నాయని ఇవనీన చరిత్రకు భావితరాలుగా మిగిలిపోతాయని అన్నారు. సినిమాలలో దాదాపు మూడువేల ఐదు వందల పాటు రాసారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ భవిష్యత్‌లో చరిత్ర నిర్మాణానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సినారె జీవితం మొత్తం కవిత్వం, రచనలకు అంకితమిచ్చారని చెప్పారు. సాహిత్యంలో ఎనలేని శిఖరాలను అధిగమించారని కొనియాడారు. బీసీ కమీషన్ చైర్మన్ రాములు మాట్లాడుతూ సినారె మరణం భారతీయ సాహిత్యానికి తీరని లోటు అన్నారు. భారతీయ సాహిత్యంలో సినారె చిరంజీవిగా ఉంటారని కొనియాడారు. ప్రతి ఒక్కరు ఇంట్లో ఒక గ్రంథం లాగా పెట్టుకోవాలని సూచించారు. తెలుగు సాహిత్యంలో నన్నయ, సొమయాజులు లాంటి వారి తరువాత సాహిత్య పుస్తకంలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడని అన్నారు. పుస్తక రూపకర్తలు జూలూరి గౌరీశంకర్, తూల రాజేందర్‌లు మాట్లాడుతూ త్వరలోనే సినారె సమగ్ర సాహిత్యం పుస్తకం తీసుకవస్తామని తెలిపారు.

చేప పిల్లల పంపిణీపై అవగాహన కల్పించాలి: మంత్రి తలసాని



బుధవారం కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి తలసాని

హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త: చేప పిల్లల పంపిణీపై మత్స్యకారుల్లో అవగాహన కల్పించాలని మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సచివాలయంలో బుధవారం మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పంపిణీ కార్యక్రమానికి జిల్లా మంత్రితోపాటు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అహ్వానించాలన్నారు. చేప పిల్లలను విడుదల చేసే సమ యంలో నిబంధనల ప్రకారం విడుదల చేయవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా లేని చేప పిల్లలను వెనుకకు పంపించాలన్నారు. చేప పిల్లల నాణ్యతను పరిశీలించే సమయంలో ఆయా మత్స్య సహకార సంఘాల సభ్యులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది జరిగిన తప్పిదాలు తిరిగి జరగకుండా జాగ్రత్తపడాలన్నారు. చేప పిల్లలను విడుదల చేసిన తదనంతరం ఫిర్యాదులు చేసే ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మత్స్యశాఖలో సిబ్బంది కొరత ఉన్నందున చేప పిల్లల విడుదల కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయితీజరాజ్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మత్స్యశాఖలో సిబ్బంది నియామకాలను చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ప్రతీ జిల్లా కేంద్రంలో చేపల మార్కెట్ నిర్మానానికి అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నిర్వహణను కూడా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. మరో వారంలో సంచార పశు వైద్య వాహనాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రంలో వాటి సంఖ్య పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా మందులు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకోవాలిని చెప్పారు. గ్రాసం కొరత లేకుండా ఉండేందుకు స్టైలో హెమటా రకం గడ్డి విత్తనాలను అన్ని జిల్లా కేంద్రాలకు స రఫరా చేశామని, వాటిని అటవీ, ఉద్యాన శాఖ భూముల్లో పెంచేలా చూడాలని మంత్రి చెప్పారు.

నేరెళ్ల బాధితులను పరామర్శించేందుకు నేడు వేములవాడకు బిజెపి నేతలు

హైదరాబాద్, ఆగష్టు 2, ప్రభాతవార్త: నేరెళ్లలో దళితులపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదుచేసి జైలుకు తరలించగా, కోర్టు ఆదేశాల మేరకు విడుదలైన బాధితులను బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి పి.మురళీధర్‌రావు గురు వారం ఉదయం 9 గంటలకు వేములవాడలో పరా మర్శిస్తారు. అనంతరం 11 గంటలకు జగి త్యాల జిల్లా కేంద్రంలో జరగనున్న బిజెపి జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కాగా ఈనెల 4న నిజా మాబాద జిల్లా సిరికొండమండలం గడ్‌కోల్ గ్రామంలో బిజెపి నిర్వహించనున్న రైతు పంచా యతీ కార్యక్రమంలో మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆయనతోపాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు కూడా ఆయా కార్య క్రమాల్లో పాల్గొంటారని బిజెపి రాష్ట్ర కార్యాలయం తెలిపింది.

విద్యుత్ శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వానికి చుక్కెదురు

హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త: ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని, నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలుచేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగువారాల పాటు వాయిదా వేసింది. రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 20,903 మంది కాంట్రాక్టు ఉద్యోగులను జూలై నెలాఖరులో తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. 23,667 మంది విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ చేసుకోగా అందులో 20,903 మంది అర్హులని దరఖాస్తుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీలు నిర్ధారించాయి. తెలంగాణ స్థానికత లేకపోవడం, వయోపరిమితి మితిమీరడం, ఉద్యోగాన్ని మధ్యలో వదిలేయడం వంటి కారణాలతో మిగిలిన వారి దరఖాస్తులను తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో పలువురు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే విధించింది.

ఉద్రిక్తతకు దారితీసిన హార్టికల్చర్ విద్యార్థుల ఆందోళన

- ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థిని సంగారెడ్డి ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- పోలీసుల నిర్బంధంలో హార్టికల్చర్ విద్యార్థులు, 17 మంది పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- విద్యార్థులను పరామర్శించడానికి వచ్చిన టిడిపి ఫ్లోర్‌లీడర్ రేవంత్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు



బుధవారం రాజేంద్రనగర్‌లో టిడిపి ఫ్లోర్‌లీడర్ రేవంత్‌రెడ్డిని ఆరెస్టు చేసిన పోలీసులు



హాస్టల్ ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న హార్టికల్చర్ విద్యార్థినులు



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి సబితారెడ్డి

హైదరాబాద్ (రాజేంద్రనగర్), ఆగస్టు 2, ప్రభాతవార్త: రాజేంద్రనగర్‌లోని శ్రీకోండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటి విద్యార్థులు చేస్తున్న ఆందోళన బుధ వారం ఉద్రిక్తతకు దారితీసింది. హార్టికల్చర్ విద్యార్థులు మండలానికి ఒక హార్టి కల్చర్ అధికారి, ముగ్గురు హార్టికల్చర్ విస్తరణ అధికారులను భర్తీ చేయాలని చేపట్టిన ఆందోళన 30వ రోజుకు చేరింది. ప్రభుత్వం హార్టికల్చర్ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ప్రభుత్వం స్పంధించకపోవడంతో హార్టికల్చర్ విద్యార్థి నాయకుడు సంగారెడ్డి గత ఐదు రోజులగా ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. విద్యార్థులు న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనడానికి టిడిపి ఫ్లోర్‌లీడర్ రేవంత్‌రెడ్డి బుధవారం రావాల్సి ఉండటంతో పోలీసులు ముందు జాగ్రత్తగా బుధవారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతాంలో అమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంగారెడ్డి చికిత్స నిమిత్తం ఉస్మా నియా ఆస్పత్రికి తరలించారు. మరో 17 మంది విద్యార్థులను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, మిగతా వారిని హాస్టల్‌ల వద్ద నిర్భంధించారు. బుధవారం టిడిపి ఫ్లోర్‌లీడర్ రేవంత్‌రెడ్డి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోని విద్యార్థులను పరామర్శించడానికి వెళ్లగా అప్పటికే విద్యార్థులను మరో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో రేవంత్‌రెడ్డి స్థానిక టిడిపి నాయకులు సామ భూపాల్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, గోపాల్‌లతో కలసి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేయగా అరెస్టు చేసి శంషాబాద్ ఆర్జీఐఎ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన పోలీసులు, టిడిపి నాయకుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు న్యాయ మైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పంధించకుండా పరిష్కరించకపోవడంతో పాటు అరెస్టు చేసి దుర్మాగపు చర్యకు పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం నిరంకుష పాలన కోనసాగిస్తూ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని పశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పంధించి హార్టికల్చర్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

హార్టికల్చర్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిరంకుశ దోరణికి పాల్పడుతుంది : మాజీ హోం మంత్రి సబితారెడ్డి

హార్టికల్చర్ విద్యార్థులు సాధించి తెచ్చుకున్న రాష్ట్రంలో తమకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నో ఆశలు కంటే ముఖ్యమంత్రి కెసిఆర్ కనీసం వారి వినతులను కూడ స్వీకరించకుండా వారి నిరంకుశ పాలనకు పాల్పడుతున్నాడని మాజీ హోం మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా హార్టి కల్చర్ విద్యార్థులు న్యాయమైన డిమాండ్‌ల కోసం చేస్తున్న ఆందోళనను నీరు గార్చడానికి ప్రభుత్వం మహిళ విద్యార్థినులు అనే కనీస మర్యాద కూడ పాటిం చకుండా పురుషుల పోలీసులతో తరలించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను వెంటనే చోరవ తీసుకోని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువనేత పి. కార్తీక్‌రెడ్డి, స్థానిక నాయకులు కోలన్ సుభాష్‌రెడ్డి, మజ్జిగ బాబురావుయాదవ్, సామ ఇంద్రపాల్‌రెడ్డి, జాలిగం చిత్తారీ, పచ్చ శ్రీనివాస్, కూచిరెడ్డి శంకర్‌రెడ్డి, యుగందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల కింద నలిగిన మరో దళితుడు

సిరిసిల్లలో దారుణం, ఇసుక లారీల ధన దాహానికి ఎంత మంది బలి కావాలి: పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త: ఇసుక మాఫియాకోసం ప్రజల రక్తం దారపోస్తున్నారని పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ధ్వజమెత్తారు. ఇసుక మాఫియాను అరికట్టలేని ముఖ్యమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాజాగా ఇసుక మాఫియా ధన దాహానికి మరో దళిత కుటుంబం రోడ్డుమీద పడిందని, దళితుడి ప్రాణం ఇసుక లారీ కింద నలిగిపోయిందని, టిఆర్ఎస్ పాలకుల ధన దాహంతో ఎంత మంది దళితుల కావాలంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో గిన్నె శంకర్ అనే దళిత రైతు పొలం వద్దకు వెళుతుండగా, ఇసుక లారీ ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారని, ఆయనను సమీపంలో ఉన్న ఆసుపత్రి తరలించగా, ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌లో తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. గత కొంతకాలంగా సిరిసిల్లా ఇసుక మాఫియా విషయంలో కాంగ్రెస్ పోరాటం చేస్తుందని, ఇంత జరుగుతున్నా కూడా ఇసుక మాఫియా ఆగడాలు, అధికార పార్టీ కెసిఆర్ కుటుంబం, మంత్రి కెటిఆర్ స్వయంగా ఇసుక మాఫియాకు అండగా ఉండడంతో వారు చెలరేగిపోతున్నారన్నారు. ప్రతి పది రోజులకొకసారి ఇసుక లారీ ప్రమాదం జరుగుతుందని, దుమ్ము, దూళిలతో, శబ్దాలతో అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా పట్టి_ంచుకోవడం లేదన్నారు. మంత్రి కెటిఆర్ తన దన దాహానికి జనాన్ని బలి తీసుకుంటున్నాడని, డబ్బు పిచిచ పట్టిన వాడిలా ప్రవర్తిస్తున్నాడని ఆయన దుయబద్దారు. సిరిసిల్లా ఎంఎల్‌ఏగా అక్కడ ప్రజలు ఓటు వేస్తే గెలిచి ఇప్పుడు మంత్రి అయిన తరువాత అధికారాన్ని అనుభవిస్తూ ఇప్పుడు అక్కడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇసుక మాఫియాలో కెటిఆర్ సమీప బంధువు, సొదరుడి వరస అయ్యే సంతోష్‌కుమార్‌కు వాటాలున్నాయన్నారు. తాము డాక్యుమెంట్లలో సహ నిరూపించినా కూడా సిగ్గులేకుండా మాఫియాలను ప్రోత్సహించే విధంగా సహకారం అందిస్తున్నాడని ఆయన విమర్శించారు. ఇసుక మాఫియాలు ఇచ్చే కమిషన్ల కక్కుర్తితో 12 మందిపై కేసులు పెట్టించి ఎనిమిది మందిని థర్డ్ డిగ్రీ పెట్టి చిత్రహింసలకు గురి చేస్తే కాంగ్రెస్ పార్టీ స్పందిస్తే నలుగురు దళితులే కదా అంటూ అహంకారపు మాటలు మాట్లాడారని, ఎంత మంది ప్రాణాలు పోతే ఎంత మంది చిత్రహింసలకు గురి అయితే కెటిఆర్ స్పందిస్తారన్నారన్నారు. ఆయనకు ఓట్లు వేసిన పాపానికి దళితులు, బిసిలు, ఎస్‌టిలు బలికావాలా అని ప్రశ్నించారు. ఈ రోజు కెటిఆర్ పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో సిరిసిల్లాల పర్యటించారని ఇదే సమయంలో లారీ ప్రమాదంలో మరో దళితుడు బలి అయ్యారని ఆయినప్పటికీ కెటిఆర్ స్పందించలేదన్నారు. ఇంకనీచమైన పాలనను ఎక్కడా చూడలేదన్నారు. సిరిసిల్లాలో జరుగుతున్న ప్రమాదాలను కెటిఆర్ హత్యలుగా భావిస్తున్నామని, ఆయనపై హత్యకేసులు నమోదుచేయాలని, కెటిఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితు రైతు శంకర్ మృతికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వంటింట్లో అజాగ్రత్త పనికిరాదు

ఉప్పు, పప్పులతో పాటు నిప్పు కూడా మనకు నిత్యావసరమే. మనం జీవించాలి అంటే తిండి కావాలి. ఆ తిండిని వండాలంటే నిప్పు కావాలి. ఏ ఇంట్లోనైనా సాధారణంగా వంటపొయ్యి వెలిగించడంతోనే కుంటుంబ దినచర్య మొదలవుతుంది. అనగా, మన దైనందిన జీవనం అగ్ని ఆవిష్కారంతోనే మొదలవుతుందన్నమాట. (ఆ మాటకొస్తే, దహన చర్యల రూపేణా, మనిషి జీవనం ముగిసేది నిప్పుతోనే కదా)! మగవారు సిగరెట్ వెలిగించడం దగ్గర్నుంచి ఇంట్లో దీపం, పొయ్యి వెలిగించడం, వంట చెయ్యడం వంటి గృహకృత్యాలకే కాక, వివిధ కర్మాగారాలు పని చేసేందుకు, ఇతరత్రా అనేకమైన పనులకూ నిప్పు అవసరం. వివిధ సందర్భాల్లో మనం నిర్వహించే దైవిక-శాస్త్రోక్త విధుల్లో సైతం నిప్పు ప్రమేయం తప్పనిసరి. మానవ జీవితంలో నిప్పుకు ఇంత ప్రాముఖ్యం ఉండబట్టే, దాన్ని మన పెద్దలు పంచభూతాల్లో ఒకటిగా చేర్చి మంచి పని చేశారు. మన నిత్యజీవనావసరాలను తీర్చే నిప్పును నిర్లక్ష్యంగా వాడితే, లిప్తపాటు కాలంలో అది ముప్పుగా మారుతుంది. అమూల్యమైన ప్రాణాల్ని, విలువైన ఆస్తి పాస్తులను, వస్తు సముదాయాన్నీ నిమిషాల్లో నిలువునా కాల్చి, బూడిద చేస్తుంది. అగ్గిపుల్ల, సిగరెట్, కిరోసిన్ లైటు, పెట్రో మాక్స్ లైటు, గ్యాస్‌లైటు, కొవ్వత్తి, నూనె వొత్తి, హారతి కర్పూరం, వంట పొయ్యి, బాణాసంచా, విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్ పరికరాల వంటివి తప్పకుండా కాపు కాసి, పని ముగిసిన వెంటనే దాన్ని నిశ్శేషం గా, నిరపాయకరంగా ఆర్పివేయ్యాలి. జనావాసాల్లో గృహ సముదాయాల మధ్య అగ్నిప్రమాదాలకు ఎన్నో ఆస్కారాలు. గృహస్తులు వాటిని ఆకళింపు చేసుకుని, సదా



జాగరూకులై ఉండాలి. నిప్పు వాడకంతో ముఖ్యంగా ఈ జాగ్రత్తలు పాటించాలి.

➡ వంటపొయ్యి అగ్నిప్రమాదాలకు ఒక ముఖ్యమూలం. పొయ్యి వాడకంలో గృహస్థులు సురక్షిత పద్ధతులను పాటించక, జనవాసాల్లో ప్రమాదాలు జరగడం మనకు నిత్యం అనుభవమే.

పొయ్యి వాడకంలో పాటించదగిన కొన్ని మెలకువలు: గ్యాస్ పొయ్యి, కరెంట్ పొయ్యి, కిరోసిన్ పొయ్యి, కట్టెల పొయ్యి బొగ్గుల పొయ్యి, ఊక పొయ్యి - ఏ పొయ్యి అయినా దాన్ని ప్రమాదానికి ఆస్కారం లేని సురక్షిత స్థానంలో ఉంచాలి. జోరుగా గాలి వీచే ఆరుబయట పొయ్యి పెట్టి వంట చెయ్యటం చేటు. చుట్టూ మరుగు ఉన్న గదిలో, పొయ్యి నేల ఉపరితలానికి అని ఉండాలి. పొయ్యికి చేరువలో ఇంటి చూరు, ఆకుల గడి, గడ్డివాము, ఎండుటాకులు, బట్టలు, కాగితాలు, పత్తి, కిరోసిన్, పెట్రోలు వంటి అంటుకునే పదార్థాలు ఉండరాదు. పొయ్యి వెలిగించి దాని మానాన దాన్ని వదలి అటూ ఆటూ పాత్రలను అందుకోరాదు. వంట అనంతరం పొయ్యిలోని నిప్పును నిశ్శేషంగా ఆర్పాలి. ఉద్ధృతంగా మండే ఎండుటాకులు. ఎండుగడ్డి కాగితాలు తదితరాలను వంట చెరుకుగా వాడరాదు.

➡ వెలిగించిన అగ్గిపుల్ల, సిగరెట్, చుట్ట, బీడీలను ఆర్పకుండా చేతి వాటంతో తోచిన రీతిలో విసిరితే అవి అంటుకునే వస్తువుల పై పడి , మంటలు చెలరేగవచ్చు. కనుక అవసరం తీరగానే వాటిని నిశ్శేషంగా నలిపివెయ్యాలి.

➡ కొవ్వొత్తి, కిరోసిన్ లైటు, పెట్రోమాక్స్ లైటు, గ్యాస్‌లైటు వంటి విద్యుతేతర దీపాలు వెలిగించినప్పుడు, వాటిని పడిపోవడానికి, గాలి సోకడానికి, చిన్న పిల్లలు అందుకోవడానికి వీల్లేని, అంటుకునే సామాగ్రి దరిదాపుల్లో లేని సురక్షితస్థానంలో ఉంచి, అవసరం తీరాగానే ఆర్పివెయ్యాలి.

➡ పూజ వద్ద ప్రమిద, హారతి కర్పూరం వెలిగించినప్పుడు, అవి వికటించకుండా చూసుకోవాలి.

➡ సవ్యంగా పని చెయ్యని కరెంటు, గ్యాస్ కనెక్షన్లు వాటికి సంబం ధించిన పరికరాలు అనర్థదాయకం. కరెంట్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లికేజీలు వల్ల ప్రమాదాలు జరగడం మనకు నిత్యానుభవం. ఈ రెండు కనెక్షన్లనూ నిరంతరం సురక్షితంగా ఉంచుకోవాలి. జనవాసుల మధ్య చెత్తా-చెదారం, బాణసంచా వంటివి కాల్చడమూ చేటే. అలాంటి పనులు జనసంచారం లేని, ఖాళీ స్థలాలను ఎంచుకోవాలి.

➡ పశువులు దోమలు కుట్టకుండా పశువుల పాకల్లో ఎండుగడ్డితో పొగపెట్టడం ఒక పద్ధతి . పొగ కోసం అంటించిన గడ్డి ఆర్పకుండా వదిలెయ్యడం వల్ల, అనేకచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అంటించిన గడ్డిని పని కాగానే నీళ్లతో పూర్తిగా ఆర్పాలి. ❒

రోజూ క్యారెట్ తింటే...

కంటికింపైన రంగులో కనిపించే క్యారెట్ చక్కని రుచితోనూ నోరూరిస్తుంది. రోజూ ఒకటి చొప్పున దీన్ని తినగలిగితే ఎన్నో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. అల్సర్లు, గ్యాస్ వంటి జీర్ణసంబంధిత సమస్యలూ అదుపులో ఉంటాయి. అంతేకాదు మలబద్ధకం రెండు నెలల్లోనే అదుపులోకి వస్తుంది. ఇందులో అధికమోతాదులో లభించే బీటాకెరోటిన్ విటమిన్ 'ఎ'గా మారుతుంది. ఇది కాలేయాన్ని, కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకంగా పనిచేస్తుంది. శరీరంలో విషవ్యర్థాలను బయటకు పంపిస్తుంది. శరీరంలోని ఇన్‌ఫెక్షన్లు తగ్గించే యాంటీసెప్టిక్‌గా కూడా పనిచేస్తుంది. గోళ్లు, జుట్టు బలంగా పెరగడంతో పాటు చర్మానికి తాజాదనాన్ని అందిస్తుంది. మంచి ఛాయ కావాలనుకునేవారు రోజూ కేరట్ తినడం అలవాటు చేసుకోండి. ❒



నిదానంగా గమ్యం చేరుకో!

"ఎంతెంత దూరం. కొంచెం కొంచెం దూరం" అంటూ చిన్నపిల్లలు కళ్లకు గంతలు కట్టుకుని అంతా సందడిగా పరిగెత్తే ఆట మనందరికీ తెలుసు కదా. ఆ ఆటలో ఓ జీవనసత్యం ఉంది. గమ్యం ఎంతో దూరం ఉండవచ్చు. ఎంత దూరమైనా మనం వెళ్లక తప్పదని తెలిసినపుడు ప్రయాణం సాగించాల్సిందే కదా. ఎన్ని వేల మైళ్ల దూరం అయినా మొదట ఒక అడుగుతోనే ప్రారంభిస్తాం కదా. అలా ఒక్కో అడుగు వేసుకుంటూ వెళితే మనం వెళ్లాల్సిన దూరం తగ్గి గమ్యానికి చేరువవుతాం కదా. అందుకే అంటారు. "ఎ జర్నీ ఆఫ్ థౌజండ్ మైల్స్ స్టార్ట్ విత్ ఎ సింగిల్ స్టెప్" అని. ఇందులో అర్థం ఇపుడు మీకు బోధపడే ఉంటుంది కదా.

ఎపుడైనా సరే దూరం ఎంతున్నదన్న విషయాన్ని ఆలోచించకండి. ఆ దూరాన్ని ఎలా తగ్గించగలమా అన్న విషయం మీదే దృష్టి సారించండి. అపుడే మీ దూరదృష్టి దగ్గర దృష్టి అవుతుంది.

అందుకే దేనికైనా ఉపాయం ఉండాలంటారు. ఉపాయం ఉంటే ఎన్ని అపాయాలనైనా అవలీలగా అధిగమించవచ్చు. మీ దగ్గర చక్కటి ఉపాయం ఉందనుకోండి. మీరెలాంటి సమస్యనైనా చిటికెలో అధిగమించగలుగుతారు. అందుకే తెలివి ఉండాలి. అది ఉంటే ఎంత దూరమైనా మీకు దగ్గరగానే తోస్తుంది. అందినంత దూరంలో ఉన్నట్లే ఉంటుంది.

అంతెందుకు. వేసవి సెలవులలో మీరేదైనా టూర్ ప్లాన్ చేసారనుకోండి. చల్లటి ప్రదేశాలు ఊటీ, కొడైకెనాల్ అయితే హాయిగా ఉంటుందనుకుంటారు. ఈ ఊరి పేర్లు వినగానే 'అమ్మో, అవి ఏమన్నా మన ఊరి పక్కన ఉన్నాయా. వెంటనే వెళ్లిపోవ డానికి' అనుకుని బాధపడకూడదు. అలా అనుకుంటే మీ కోరిక ఎప్పటికి తీరుతుంది చెప్పండి. మన జీవితంలో ఏవీ, అన్నీ మన పక్కనే ఉండవు. మనకోసం అవి మన దగ్గరికి రానూరావు.

చదువుకోవాలంటే పిల్లలు స్కూల్‌కి వెళ్లాల్సిందే. బస్సులోనో, ఆటోలోనో ఏదీ లేకపోతే నడిచైనా వెళ్లకతప్పదు. అలాగే కాలేజ్, ఆఫీస్, ఇంకా ఒంట్లో బావుండకపోతే డాక్టరు దగ్గరికి వెళతాం. మన అన్ని అవసరాలకోసం బయట అన్ని చోట్లకు వెళుతూనే ఉన్నాం కదా. మరిక ఇలాంటి విషయాలలో దూరం గురించి ఆలోచించడం ఎందుకు?

ఎంత దూరమైనా, ఎక్కడికి వెళ్లాలన్నా అన్నిరకాల ట్రాన్స్‌పోర్టు సౌకర్యాలు విరివిగా ఉన్నాయి కదా. దూరం అనే దురాలోచనను తుడిచిపెట్టేయండి. దూరాలోచన ఉండాలే కానీ అంతా మీ చేరువలోనే ఉంటుందన్న విషయాన్ని స్పష్టంగా తెలుసుకోండి. ❒

సహనంతో భర్తను మార్చుకోండి..

వ్యధ

ప్రేమలేని భర్తతో కాపురం చేయడం కష్టం. తనువు కోసం తపించే వానికి మనసు పంచడం అసాధ్యం. కట్టుకున్నాక తప్పదని సంసారం సాగించడం నరకప్రాయం. భార్యను బానిసలా చూసే భర్తతో వివాహబంధం కొనసాగించడం దుర్లభం. ఏ విధంగాను సరిపడని భర్తతో సుఖం లేని జీవితం గడపాలా? విడిపోయి సంతోషాన్ని వెదుక్కోవాలా? తేల్చుకోలేకపోతున్నాను. ఇప్పుడు నా వయస్సు 30 ఏళ్లు. నా భర్తకు 50 సంవత్సరాలు. ఎనిమిదేళ్ల క్రితం ఇష్టం లేకున్నా, రెండో పెళ్లి కొడికిచ్చి మా పెద్దలు పెళ్లి చేశారు. అప్పటికే అతని శాడిజం భరించలేక మొదటి భార్య ఆత్మహత్య చేసుకున్నది. అతనికి ఒకవైపు చెవి వినిపించదు, అనుమానం ఎక్కువ. పెద్దగా ఆస్తిపాస్తులు లేకున్నా, గొప్పలు చెప్పి మా అమ్మానాన్నల్ని ఆకట్టుకున్నాడు. అతని అసత్యపు మాటల్ని నమ్మి నన్ను బలవంతంగా వొప్పించి పెళ్లి చేశారు. శోభనం రాత్రి నుంచే అతని లోపాలు బయటపడ్డాయి. ఉదయం లేవగానే మా మేనత్తకు చెప్పుకుని ఏడ్చాను. ఆమె పలువిధాలుగా నన్ను ఓదార్చింది. నెమ్మదిగా భర్తను మార్చుకోవచ్చని వయస్సు ఎక్కువ అయినంత మాత్రాన బాధపడాల్సిన అవసరం లేదని హితోపదేశం చేసింది. కుటుంబ పరువు, వివాహబంధం, సామాజిక ధర్మం కాపాడటం కోసం ఓర్పు, సహనం అలవర్చుకోమన్నది. మా మేనత్త మాటలకు విలువ ఇచ్చి సర్దుకుని కాపురం చేయడం ప్రారంభించాను. అన్యమనస్కంగానే ఏడాదిపాటు ఆయన చేష్టల్ని భరించాను. రోజు ఇంటికి రాగానే సాకులు పెట్టి తిడుతుంటాడు. బానిసలాగా నా చేతకాళ్లు పట్టించుకుంటాడు. యాంత్రికంగా నాతో గడిపి, పక్క గదిలోకి వెళ్లి పడుకుంటాడు. ప్రేమగా మాట్లాడటం, సినిమాలు, షికార్లకు వెళ్లడం లాంటివి ఆయన ఒంటికి పడవు. ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్లాలంటే ఎవరిని చూడటానికంటూ వ్యంగంగా మాట్లాడుతాడు. కట్టుకున్నందుకు కూడు పెడుతున్నాను, తింటున్నందుకు బానిసలా పడి వుండు అన్న ధోరణిలో వ్యవహారిస్తుంటాడు. ఇవన్నీ భరించలేక ఒకరోజు మా ఊరికి వెళ్లిపోయాను. ఇక అతనితో కలిసి వుండలేనని మా అమ్మనాన్నలకు తెగేసి చెప్పాను. కాదు, కూడదని అతని దగ్గరకు పంపించే ప్రయత్నం చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాను. ఇక చేసేది లేక అమ్మనాన్నలు సరేనన్నారు. అయితే నా దురదృష్టం వల్ల అప్పటికే గర్భం దాల్చాను. మళ్లీ అందరు తలా ఓ హితవు చెప్పడం వల్ల తిరిగి భర్త ఇంటికి చేరుకున్నాను. అతనిలో మార్పు లేకున్నా నేనే మారాను. అతన్ని ఒప్పించి టైలరింగ్ నేర్చుకుని, ఇంట్లోనే కుట్టుపని ప్రారంభించాను. రోజంతా పని చేసుకుంటూ బిడ్డను చూసుకుంటూ, బతకడం ప్రారంభించాను. యాంత్రికంగా దాంపత్యం సాగిస్తూనే మరో బిడ్డకు జన్మనిచ్చాను. అయితే ఏడాది నుంచి ఆయన వేదన ఎక్కువయ్యింది. శృంగారకాంక్షతో నన్ను ఎక్కువగా బలవంతం చేస్తున్నా కాదంటే ఎవరితో కులుకుతున్నావంటూ అనుమానిస్తున్నాడు. ఇంటికి రాగానే బూతులు తిట్టడం ఎక్కువయ్యింది. ఎవరైనా మగవారితో మాట్లాడితే వారితో అక్రమ సంబంధం అంటగట్టిస్తున్నాడు. నా కాళ్లమీద నేను నిలబడం, ఇద్దరు పిల్లల్ని పోషించుకోగల నేను ఆయనతో తెగతెంపులు చేసుకోవాలనుకుంటున్నాను. నా ఆలోచన మంచిదేనా తెలుపగలరు.

- కమలమ్మ, రాయచోటి



అమ్మా, మీరు ప్రేమ రాహిత్యం, అనుమానపు చాదస్తం గల భర్తతో బాధపడుతున్నావనడంలో సందేహం లేదు. మీకంటే ఇరవై ఏళ్లు పెద్దవాడు, ప్రవర్తనా లోపాలు వున్న వ్యక్తికి రెండవ భార్య కావడం కూడా దురదృష్టమే. అంతమాత్రాన ఈ దశలో ఆయనతో తెగతెంపులు చేసుకోవాలనుకోవడం అంత మంచిది కాదు. మీరు మీ కాళ్లమీద నిలబడగలరు. పిల్లల్ని పోషించుకోగలరు అనడంలోను సందేహం లేదు. అయితే తండ్రికి దూరంగా పెరగాల్సి రావడం పిల్లలపై దుష్ప్రభావాన్ని చూపే ప్రమాదం వుంది. ఒంటరి మహిళగా సమాజంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వుంటుంది. భర్తకు దూరమైన మహిళల్ని సమాజం చులకనగా చూస్తుంది. మీ పిల్లలు చదువులు పూర్తై పెళ్లిళ్లు చేసుకోవాలనుకునే సమయంలో, మీ గతం అవరోధం కావచ్చు. అలాగే వృద్ధాప్యంలోను పలు సమస్యలు ఎదురు అయ్యే అవకాశాలు వున్నాయి. కాబట్టి మరో కోణంలో ఆలోచించడానికి ప్రయత్నించండి. మీవారి వయస్సు తగ్గించలేకపోయినా లోపాలు సరిదిద్దవచ్చు. డాక్టర్ల సహాయంతో మీవారి చెముడు సమస్యను పరిష్కరించవచ్చు. అలాగే కుటుంబ సలహా నిపుణులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ చేయించి ఆయన ప్రవర్తనను, అనుమానపు రుగ్మతను సరిదిద్దవచ్చు. ఒకవేళ ఆయనలోని అనుమానపు సమస్య తీవ్రంగా వుంటే సైక్రియాట్రిస్టును కలిసి చికిత్స చేయిస్తే పూర్తిగా నయమయ్యే అవకాశాలు వున్నాయి. అలాగే మీరు కూడా ఆయనలోని లోపాలను క్షమించి, మంచి గుణాలను వెదకగలిగితే మనసు ఊరట చెందుతుంది. ఇవన్నీ మీరు ఇది వరకే చేసి వుండవచ్చు. వైద్యం, మానసిక చికిత్స వల్ల మీ భర్తను మార్చుకోవచ్చన్న ఆలోచనలు రాకపోయి వుంటుంది. మన సమాజంలో చాలామంది మనిషిని మార్చవచ్చన్న విషయాన్ని గుర్తించడం లేదు. కర్మసిద్ధాంతం, పూర్వజన్మసుకృతం, ఈ జన్మకు ఇంతేలాంటి మాటలతో పొద్దుపుచ్చడం అలవాటు చేసుకుంటారు. మార్చలేని అంశాలను పక్కనబెట్టి, మార్చగల వాటిపై దృష్టి పెట్టడానికి ప్రయత్నించండి. మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కుటుంబ పాత్రను గుర్తించండి. పిల్లలకు తండ్రిని దూరం చేయాలన్న ఆలోచన మానేయండి. భర్తను మార్చుకుని, సంసారాన్ని తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయండి. తప్పకుండా సుఖ, సంతోషాలు మీ వశమవుతాయి.

- డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి, సైకాలజిస్ట్

పాదుకా మహోత్సవం

ఆధ్యాత్మికం

నవవిధ భక్తులలో ఒకటి పాదసేవ. పాదసేవ లేదా పాదసేవనం ఈ నాటిమాట కాదు. కృతయుగంలో ప్రహ్లాదుడు నవవిధ భక్తులను పేర్కొన్నాడు. అవి శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం. మొదటిసారిగా పాదసేవనాన్ని ప్రహ్లాదుని మనుమడైన బలిచక్రవర్తి చేశాడు. వామనావతారంలో ఆవిర్భవించిన వామన రూపుడైన నారాయణునకు మూడడుగల భూమిని దానమిచ్చే సమయంలో చేశాడు. భార్య జలమునుపోయగా బలిచక్రవర్తి వామనుని కాళ్లు కడిగి, తుడిచెను. గిరీశుడు, చంద్రకళాధకుడు, దేవదేవుడును అగు శంకరుడు కూడా ఎవరి పాదజలములను భక్తితో శిరస్సున ధరించునో, అట్టి విష్ణుపాదజలములను బలిచక్రవర్తి తనకు పరమక్షేమమని నమ్మి శిరస్సున ధరించెను. అత్రివిక్రముని పాదములను వివిధ లోకములలో నున్నవారు దర్శించి మహాభక్తితో నమస్కరించిది. ఇక బ్రహ్మదేవుడు విష్ణుపాదపద్మమును చూచి 'ఇదే నా పుట్టిల్లు' అనుకొని సంతోషముతో నాట్యం చేసేను. తన కమండలములోని జలముతో ఆపాదపద్మముల నభిషేకించెను. త్రేతాయుగంలో భరతుని కంటె రామపాదములను సేవించినది గుహుడు. భావార్ధ రామాయణములో వనవాసానికి బయలుదేరిన శ్రీరాముడు గుహునితో 'వేగంగా ఒక నావను తీసుకురా. ఈరోజు మేము ఆవతలి తీరానికి వెళ్లి ప్రయాగలో నివసించాలి' అన్నాడు. గుహుని తల్లి వచ్చింది. ఆమె శ్రీరాముని చూస్తూ 'శ్రీరఘునాథా! మా అందర్నీ నీవు నాశనం చేయవద్దు. నీ లీల అవగాహన చేసుకోవటం కష్టం. నీ గొప్పదనం ఎవరికి తెలియదు. నీచరణాలతో పాషాణాన్ని ఉదరించి, అచేతన వస్తువును సచేతనంగా చేశావు. మేము ఈ నావ మీదనే జీవిస్తాం. అది నీచరణాలతో ఉదరింపబడితే (స్త్రీగా మారితే) మా జీవనం కుంటుపడుతుంది. మరి మేం ఏంచేయాలి? చరణరజం సోకగానే జడాన్ని ఉద్ధరింపజేసే నీ గొప్ప చరణాలను కడగనివ్వు' శ్రీరామునికి సంతోషం కలిగింది. గుహుని తల్లి భావం శ్రీరాముడిని పరవశింపచేసింది. దీనులను ఉద్ధరించాలనే శ్రీరాముని తపన. ఇక్కడ యుక్తిని ప్రదర్శించింది. రాముని పరధూళులే పదివేలు ఎవరికైనా! ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని పాదములాశ్రయించిన వారెందరో ఉన్నారు. పుష్పమాలాకారుడైన సుదాముడు శ్రీకృష్ణుని. 'నీ పాదకముల సేవయు, నీ పాదార్చకులతోటి నెయ్యమును నితాం తాపార భూతదయమును దాపసమందార! నాకు దయసేయగదే!' అని ప్రార్థించాడు. కృష్ణుడు కాదన లేదు. ఇక కలియుగం వచ్చింది. కలియుగ అవతారుడు సాయి.

భాయి అలీబాగ్‌కర్, డాక్టర్ రామారావుల కృషి ఫలితంగా గురుస్థాన్‌లో పారుకలు ఏర్పడాయి. ఈ పాదుకలను 1912 శ్రావణ పూర్ణిమ పర్వదినాన ప్రతిష్టించడం జరిగింది. ఉపాసనీబాబా ఈ సందర్భంగా రచించిన రెండు శ్లోకాలను పాలరాతి ఫలకంపై చెక్కటం జరిగింది. గోవింద్ కమలాకర్ దీక్షిత్ ఉపాసన పారుకలను ఖండోబామందిరం నుండి మేళతాళములతో ఊరేగింపుగా ద్వారకామాయికి తెచ్చాడు. సాయిబాబా ఆపాదుకలనుతాకి 'ఇవి భగవంతుని పాదుకలు' అనినుడివి వేపచెట్టు కింద ప్రతిష్టింపుమని ఆదేశించాడు. చతుర్వేదములకు సంకేతంగా నలుగురు వేదపండితులు నలుగురు వేదములకు సంకేతంగా విచ్చేసి, పాదుకా ప్రతిష్టా కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ పాదుకుల వద్ద ఆరతి ఇవ్వబడేది. ఆనాటి శ్రావణపూర్ణిమ దినాన ప్రతిష్టలో భాగంపంచుకోలేకపోయినా, ఈనాడు సాయి పాదుకలను స్మరిద్దాం! శ్రీసాయినాథ్ చరణీ మనసాస్మరామి!

- యం.పి.సాయినాథ్

బీరపొట్టు పచ్చడి

కావలసినవి

- బీరపొట్టు-రెండు కప్పులు
- ఎండుమిర్చి-4-5
- జీలకర్ర-ఒక టేబుల్‌స్పూన్
- ధనియాలు-రెండు టేబుల్‌స్పూన్లు
- నువ్వులు-మూడు టేబుల్‌స్పూన్లు
- మినపప్పు-రెండు టేబుల్‌స్పూన్లు
- శనగపప్పు-రెండు టేబుల్‌స్పూన్లు
- చింతపండు-పెద్దనిమ్మకాయంత
- ఉప్పు-తగినంత
- ఆవాలు, జీలకర్ర-పావుటేబుల్‌స్పూన్, కరివేపాకు-రెండు రెబ్బలు
- నూనె-నాలుగు టేబుల్‌స్పూన్లు



తయారుచేసే విధానం

బీరపొట్టు బాగా కడిగి సన్నగా తరిగి పెట్టుకోవాలి. కడాయిలో జీలకర్ర, ధనియాలు, నువ్వులు, ఎండుమిర్చి వేసి దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అందులోనే రెండు చెంచాలు నూనె వేడిచేసి బీరపొట్టు వేసి మగ్గనివ్వాలి. ఇందులోని నార, గింజలు తీసిన చింతపండు వేయాలి. పూర్తిగా మెత్తబడ్డాక దింపేయాలి. చల్లారిన తర్వాత ముందు వేయించుకున్న దినుసులు పొడిచేసుకుని పొట్టు, చింతపండు, తగినంత ఉప్పువేసి మెత్తగా రుబ్బుకోవాలి. చిన్న గిన్నెలో మిగిలిన నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక కరివేపాకు వేసి పచ్చడిలో కలపాలి. ఇష్టముంటే పోపులో నలక్కొట్టిన వెల్లుల్లి రెబ్బలు వేసుకోవచ్చు. ❒

ఏరోబిక్స్‌తో ఎన్నో లాభాలు

వ్యాయామం చేస్తే బోలెడంత ఆరోగ్యం అని తెలిసిందే కదా. మరి అందం కూడా పెరుగుతుందని తెలుసా. ఏరోబిక్స్ చేసేవాళ్లకు ఈ లాభాలు మరీ ఎక్కువ తాజాగా నిర్వహించిన కొన్ని పరిశోధనలు అదే చెబుతున్నాయి. ఏరోబిక్స్ తరచూ చేసేవాళ్లు, చేయనివాళ్లకంటే ఎంతో అందంగా, ఉల్లాసంగా ఉంటారట. వృద్ధాప్యఛాయలు అంత త్వరగా దరిచేరవు. జీవితాంతం ఏరోబిక్స్ ప్రభావం శరీరంపై ఉంటుంది. వయస్సు పెరిగే కొద్దీ మతిమరుపు సమస్య చాలామందిని వేధిస్తుంది. మానసికంగానూ కొందరు బలహీనంగా తయారవుతారు.

కానీ ఫిట్‌గా ఉండేవాళ్లతో ఆ సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువ. వ్యాయామం, అదీ ఏరోబిక్స్ చేస్తూ ఎదిగిన వాళ్లలో జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యంతో వయస్సొచ్చినా మెరుగ్గానే ఉంటాయి. ఎంతోమందిని సర్వేచేసి, వారికి తగిన పరీక్షలు నిర్వహించిన తర్వాత తేల్చిన నిజాలే ఇవి. మీకు ఈరకం వ్యాయామం అలవాటు లేకపోతే, ఇప్పుడు సాధన మొదలుపెట్టేయండి. ❒



వార్తాఫలం

మేషం: మనోధైర్యంతో ఉంటారు. సాహస యాత్రలు చేస్తారు. కుటుంబ సౌఖ్యాలు. ఆదాయం పొందుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు. నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

వృషభం: వ్యాపారమందు లాభాలు, వృత్తియందు కీర్తి. అవకాశం. ధనలాభాలను పొందుతారు. వ్యాపార లాభాలను పొందుతారు. చేపట్టిన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. బంధువుల సహాయ సహకారాలు అందుకుంటారు.

మిథునం: వృత్తి, వ్యాపార వ్యవహారాలందు ధనలాభాలను పొందుతారు. సుఖహానియూ కలుగును. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు తొలగుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం చేసుకుంటారు.

కర్కాటకం: ఉద్యోగమునందు ప్రమోషన్స్‌కు అవకాశం. ఆరోగ్యం బాగుంటుంది. భాగస్వామ్య వ్యాపారాలలో మంచి లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

సింహం: బంధువుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ వుండడం మంచిది. దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

కన్య: మాతృసౌఖ్యం, పరాక్రమ ప్రదర్శనలు. ఉద్యోగాభి వృద్ధిని పొందుతారు. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ముఖ్యమైన పనులలో నిదానం అవసరం. కోపతాపాలకు, దూరంగా ఉండటం మంచిది.

తుల: సౌఖ్యం, ఉద్యోగ ప్రాప్తి, దైవదర్శనం చేస్తారు. రుణాలు తీర్చక ఇబ్బందులు పడవచ్చు. ఉద్యోగంలో అభివృద్ధికి అవకాశం. శుభకార్యాలకు హాజరవుతారు. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక భావాలతో వుంటారు.

వృశ్చికం: రుణాల బాధ, కార్యసాధన, ధనలాభాలను పొందుతారు. జాయింటు సమస్యలకు అవకాశం. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తారు.

ధనుస్సు: ఉద్యోగ సౌఖ్యం, ధార్మిక యోగ్యతలు. కుటుంబ సౌఖ్యాలకు అవకాశం. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు.

మకరం: ధన వ్యయాలు చేస్తారు. ఆపదలకు అవకాశం. మానసిక ఆందోళనలు. శారీరక మానసిక శ్రమలకు అవకాశం. శుభకార్యప్రాప్తి, ప్రమోషన్స్‌కు అవకాశం. బంధువుల నుండి ఎదురైన సమస్యలను అధిగమిస్తారు.

కుంభం: స్థల మార్పులు, ఆలోచనల్ని అమలు పరుస్తారు. ఆరాటాలు, ఆందోళనలకు అవకాశం. యత్నకార్యసిద్ధి. నూతన వ్యక్తులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

మీనం: సాంఘిక సంబంధాలు పెరిగి గౌరవ మర్యాదలు. ఆరోగ్యం, దుష్టుల కలయిక. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. కుటుంబ సభ్యుల సాయం అందుతుంది.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్



బోయపాటి శ్రీను దర్శకత్వంలో యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్ర జయజానకి నాయక. ఆగస్టు 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

ప్యాకప్ కాగానే రకూల్‌నే..



జయజానకి నాయక గురించి చెప్పండి?

జయజానకి నాయక అందరికీ తెలిసినట్టు బోయపాటి సార్ స్కూల్ నుంచి డిఫరెంట్ ట్రీట్‌మెంట్‌తో వచ్చిన సినిమా. బోయపాటి సార్ సిగ్నేచర్ యాక్షన్ ఉంటుంది. ఆయన సిగ్నేచర్ ఉంటుంది. ఇందులో మెయిన్ యాస్పెక్ట్ ఏంటంటే లవ్‌స్టోరీ. ఒక ఇన్సిడెంట్ వల్ల ఆమె మొత్తం లైఫ్ మారిపోతుంది.

ఆ ఇన్సిడెంట్ ఏంటి? ఎక్కడ? అనేది ఈ సినిమాలో చాలా కీలకం.నెగటివ్ టచ్ ఉంటుందా?

నెగటివ్ ఉండదండీ కానీ లైఫ్‌లో జరిగిన ఒక ఇన్సిడెంట్ వల్ల ఆమె ఎందుకలా శాడ్‌గా మారి ంది? అనేది ఆసక్తికరం. ఇప్పటిదాకా నేను చేసిన పాత్రల్లో మోస్ట్ ఎమోషనల్ పాత్ర ఇదే. ఆ సమయంలో మా అమ్మ ఫోన్ చేసిన సరే నేను మాట్లాడకపోయేదాన్ని. బీయింగ్‌లో ఫీలింగ్‌లో దాని కోసం చాలా ఎనర్జీ కావాల్సి వచ్చేది.

డిప్రెషన్ అనేది నేచురల్‌గా జరుగుతుంది కదా...దాన్ని సినిమాలో ఎలా ప్రెజెంట్ చేశారు?

అంటే డిప్రెషన్ అనేది డిస్ కనెక్ట్ యువర్‌సెల్ప్ అన్నమాట. షూటింగ్ సమయంలో నార్మల్ మూడ్‌లో ఉంటే ఫోన్లు చూసుకోవచ్చు. చాట్ చేసుకోవచ్చు. ఏదైనా చేసుకోవచ్చు. కానీ మనం డిప్రెషన్ మూడ్‌లో ఉంటే మాత్రం అవన్నీ చాలా కష్టం.

అప్పుడు మీ మైండ్ స్టేట్ ఎలా ఉండేది?

చాలా బ్లాంక్‌గా ఉండేదాన్ని. చాలా మంది లైఫ్‌లో జరిగిన ఏదో ప్రమాదాన్నో, చెడునో ఊహించుకుని ఉంటారు. కానీ భగవంతుడు దయవల్ల నా లైఫ్‌లో ఎప్పుడూ ఏ బ్యాడూ జరగలేదు.బోయపాటి సార్ నా దగ్గరకు వచ్చి షాట్ అయిపోయింది. నువ్వు నవ్వొచ్చు కాస్త అని అనేవారు. అప్పుడు నవ్వేదాన్ని.

> భగవంతుడు దయవల్ల నా లైఫ్‌లో ఎప్పుడూ ఏ బ్యాడూ జరగలేదు

సో దీన్నుంచి ఎలా బయటపడ్డారు?

ప్యాకప్ తర్వాత నేను నార్మల్ లైఫ్‌ని లీడ్ చేసేదాన్ని. ఎందుకంటే చాలా మందికి కేరక్టర్ల ఇంపాక్ట్ ఉంటుంది. కొందరు డిప్రెషన్‌లోకి వెళ్తామని అంటారు. కానీ నేను అలా కాదు. ప్యాకప్ కాగానే నేను రకుల్‌నే. జానకికాదు. నేను మామూలుగా సినిమాలకు వెళ్లేదాన్ని.

డిప్రెషన్‌లో ఉన్న సీన్లను ఎన్ని రోజులు షూట్ చేశారు?

రేపల్లె ఎపిసోడ్, బ్యాంకాక్ ఎపిసోడ్ అలా చేసిందే. దాదాపుగా 25రోజులు డిప్రెషన్‌లోఉన్నట్టు ఉన్నానంతే.గ్లిజరిన్ వాడేవారా?దేవుడి దయవల్ల గ్లిజరిన్ లేకుండా ఏడవాల్సిన అవసరం నాకు రాలేదు. కాకపోతే గ్లిజరిన్ వాడి వాడి సాయంత్రానికి నా కళ్ళు రెండూ బాగా ఉబ్బేవి. నేనొకసారి బోయపాటి గారితోకూడా అన్నాను. సార్ ఈ షెడ్యూల్ అయ్యేసరికి నా కళ్ల కింత చారలు వచ్చేటట్టున్నాయి. రోజూ కళ్ళువాయడం, నేను ఐస్ ప్యాక్ పెట్టడం అవుతోంది అని.

సినిమాలను చూసి ఏడ్చే అలవాటుందా మీకు?

సినిమా మొత్తం చూసి నేనెప్పుడూ ఏడవలేదు. ఎప్పుడో ఒకటీ, అరా సీన్లకు కన్నీళ్లు పెట్టుకునేదాన్ని. ఈ సినిమా కూడా ట్రాజిక్ ఎండింగ్ ఉంటుందా?ఎండింగ్ ఇప్పుడు చెప్పేస్తే జనాలు ఎందుకు చూస్తారండీ

బోయపాటి ఇలాంటి టైటిల్ పెడతారని అనుకున్నారా?

సినిమాకు ఏం కావాలో, ఎలా ఉంటే బావుంటుందో ఇంకేం చేయాలో బోయపాటి గారికి బాగా తెలుసు. సెట్‌లో ఉన్న ప్రతి ఒక్కరి ప్లస్‌లూ, మైనస్‌లు ఆయనకు తెలుసు. ఈ సినిమా కంప్లీట్‌గా జానకి సినిమా. హార్డ్ టైటిల్ పెట్టాలని ఆయన అనుకోలేదు. అందుకే ఆయన ఈ టైటిల్ పెట్టారు.

బోయపాటికి మీస్ట్రెంగ్త్‌లు, వీక్‌నెస్‌లు తెలుసన్నారుగా...మీకు ఆయన ఎప్పుడైనా వాటి గురించి చెప్పారా?

చెప్పారు. నేను కరెక్ట్ చేసుకున్నా. వాటి గురించి ఇప్పుడు చెప్పలేను.మీ ప్రకారం మీకున్న ప్లస్‌లు, మైనస్‌లు ఏంటి?నా బలాలు, బలహీనతలు ప్రజలే చెప్పాలి. మనం ప్రతిదీ పర్ఫెక్ట్‌గా చేస్తామనే అనుకుంటాం. కానీ అందులో ఎంత బలమో, ఏది బలహీనతో మాత్రం ప్రజలే చెప్పాలి.

సినిమా అయిపోయిన తర్వాత క్యారెక్టర్ హ్యాంగ్‌వర్‌లో ఉంటారా?

బ్బే లేదండీ...అదే ఫీలింగ్‌లో ఉండే అమ్మాయిని కాదు నేను. ఎందుకంటే క్యారెక్టర్ మన పర్సనల్ లైఫ్‌ని ఓవర్‌టేక్ చేయకూడదు. ఒకవేళ చేసిందంటే సైకోలా మారుతారు. ఎందుకంటే ఇన్నేసి పాత్రలు చేసిన తరావ్త, ఆ పాత్రల ప్రభావం మన మీద ఉంటే డిప్రెస్ అవుతాం.

ఈ సినిమాలో మీ హార్ట్‌ని టచ్ చేసిన సన్నివేశాలున్నాయా?

ఉన్నాయండీ. నేను సినిమాను ఆడియన్‌గా చూసినప్పుడు వాటిని ఫీలవుతాను. అంతేగానీ సీన్ చేసేటప్పుడు నేను హార్ట్‌ని టచ చేస్తుందని అనుకోను. ఎందుకంటే నేను అక్కడ రకుల్‌ని కాదు...జానకిని మాత్రమే.

భ్రమరాంబకి, జానకికి పోలికలుంటాయా?

లేదండీ...చాలా తేడాలున్నాయి అది సినిమా చూసి తెలుసుకోవాలి.వదులుకోవాల్సిన ప్రతిసారీ...ప్రేమనే వదులుకోవాలా...అనే డైలాగ్.. నా ఫేవరేట్ డైలాగ్ అండీ...

బన్నీ కొత్త చిత్రం ప్రారంభం

హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ సక్సెస్‌తో టాప్ ఫాంలో దుసుకెళ్తున్న స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, అను ఇమ్యూనల్ హీరోయిన్‌గా వక్కంతం వంశీ దర్శకత్వంలో ఇటీవలే పూజా కార్యక్రమాలు జరుపుకున్న నా పేరు సూర్య- నా ఇల్లు ఇండియా రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. యాక్షన్ కింగ్ అర్జున్ ముఖ్య పారతలో శరత్ కుమార్ ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని మెగా బ్రదర్ కె.నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన స బ్యానర్లో శిరీష నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం నిర్మించనున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ -శేఖర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి 2018, ఏప్రిల్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.ఈ సందర్భంగా చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ వరుస బ్లాక్ బస్టర్స్ అందుకొని టాప్ ఫాంలో ఉన్న స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ మా బ్యానర్‌లో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టాము. అన్ని ఎనర్జికి తగ్గట్టుగా చేసిన ఈ కథలో అన్ని కమర్షియల్ అంశాలు ఉంటాయి. అను ఇమ్యూనల్ హీరోయిన్‌గా చేస్తుంది. టెంపర్, కిక్, రేసుగుర్రం వంటి సూపర్ హిట్ చిత్రాలకు కథ అందించి వరుస సక్సెస్‌లు అందుకొని తొలిసారిగా మెగాఫోన్ పట్టిన వక్కంతం వంశీ వర్క్ చాలా ఎనర్జిగా చేస్తున్నాడు. నాగబాబు, బన్నీవాసు గారి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ ముందుకెళ్తున్నందుకు వెరీ హేపీ. ఇండియా గరి వ్యంచదగ్గ నటీనటులు, టెక్నీషియన్స్ టీంతో గ్రాండియర్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. విశాల్ శేఖర్ సూపర్ మ్యూజిక్ అందిస్తున్నారు. 2018 ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాము అన్నారు.నటీనటులు: స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, అను ఇమ్యునల్, యాక్షన కింగ్ అర్జున్, శరత్ కుమార్ తదితరులు సాంకేతిక నిపుణులు: ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావుఫైట్స్: రామ్ లక్ష్మణ్‌సాహిత్యం: రామజోగయ్యశాస్త్రి పొడక్షన్ డిజైనర్: రాజీవన్‌సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవిసంగీతం: విశాల్ - శేఖర్‌ప్రొడక్షన్ కంట్రోలర్: డి.యోగానంద్ ఎగ్జిక్యూటవ్ ప్రొడ్యూసర్- బాబుబ్యానర్ - రామలక్ష్మీ సినీ క్రియేషన్స్‌సమర్పణ: కె.నాగబాబుసహ నిర్మాత: బన్నీ వాసునిర్మాత: శిరీషా శ్రీధర్ లగడపాటిరచన, దర్శకత్వం: వక్కతం వంశీ



దర్శకుడు..తొలి ప్రేక్షకుడిని నేనే

మెగాస్టార్ చిరంజీవిమెగాస్టార్ చిరంజీవి సినిమా రిలీజ్ అవుతుంది అంటే చాలు మొదటిరోజు, మొదటి ఆట, మొదటి టికెట్ కోసం ఎలాంటి హడావుడి ఉంటుందో అందరికీ తెలిసిన విషయమే. అలాంటి మెగాస్టార్ చిరంజీవి ఓ సినిమాకి తొలి ప్రేక్షకుడైతే అవును సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై సుకుమార్ సమర్పణలో దర్శకుడు హరిప్రసాద్ జక్కా రూపొందించిన చిత్రం దర్శకుడు. ఈ చిత్రం ఆగస్టు 4న విడుదల కాబోతుంది. ఈ సందర భంగా చిత్ర మొదటి టికెట్‌ని స్వయంగా మెగాస్టార్ చిరంజీవి కొనుక్కుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక్కడ మరో విశేసం ఏమిటంటే దర్శకులు సుకుమార్ మరియు హరిప్రసాద్ జక్కాలు చిరంజీవి సినిమా మొదటిరోజు మొదటి ఆట కోసం క్యూ కట్టిన వారి లిస్ట్‌లో ఉండటమే. తొలి టికెట్‌ని కొన్న చిరంజీవి దర్శకుడు సినిమా పెద్ద హిట్ కావాలని చిత్ర యూనిట్‌కి బెస్ట్ విషెష్ తెలియజేశారు.నాకు చాలా కొత్తగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. ఫస్ట్ టికెట్‌ని నాకు అందించి, దర్శకుడు సినిమాకి నన్ను తొలి ప్రేక్షకుడిని చేసినటువంటి ఈ దర్శకుడు యూనిట్ సభ్యులకు, ముఖ్యంగా సుకుమార్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శకుడు చిత్ర యూనిట్‌కి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. దర్శకుడు సుకుమార్ ఈ సినిమాని వెనకుండి నడిపించిన వెన్నెముక. సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో గతంలో వచ్చిన కుమారి 21ఎఫ్ ఎంత సూపర్‌హిట్ అయ్యిందో మనందరికీ తెలిసిన విషయమే. అలాగే ఈ దర్శకదు చిత్రం కూడా సుకుమార్ సమర్పణలో తెరకెక్కడం, అలాగే ఆయన సోదరులు ఈ చిత్రానికి నిర్మాతలు కావడం అభినందించాల్సిన విషయం. సుకుమార్‌లో నచ్చిన విషయం ఏమిటంటే ఒక దర్శకుడిగా ఆయన ఉన్నతస్థానంలో ఉనానడు. తను కమరిషయల్ సినిమాలు చేసుకుంటూ, ఉన్న సమయంలో మంచి కథాన్వేషణలో మంచి కథలను క్రియేట్ చేసుకుంటూ, అటు కమర్షియల్‌గా డబ్బుని, పేరుని తను సంపాదించు కోవచ్చు. కేవలం నేనేమిటి అనకుండా, ఈ సినిమా ఇండ స్ట్రీకి నేనేమిటి అనే కోణం నుంచి ఆలోచిస్తూ తను అప్‌కమింగ్ స్టోరీ రైటర్స్‌ని గానీ, అలాగే డైరెక్టర్స్‌ని గానీ, అలాగే ఆర్టిస్ట లని గాని వాళ్ళని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోటి సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌ని స్థాపించడం, అందులో ఔత్సాహికులైనవారికి అవకాశాలు ఇవ్వడం మనస్ఫూర్తిగా అభినందించాల్సిన విషయం అన్నారు.



బంగారి బాలరాజు



నంది, చల్లా క్రియేషన్స్ బ్యానర్‌పై కెఎండి రఫీ నిర్మాతగా బంగారి బాలరాజు మూవీని రూపొందిస్తున్నారు. ఈ మూవికి లవ్ ఈజ్ బ్యాక్ ట్యాగ్ లైన్. రైల్వేట్రాక్ అనే టెలీ ఫిల్మ్ తొలి చిత్ర ఉత్తమ చిత్ర దర్శకుడిగా నంది అవార్డును సొంతం చేసుకున్న కోటేంద్ర దుద్యాల ఈ మూవీకి దర్శకత్వంతో పాటు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే బాధ్యలు నిర్వహిస్తున్నారు. నిర్మాతగా రఫీ నిర్మిస్తున్న ఈ తొలి చిత్రం షూటింగ్ రామానాయుడు స్టూడియోలో బుధవారం లాంఛనంగా ప్రారంభమైది. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ మూవీకి క్లాప్‌ను గాడ్‌ఫాదర్ సాగర్ ఇవ్వగా, యువ హీరో నాగ అన్వేష్ కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ మూవీ స్క్రిప్ట్‌ను సిందూర పువ్వు కృష్ణారెడ్డి చేతుల మీదుగా నిర్మాత రఫీ, దర్శకుడు కోటేంద్ర స్వీకరించారు.అనంతరం ఆ చిత్ర దర్శఖుడు కోటేంద్ర దుద్యాల మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నానని తెలిపారు. నిర్మాత మహ్మద్ రఫీ మాటాలడుతూ ఈ సినిమాలో కథని ఒక లైన్ తనకు వినిపించారని, అది నచ్చే ఈ చిత్రానికి నిర్మాణ బాధ్యతలు చేపట్టానని వెల్లడించారు. ఇది ఒక మంచి లవ్‌స్టోరీ అని తెలిపారు.



ఎఫ్‌డిసి చైర్మన్ కుమార్తె వివాహ వేడుక

తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పుస్కూర్ రామ్‌మోహన్‌రావు రేణుకరావుల కుమార్తె దేదీప్య వివాహం విష్ణుచరణ్‌తో బుధవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్రముఖ్యమంత్రి కెసీఆర్, మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు, రాష్ట్ర మంత్రులు హరీష్ రావు, జగదీశ్వర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, నమస్తే తెలంగాణ సిఎండి దామోదర్ రావు, కే. కేశవరావు, జి.వివేక్, వినోద్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, యాదవరెడ్డి సినీ ప్రముఖులు కృష్ణ, సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, నితిన్, అల్లు అరవింద్, శ్యాప్ ప్రసాద్‌రెడ్డి, కె. మురళీమోహన్‌రావు, బివిఎస్ఎన్ ప్రసాద్, సి.కళ్యాణ్, ఆర్.నారాయణమూర్తి, వి.వినాయక్, జెమిని కిరణ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నిజ ఘటన ఆధారంగానే సినిమా చేశా: నరసింహ నంది

1940లో ఓ గ్రామం, హైస్కూల్, కమలతో నా ప్రయాణం, లజ్జ వంటి విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలు చేస్తూ మంచి అభిరుచి ఉన్న దర్శకుడుగా పేరు తెచ్చుకున్నారు నరసింహ నంది. తాజాగా బుడ్డారెడ్డి పల్లి బ్రేకింగ్ న్యూస్ పేరుతో మరో విభిన్నమైన సినిమాని రూపొందించారు. లక్ష్మీ నరసింహ సినిమా పతాకంపై నరసింహ నంది మిత్రులు నిర్మించిన ఈ సినిమా గస్టు 4న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు నరసింహ నందితో ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..



ఒక విలేజ్‌లో జరిగే కథ. గేదె ఒక ఫ్యామిలీని పోషిస్తుంటుంది. ఆ గేదె చనిపోతే ఆ ఫ్యామిలీకి ఎలాంటి సమస్యలు వస్తాయి అనేది మెయిన్ కాన్సెప్ట్. ఇరానియన్ మూవీ ది కౌ ఈ సినిమాకి ఇన్‌స్పిరేషన్. దరుషి మెహర్జాన్ ఆ సినిమాకి దర్శకుడు. ఒక జంతువుకి, మనిషికి ఉన్నరిలేషన్ ఎలాంటిది అనేది ఆ సినిమా చూసిన తర్వాత నాకు తెలిసింది. వాళ్ళిద్దరు మధ్య ఎలాంటి ఎఫెక్షన్ ఉంటుందనే ఆ సినిమాలో చూపించారు. పాతవారైతే ఆ క్యారెక్టర్‌లో ఒదిగిపోవాలంటే కొంచెం కష్టంగానే ఉంటుంది. నేను క్రియేట్ చేసుకున్న క్యారెక్టర్స్ అన్నీ చాలా నేచురల్‌గా ఉంటాయి.మీ గత చిత్రాలు కమర్షియల్‌గా సక్సెస్ అవ్వలేదు. ఈ కథని కొంచెం కమర్షియలైజ్ చేశాను. ఇందులో లాయర్ క్యారెక్టర్ ఉంటుంది. అతనికి ఓ లవ్‌స్టోరీ ఉంది. తన గేదె చనిపోయిందని, తనకున్యాయం చేయాలని గేదె యజమాని ఫై చేస్తుటాడు. దీన్ని కమర్షియల్ యాంగిల్‌లోనే తియ్యడం జరిగింది. ఒక్కపక్క మీడియా, ఒకపక్క రిపోర్టర్, మరో పక్క టివి.ఛానల్ ఇలా మూడు యాంగిల్స్ లో కమర్షియల్‌గానే చెప్పడం జరిగింది. ఇంతకుముందు నేను చేసిన సినిమాలు స్లో నేరేషన్‌లో ఉంటాయి. ఇందులో రెండు పాటలున్నాయి. ఒకటి రాజమండ్రిలో తీశాం. మరొకటి సిట్యుయేషనల్ సాంగ్. మీడియా మీద రాసిన పాట అది. చల్లా భాగ్యలక్ష్మీగారు ఈ పాటను చాలా అద్భుతంగా రాశారు. ఈ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది.బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్ అనే టైటిల్ పెట్టడానికి కారణం?ఈ సినిమా అంతా బుడ్డారెడ్డిపల్లి అనే గ్రామంలోనే చేశాం. ఆ గ్రామం నుంచి వెళ్ళినవారంతా చాలా గొప్ప వాళ్ళయ్యారని చెబుతారు. ఆ ఊరికి 200సం వత్సరాల చరిత్ర ఉంది. ఆ ఊళ్ళో ఉన్న బావినీరు తాగడం వల్ల అక్కడ పుట్టి పెరిగిన వారంతా మేధావులైపోయారు అని చెపుకుంటారు. అంతేకా కుండా బుడ్డారెడ్డిపల్లి అనే పేరు కూడా డిఫరెంట్‌గా ఉండాలని ఆ టైటిల్ పెట్టడం జరిగింది ఇప్పటికి 75 శాతం షూటింగ్ పూర్తయింది. ఉత్పలమాల ఉత్తరం రాసింది ఆ సినిమా టైటిల్. చాలా మంచి సబ్జెక్ట్. కొన్ని తెలుగు పదాలు మనుషుల రూపంలో వస్తే, ఇప్పుడు నం మాట్లాడుకుంటున్న భాషను చూస్తే వాళ్లు ఎలా ఫీల్ అవుతారు అనేదే కథ.

అనుకున్నట్లే వడ్డీరేట్ల తగ్గింపు

ద్రవ్యోల్బణం, రుతుపవనాలే కీలకం
25బేసిస్ పాయింట్ల రెపోరేట్ తగ్గింపు
రివర్స్‌రెపోరేటు 5.75శాతం

ముంబయి, ఆగస్టు2: కార్పొరేట్‌రంగం, పారిశ్రామికరంగం ముందుగా ఊహించిన విధంగా రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లలో కోతలు విధించింది. ఇప్పటివరకూ ఉన్న 6.25శాతం వడ్డీరేట్లను 0.25శాతం తగ్గించి ఆరుశాతానికి తెచ్చింది. అలాగే వాణిజ్యబ్యాంకుల నుంచి రిజర్వు బ్యాంకుకు తెచ్చే జమలపై ఇచ్చే వడ్డీరేటు రివర్స్ రెపోరేటును కూడా తగ్గించింది. 25బేసిస్ పాయింట్లు తగ్గించి 5.75 శాతానికి తెచ్చింది. కీలకద్రవ్యోల్బణం నాలుగు శాతానికి తెచ్చే లక్ష్యంతోనే ఈ వడ్డీరేట్లను సవరించినట్లు రిజర్వుబ్యాంకు గవర్నర్ చెపుతున్నారు. రానున్న కాలంలో కొంత ద్రవ్యోల్బణంపై ప్రభావాలు లేకపోలేదని అంచనా. వృద్ధి అంచనాలు కూడా ప్రస్తుత ఆర్థికసంవత్సరానికి 7.3శాతం ఉంటుందని ఆర్‌బిఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఇన్‌ఫ్రారంగంలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడం, ప్రైవేటు పెట్టుబడులను మరింతగా ప్రోత్సహించడం వంటివి కీలక లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. విదేశీ కరెన్సీ నిల్వలుసైతం రికార్డుస్థాయిలో ఉండటంతో మానిటరీ పాలసీ లక్ష్యంగా మరింత పెరుగుతాయని అంచనా. 392.9బిలియన్ డాలర్లకు పెరిగాయంటే విదేశీకరెన్సీ ఖజానా తళతళలాడు తున్నట్లుననిపిస్తోంది. ఇక వ్యవసాయ రుణాల మాఫీవల్ల ఆర్థిక లోటు సమతుల్యత దెబ్బతింటుందని, ప్రభుత్వ వ్యయంపై నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటాయని అంచనా. ప్రభుత్వం, ఆర్‌బిఐ భారీఎత్తునపెరిగిన ఎన్‌పిఎలను రిష్కరించేందుకు ప్రభుత్వరంగ బ్యాంకు లను పునరుత్తేజం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించింది. బ్యాంకుల ఆస్తి అప్పుల పట్టీల్లోఎక్కువ ఒత్తిడి ఉంటున్నది. బ్యాంకులు, కార్పొరేషన్లపరంగా కూడా ఇదే ధోరణి వ్యక్తం అవుతున్నది. ప్రస్తుతం సవరించిన రెపోరేట్లు 2010 నవంబరు నాటి గణాంకాలను స్పష్టంచేస్తు న్నాయని అన్నారు. ఆహార ఉత్ప త్తులధరలు జూన్ నెలలో తగ్గడంవల్ల రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేళ్ల కనిష్ట స్థాయికి అంటే 1.54శాతానికి వచ్చిందని అంచనా. మానిటరీపాలసీ కమిటీ సమా వేశంలో ద్రవ్యోల్బణం రానున్నకాలంలో ఉన్న సమస్యలు కొంత ప్రభావి తం చేస్తాయని అంచనా. కీలకద్రవ్యోల్బణం ఇంటి అద్దెభత్యం పరంగా కొంతమేర అంచనాలు తగ్గాయి. నాలుగోత్రైమాసికం చివరి నాటికి నాలుగుశాతంగా ఉం టుందని అంచనా. ఇక ఆహార ఉత్పత్తులు, చమురు రంగం మినహాయించి ద్రవ్యోల్బణం గడచిన మూడునెలల్లో భారీగా తగ్గింది. జిఎస్‌టి అమలు, రుతుపవనాలు సకాలంలో రావడం వంటివి కొంత కలిసొచ్చాయని భావించిన ఎంపిసిసాధ్యమైనంతగా రెపోరేట్ ను 25బేసిస్‌పాయింట్లు తగ్గించేందుకు దోహ దంచేసాయి. ప్రస్తుతం ఆర్థికపరిస్థితి మదింపు వల్ల మానిటరీ పాలసీ కమిటీ రెపోరేట్‌ను బేసిస్ పాయింట్లు తగ్గిచడం, ద్రవ్యసర్దుబాటు సౌకర్యం (ఎల్ఎఎఫ్) 25బేసిస్ పాయింట్ల తగ్గించి 6.25నుంచి 6శాతానికి తగ్గించింది. తక్షణమే అమలులోకి వస్తుంది. అదేవిధంగా రివర్స్ రెపోరేట్ 5.75శాతానికి తగ్గింది. ఇక



స్వల్ప సర్దుబాటు సౌకర్యం కింద బ్యాంకు రేటు 6.25శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఎంపిసి కమిటీ రెపోరేట్లను ప్రకటించ డానికి ముందే 56 మంది ఆర్థికవేత్తల అభి ప్రాయాలు సేకరించిన రేటింగ్ సంస్థలు ఖచ్చితంగా 25బేసిస్ పాయింట్లు తగ్గిస్తుం దని వెల్లడించాయి. మానిటరీ పాలసీ కమిటీ లో నలుగురుసభ్యులు 25 బేసిస్ పాయింట్లు కొత విధించేందుకు అంగీకరించారు. ఒకరు మాత్రం 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని, మరొకరు అసలుస్థిరంగా కొనసాగించాలని అభిప్రాయాలు వెల్లడిం చారు. వచ్చేమానిటరీపాలసీ కమిటీ సమావేశం అక్టోబరు 3,4తేదీల్లో జరుగు తుందని ఆర్‌బిఐ ప్రకటించింది. వడ్డీరేట్ల తగ్గింపు అనేది ఒక కీలకమైన మలుపుగా కార్పొరేట్, ఆర్థికవేత్తలు అభివర్ణిస్తున్నారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్రగార్గ్ మాట్లా డుతూ సుస్థిర ఆర్థికవృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఏప్రిల్ సెప్టెంబరు నెలల్లో ద్రవ్యోల్బణం 2-3.5శాతంగా ఉంటుంది. 3.5 నుంచి 4.5శాతం వరకూ పెరుగుతుందని అంచనా వేసింది. రానున్న కాలంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉన్నందున గణాంకాల్లో మార్పులు ఎప్పుడైనా సంభవించొచ్చని అంచనావేసింది. కీలక ద్రవ్యోల్బణం నాలుగుశాతానికి మించకుండా చూడాల న్నదే ఆర్‌బిఐలక్ష్యంగా గవర్నర్ ఉర్జిత్‌పటేల్ వెల్లడించారు. అక్టోబరు డిసెం బరు నెల మధ్యకాలంలో ద్రవ్యోల్బణం 3.5 నుంచి 4.5శాతం మధ్య నిలుస్తుందని కూడా అంచనావేశారు. ద్రవ్యోల్బణధోరణం చూస్తే అనేక అంశాలు ప్రభావితంచేస్తున్నాయని, అనిశ్చితి పెరుగుతున్నట్లు పేర్కొన్నది. ఇక వ్యవసాయ రుణాల మాఫీ వంటివి ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని, ప్రభుత్వ వ్యయం, ద్రవ్యోల్బణ పరిస్థితులు మారతాయని అంచనావేసింది. ఇక రాష్ట్రాల జీతభత్యాల అలవెన్సుల అమలు కూడా కొంత సంక్లిష్టంఅవుతుందని అంచనావేసింది. ఇక రానున్నకాలంలో కూరగాయల పరంగాధరలు పెరుగుతాయని, మాంసాహార ధరలు కూడా పెరిగే అవకాశాలున్నట్లు అంచనా వేసింది. ఈ సంవత్సరంలో ఆర్‌బిఐ మరికొన్ని కోతలు విధించే అవకాశం ఉందని అంచనావేశారు. ఈ ఏడాది 25బేసిస్ పాయింట్లు చొప్పున మరో రెండుసార్లు వడ్డీరేట్లు కుదింపు ఉం టుందని బొనాంజాపిఎంఎస్‌ఫండ్ మేనేజర్ యోగేష్ నగోంకార్ పేర్కొన్నారు. అరిహాంత్ కేపిటల్ పూర్తికాలపు డైరెక్టర్ అనితా గాంధీ ద్రవ్యోల్బణం మరింత దిగివస్తే ఆర్‌బిఐ రానున్నరోజుల్లో మరింతగా వడ్డీరేట్లను తగ్గిస్తుందని పేర్కొన్నారు.

లాభాలు / నష్టాలు

రూ.లలో రూ.లలో

కంపెనీ పేరు	ప్రస్తుత ధర రూ.లలో	మార్పు శాతం
అపోలోటైర్స్	277.30	4.21
హిండాల్కో	228.10	1.00
రిల్ఇన్‌ఫ్రా	531.45	0.96
కోరమండల్	450.75	0.96
టైటాన్	552.90	2.53
జిందాల్‌స్టీల్	158.15	2.20
ఎసిసి	1769.70	1.98
బయోకాన్	383.70	1.82
అంబుజాసిమెంట్స్	265.70	1.78
లూపిన్	1034.25	1.60
గ్రాసిమ్	1102.85	0.39

మార్కెట్ నష్టాలు (బిఎస్ఇ)

ఐడిఎఫ్‌సిబ్యాంకు	58.40	-1.43
ఎన్ఎండిసి	124.05	-1.35
టిసిఎస్	2467.35	-1.30
భెల్	141.35	-2.21
ఇన్ఫోసిస్	992.45	-1.25
సన్‌ఫార్మా	524.25	-1.95
ఇక్రా	3851.00	-1.95
డాక్టర్‌రెడ్డీస్	2379.85	-1.93
గెయిల్‌ఇండియా	369.20	-1.07
టాటామోటార్స్	439.50	-1.66
ఎల్అండ్‌టి	1176.55	-1.04

వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు) (Rs. Per Kg)

ఫామ్‌గేట్	(Farmgate)	67
డ్రెస్ట్	(Dressed)	81
విత్ స్కిన్	(with skin)	113
స్కిన్‌లెస్	(Skinless)	134

గుడ్ల ధరలు

Ph:040-23234068

నెక్ రేట్లు (3 - 8 - 2017) NECC RATES

వందకు, రూ.లలో Rs.per 100 eggs

హైదరాబాద్	310	Hyderabad
(రిటైల్ ధర రూ.3.70		(Retail Price Rs.3.70)
విజయవాడ	308	Vijayawada
గోదావరి	308	Godavari
విశాఖపట్నం	318	Visakha
వరంగల్	312	Warangal
చిత్తూరు	365	Chittoor
చెన్నై	372	Chennai
ముంబయి	360	Mumbai
న్యూఢిల్లీ	297	New Delhi
కోల్‌కతా	338	Kolkata
బెంగళూరు	360	Bangalore
నమక్కల్	360	Namakkal

బులియన్ ధరలు

	2 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29180	29170
22 క్యారెట్లు (10గ్రా)99.5	27300	27290
వెండి .999 (కేజి)	41252	41252
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29160	29160
22 క్యారెట్లు (10గ్రా)99.5	27280	27280
వెండి .999 (కేజి)	41239	41239
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	29180	29180
22 క్యారెట్లు	27300	27300
వెండి బార్ (కేజి)	41266	41266
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	29210	29210
22 క్యారెట్లు (10గ్రా)	27330	27330
వెండి (కేజి)	41258	41258
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29180	29180
22 క్యారెట్లు (10గ్రా)99.5	27300	27300
వెండి .999 (కేజి)	41252	41252
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	29180	29180
22 క్యారెట్లు	27300	27300
వెండి బార్ (కేజి)	40658	40658

ఆటోమొబైల్, రియాల్టీలపై 'రెపో' ప్రభావం

ముంబయి,ఆగస్టు 2: ఆర్‌బిఐ వడ్డీరేట్లను తగ్గించడంతో సంబంధిత రంగాల షేర్లు కొంతమేర దిగువకు దిగజారాయి. ఆటోమొబైల్స్, రియల్ఎస్టేట్, ఆర్థికరంగ కంపెనీలషేర్లు దిగువప్రాంతంలోనే ట్రేడింగ్ ముగించినట్లు అంచనా. ఆర్‌బిఐ తన మూడో ద్వైమాసిక పరపతి సమీక్షలో వడ్డీరేట్లను 25బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25నుంచి 6శాతానికి తెచ్చింది. నిఫ్టీ పిఎస్‌యుబ్యాంకు, నిఫ్టీప్రైవేటు బ్యాంకు సూచి 0.3శాతం చొప్పున క్షీణించాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ, నిఫ్టీ రియాల్టీ సూచీలు కూడా 0.4శాతం చొప్పున క్షీణించాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 50సూచి0.4శాతం క్షీణించింది. కేవలం పంజాబ్‌నేషనల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకులు మాత్రమే ప్రకాశించాయి. ఐడిఎఫ్‌సి బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, కెనరాబ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలు ప్రతికూలంగా కొనసాగాయి. ఇక ఆటోమొబైల్ రంగానికి సంబంధించి టాటామోటార్స్, మహీంద్ర, బజాజ్ ఆటో వంటివి రియాల్టీ రంగం నుంచి



యూనిటెక్, ఒబరాయ్ రియాల్టీ, గోద్రెజ్‌ప్రాపర్టీస్, శోభా రియాల్టీ సంస్థలు 1నుంచి 4శాతం వరకూ క్షీణించాయి. ఆర్థికవ్యవస్థపరంగా మానిటరీ పాలసీ కమిటీ అందరికీ పక్కాఇళ్లు నిర్మాణ పథకాలకు ఊతం ఇచ్చేవిధంగా వ్యవహరించింది. ఇన్‌ఫ్రాసమస్యలను పరిష్కరించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కు మరింత నిధుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. దీనివల్లరాష్ట్రాల్లో ప్రాజెక్టులు వేగవంతం అవుతాయి. ప్రభుత్వం, రిజర్వుబ్యాంకులు కూడా ఈ రంగాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కసర త్తులు చేస్తున్నాయి. అందువల్లనే సమస్యాత్మక కార్పొరేట్ రుణపరపతి పొందిన వారిపరంగా కొంత కఠినంగ ఆ వ్యవహరించినా ప్రభుత్వరంగ బ్యాంకులను మూలధనంపరంగా పునరుత్తేజం కలిగిం చాల్సిన అవసరం ఉంది. ఆర్థికలోటు లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ బ్యాంకులుండాలని అంచనా.

వడ్డీరేట్ల తగ్గింపు క్షేత్రస్థాయికి వెళ్లాలి

ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్

ముంబయి, ఆగస్టు 2: రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను సవరించినందున ఈ ప్రభావం క్షేత్రస్థాయికి వాణిజ్యబ్యాంకులు తీసుకెళ్లాల్సి ఉంటుందని ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్ వెల్లడించారు. ప్రతి సారి వడ్డీరేట్ల సవరణ జరిగిన తర్వాత వాణిజ్య బ్యాంకులు ఈవడ్డీరేట్లతగ్గింపు ప్రయోజనాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలేదు. ఎంపిసి సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డీరేట్లను ఏడేళ్ల దిగువకు తెచ్చినట్లు వెల్లడించారు. 25 బేసిస్ పాయింట్లు తగ్గించి ఆరుశాతానికి తెచ్చా మని వెల్లడించారు. వడ్డీరేట్లు ప్రకటించిన వెంట నే సెన్సెక్స్ 50పాయింట్లు దిగజారి 32,523 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 20 పాయింట్లు దిగ జారి 10,094పాయింట్లకు చేరింది. బ్యాంకింగ్ ఉపసూచి ఎన్ఎస్ఇలో నిలకడగా కొనసాగింది. గడచిన మూడునెలల్లో చమురు, ఆహార ఉత్ప త్తులు మినహా ద్రవ్యోల్బణంగణనీయంగా తగ్గిం దని గవర్నర్ వెల్లడించారు. ప్రస్తుతం చెలామణి లో ఉన్న కరెన్సీ తీరుతెన్నులు చూస్తే భవిష్యత్తులో అనిశ్చితులు, వివిధ రంగాల్లో నెలకొన్న అనిశ్చితి స్వీకరణకు మొగ్గుచూపించారు. దేశీయంగా ఉన్న మరింత సాధారణస్థితికి వస్తుందని ఆర్‌బిఐ వల్ల దిగజారాయని అందువల్లనే ఆయా దేశాల కంపెనీల వాటాలు దిగువస్థాయిలోనే ఉన్నాయి.



బ్యాంకులు ఉద్దీపనలు ప్రకటించినట్లుగా అంచనా. ప్రైవేటు పెట్టుబడులను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ గవర్నర్ వైరల్ ఆచార్య వెల్లడించారు. ద్రవ్యోల్బణం దిగిరావడం, జిఎస్‌టి అమలు, సాధా అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లు కూడా రాజకీయ రణ వర్షపాతం వంటివి రెపోరేట్లను తగ్గించేందుకు దోహదం చేసిందని గవర్నర్ వెల్లడించారు. గడచిన జూన్‌నెల తర్వాత అంతర్జాతీయగా ఆర్థికవ్యవస్థ వృద్ధిబాటలో ఉందని, అమె రికా రెండోత్రైమాసికంలో మరింతగా పెరి గిందని ఆర్‌బిఐ గవర్నర్ వెల్లడించారు. మధ్యకాలిక రిటైల్‌ద్రవ్యోల్బణం 4శాతంగా ఉంటుందని అన్నారు. భారత్ రూపాయి మారకం విలువలు రెండేళ్ల గరిష్టస్థాయికి చేరింది. 63.82 రూపాయలుగా డాలరు తో చెలామణి అయింది. మంగళవారం ఇదే మారకం విలువలు 64.07గా ఉన్నాయి. ఆర్‌బిఐ పాలసీ వివరాలు వెల్లడి అయిన తర్వాత ఇన్వెస్టర్లు కొన్నిరంగాల్లో లాభాల

రెపోరేట్ల ప్రభావం నిల్

నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబయి, ఆగస్టు 2: ఆర్‌బిఐ తన ద్వైమా సిక ద్రవ్యవిధాన సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించినా మార్కెట్లలో ఇన్వెస్టర్లు, ట్రేడర్లకు సంతృప్తికలించినట్లు లేదు. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ కూడా దిగువస్థాయిలోనే ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 98.43పాయింట్ల దిగువన 32,476.74 పాయింట్లవద్ద ముగిస్తే 59షేర్ ఎన్ఎస్ఇ సూచి నిఫ్టీ 33.15 పాయింట్లు దిగువన 10,081.50 పాయింట్లవద్ద ముగిసింది. ఇక బిఎస్ఇ విభాగ సూచీల్లో ఐటి సూచి 0.88శాతం కేపిటల్‌గూడ్స్ 0.83శాతం, ఎఫ్ఎంసి.ఇ 0.76శాతం, టెక్‌సూచీ 0.75శాతం చొప్పున దిగజారాయి. వినియోగరంగ ఉత్పత్తులసూచీ 1.12శాతం, విద్యుత్ 0.11శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో టాప్ ఐదు కంపెనీల్లో ఎన్‌టిపిసి 4.06శాతం, హీరోమోటో కార్ప్ 2.12శాతం, అదానిపోర్టులు 2.08శాతం, లూపిన్ 1.6శాతం, రిలయన్స్ 1.59శాతంచొప్పున పెరిగాయి. సన్‌ఫార్మా 1.95శాతం, డా.రెడ్డీస్ 1.93శాతం, టాటామోటార్స్ 1.66శాతం, కోటక్ బ్యాంకు 1.39శాతం, టిసిఎస్ 1.3శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇ బ్యాంకింగ్ సూచి స్వల్పంగా దిగువన ముగిసింది. 47పాయింట్ల దిగువన 28,356.31పాయింట్లకు దిగజారింది. ముందు రోజు బిఎస్ఇ పాయింట్లు 28,403పాయింట్లుగా ఉంది. టాప్ బ్యాంకర్ల షేర్లు స్వల్పంగా దిగజారా యి. ఎస్‌బిఐ 0.37శాతం దిగజారి 307.65



రూపాయల వద్ద కొనసాగితే ఐసిఐసిఐబ్యాంకు 301.60 పాయింట్ల వద్ద 0.2శాతం దిగజారింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1794.65 వద్ద నిలిచింది. సూచీలవారీగా చూస్తే మార్కెట్లు లాభాల స్వీక రణకు గురయ్యాయి. మిడ్‌క్యాప్ స్టాక్స్ ఎక్కువ ఒత్తిడికి లోనయినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రారంభంలో బిఎస్ఇ సూచి 111.31 పాయింట్లు పెరిగి 32,686.48 పాయింట్లకు చేరింది. ఇంట్రాడేలో 32,672.66 పాయింట్లవద్దకు చేరింది. 50షేర్ ఎన్ఎస్ఇ సూచీ నిఫ్టీ కూడా 23.20పాయింట్లు పెరిగి 10,137.85 పాయింట్లకు చేరింది. ఇంట్రాడేలో గరిష్ఠంగా 10,128.60పాయింట్లకు సైతం నమోదయింది. ఇక ఆసియా మార్కెట్లపరంగా టెక్నాలజీ షేర్లు 17ఏళ్ల గరిష్టస్థాయికి చేరాయి. యాపిల్ అంతర్జా తీయంగా విడిభాగాల తయారీ సంస్థలకు మంచి మద్దతునిచ్చింది. ఎంఎస్‌సిఐ టెక్‌సూచి ఆసియాలో 0.8శాతంపెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 40శాతం పెరిగాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు వరుసగా ఐదోరోజు కూడా రికార్డుస్థాయికి చేర్చింది. 22వేలమార్కును దాటింది. గోల్డ్‌మాన్‌శాక్స్, జెపి మోర్గాన్ ఛేజ్, ఇతర బ్యాంకులషేర్లకు మద్దతునిచ్చిం ది. యాపిల్ 0.89శాతం పెరిగింది. వాల్‌స్ట్రీట్ బెల్ తర్వాత ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ ఆర్థికఫలితా లపైఎక్కువ ఆసక్తిచూపింది. మార్కెట్‌నిపుణులు కంపె నీ రాబడులు ఐదుశాతం పెరుగుతాయని అంచనా.

59% క్షీణించిన లూపిన్ నికరలాభం

న్యూఢిల్లీ,ఆగస్టు 2: ఔషధ తయారీ సంస్థ లూపిన్ బుధ వారం తన నికరలాభాలు 59శాతం క్షీణించినట్లు వెల్లడిం చింది. మార్కెట్‌నిపుణుల అంచనాలకు అత్యంతదిగువన నికరలాభం వచ్చింది. అమెరికా ఎఫ్‌డిఎ ఆంక్షలు, ధరల ఒత్తిళ్లు వంటివి ఎక్కువ కారణాలుగా ఉన్నాయి. భారతీయ ఔషధ తయారీ సంస్థలు ఎక్కువగా ఎఫ్‌డిఎ ఆంక్షలు, హెచ్చరికలకు గురయ్యాయి. భారీస్థాయిలో ఉత్పత్తి కేంద్రా లున్న సంస్థలపై అమెరికా ఎఫ్‌డిఎ ఆంక్షల ప్రభావం ఎక్కువ ఉంది. వాస్తవానికి దేశీయ మందుల తయారీ



కంపెనీలకు అమెరికా మార్కెట్లే కీలకం కావడంతో ఎఫ్‌డిఎ హెచ్చరికలు కీలకప్రభావం చూపించాయి. నాణ్యతాప్రమాణాలు వంటి వాటిపై ఎఫ్‌డిఎ నిర్వహించిన ఇటీవలి తనిఖీల్లో హెచ్చరికలు ఎక్కువ చేయడంతో కంపెనీ షేర్లపై భారీ ప్రభావం కనిపించింది. ఇక మౌఖిక వినియోగంలో ఉన్న ఓరల్ కాంట్రసెప్టింవ్స్, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి వాటికి వినియోగం ఔషధాల అమ్మకాలు అమెరికా లో 27శాతం క్షీణించి 1602 కోట్లకు తగ్గాయి. దేశీయంగా కూడా అమ్మకాలు 1.8శాతం తగ్గి రూ.932 కోట్లుగా ఉన్నాయి. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.358 కోట్లకు చేరింది. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 882 కోట్లుగా ఉన్నది. మార్కెట్‌నిపుణులు అంచనాలప్రకారంచూస్తే లూపిన్ నికరలాభం రూ.479 కోట్లుగా ఉంటుందని వెల్లడించినా అంచనాలకు అనుగుణంగా లాభాలులేవు. కొన్ని ఉత్పత్తుల ధరలు అంచనాలకంటే తక్కువగా ఉండటం లూపిన్ జెనరిక్ మందులు వాస్తవంగా డయాబెటిస్‌కు వాడే మందులు అమ్మకాలు పడిపోవడం, దేశీయ విక్రయాలపై కూడా కొంత మాంద్యం నెలకొనడం వంటివి నికరలాభాలను దెబ్బతీసిందని సమాచారం. అంతేకాకుండా దేశవ్యాప్తంగా జిఎస్‌టి అమలు కూడా కొంత ప్రభావంచూపించిందని ఎండి నీలేష్ గుప్తా వెల్లడించారు.

సకాలంలో సరైన నిర్ణయం..

ఆర్‌బిఐ వడ్డీరేట్ల తగ్గింపుపై నిపుణుల అంచనా

హైదరాబాద్,ఆగస్టు 2: రిజర్వుబ్యాంకు తనమూడో ద్వైమాసిక ద్రవ్యవిధాన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించి సరైననిర్ణయం తీసుకుందని పలువురు కార్పొరేట్లు పేర్కొన్నారు. పెట్టుబడులు, పారిశ్రామిక రంగంనుంచి వడ్డీరేట్ల పెంపును స్వాగతిస్తూ పలువురు ఆర్‌బిఐ గవర్నర్‌ను అభినందించారు. సకాలంలో రెపోరేట్లను తగ్గించి ఆర్‌బిఐ మేలుచేసిందని డన్‌అండ్‌బ్రాడ్‌స్ట్రీట్ కీలక ఆర్థికవేత్త డా.అరుణ్‌సింగ్ వెల్లడించారు. అమెరికా ఫెడ్ రిజర్వు, యూరోపియన్ సెంట్రల్‌బ్యాంకులు తమ బాండ్లకొనుగోళ్లను విరమించేదిశగా వెళుతుండటంతో వడ్డీరేట్ల కోత నిర్ణయాలు భవిష్యత్తులో కష్టం అవుతాయని అంచనావేసారు. ద్రవ్యోల్బణం తగ్గుదల, పారిశ్రామిక పెట్టుబడుల ధోరణులు కూడా కొంత నీరసించినందున వడ్డీరేట్లకోతకు తావిచ్చిందని అన్నారు. జిఎస్‌టి అమలు కొంతప్రభావం చూపించిందని, ఏడో వేతన సంఘం హెచ్‌ఆర్ఎ రెండోవిడత ప్రకటన, రాష్ట్రాలు వేతన అలవెన్సుల అమలునుప్రారంభించడం వంటివి కొంత వడ్డీరేట్లకోతకు కీలకంగా పనిచేశాయని అరున్‌పూరీ అన్నారు.



మార్కెట్ నిపుణులు ఊహించిందే..!

మార్కెట్‌నిపుణులు వేసిన అంచనాలకు అనుగుణంగానే రిజర్వుబ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించిందని నైట్‌ఫ్రాంక్‌ఇండియా సిఎండి శిశిర్‌బైజాల్ వెల్లడించారు. భవిష్యత్తులోమరిన్ని వడీరేట్ల కోతలు కూడా అవసరం అవుతాయన్నారు. మంచి రుతుపవనాలు,ద్రవ్యోల్బణం తగ్గడం వంటివే రేట్ల తగ్గింపునకు దోహదం చేసాయని అన్నారు. వృద్ధికి అనుగుణంగా విధివిధానాలకు ఆర్‌బిఐ ప్రాధాన్యత నివ్వడం సంతోషకరమన్నారు. భారతీయ రియల్‌ఎస్టేట్ రంగంలో ఇకపై భారీ పెట్టుబడులు ఉంటాయన్నది ఆయన అభిప్రాయం.

స్వాగతించదగినదే..గౌరవ్‌షా

రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను తగ్గించి 6శాతానికి తీసుకురావడం స్వాగతించదగిన పరిణామమేనని రవిగ్రూప్ ఇండస్ట్రీస్ డైనరెక్టర్ గౌరవ్‌షా అన్నారు. ఈ చర్య అందరికీ పక్కాఇళ్ల పథకాలకు మంచి ఊతం ఇత్తయని, ఉపాధి కల్పనకు తోడ్పాటునిస్తుందన్నారు. సామాజిక మౌలికవనరులను వృద్ధికి ఈ రేట్లపెంపు దోహదం చేస్తుందని గౌరవ్‌షా అన్నారు. రియాల్టీరంగానికి ప్రభుత్వం మరింతప్రోత్సాహం అందించాలని ఆయన సూచించారు. వడ్డీరేట్లు తగ్గుతాయని ఏనాటినుంచో రియాల్టీ రంగం ఎదురు చూస్తున్నదన్నారు. సరైన సమయంలో వడ్డీరేట్లను తగ్గించి ఇళ్లకొనుగోళ్లను పెంచేందుకు పరోక్షంగా మద్దతిచ్చినట్లయిందని గౌరవ్‌షా వెల్లడించారు.

పెట్టుబడుల వృద్ధికి రెపోరేట్ల మద్దతు

కోయంబత్తూరు, ఆగస్టు 2: ఆర్‌బిఐ 25బేసిస్‌పాయింట్ల రెపోరేటుతగ్గింపు ఊహించిందేనని పెట్టుబడులవృద్ధికి దోహదం చేస్తుందని సిటీయూనియన్‌బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎన్.కామకోడి వెల్లడించారు. వడ్డీరేట్ల తగ్గింపుతర్వాత తమ బ్యాంకు వడ్డీరేట్లను తగ్గిస్తుందని కామకోడి అన్నారు. నిరంతరం బ్యాంకు వడ్డీరేట్లను సమీక్షిస్తుందని, ఈ నెలాఖరులోపు వడ్డీరేట్లపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు. వడ్డీరేట్లను లబ్దిదారులకు చేరువకావడం లేదన్న అంశంపై ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ 200 బేసిస్ పాయింట్లు తగ్గింపుజరిగిందని, బ్యాంకింగ్‌రంగం కేవలం 75నుంచి 100 బేసిస్ పాయింట్లుమాత్రమే క్షేత్రస్థాయికి తీసుకెళ్లిందన్నారు. స్థిరాస్తిప్రమాణాలపరంగా 50శాతం మాత్రమే పర్యవేక్షించగలుగుతున్నాయని, కొన్ని స్వల్పకాలిక అడ్డంకులు ఎదురవుతున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులపరంగా వేగవంతం కాలేదని వృద్ధిదశ పెట్టుబడుల రాక పెరిగిన వెంటనే దోహదం చేస్తుందని, మూడునుంచి నాలుగు త్రైమాసికాల్లో మరింత తగ్గింపు చూస్తాన్నారు.

పిఎన్‌బి లాభాల్లో 12% వృద్ధి

ముంబయి,ఆగస్టు 2: పంజాబ్‌నేషనల్ బ్యాంకు నికరలాభాల్లో 12శాతం వృద్ధిని నమోదు చేసిం ది. రానిబాకీల కేటాయింపులు తగ్గడంతో



అంచనాలకు అనుగుణంగా లేకపోయినా స్వల్పం గా పెరిగింది. నికరలాభం రూ.343కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాదిలో ఇదే కాలం లో 306 కోట్ల రూపాయలనుంచి పెరిగింది. మార్కెట్‌నిపుణులు రూ.404 కోట్ల రూపాయలు లాభంగా ఉంటుందని అంచనావేస్తే ఆమేరకు చేరుకోలేకపోయింది. నిరర్ధక ఆస్తులకు కేటాయిం పులు సుమారు 19శాతం తగ్గి 2560 కోట్లుగా ఉన్నాయి. బ్యాంకు స్థూల రానిబాకీలు మొత్తం అడ్వాన్సుల్లో 13.66శాతానికి చేరాయి. మార్చి చివరినాటికి 12.53శాతంగా ఉన్నాయి. అయితే గతఏడాది జూన్‌తో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. 13.75శాతంనుంచితగ్గినట్లు బ్యాంకు వెల్లడించింది.

రెపోరేట్ల తగ్గింపు మంచిదే

ఆర్థికశాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ, ఆగస్టు2: ఆర్‌బిఐ రెపోరేట్ల తగ్గింపును ఆర్థికశాఖ స్వాగతించింది. 25బేసిస్ పాయింట్లు తగ్గించడం ప్రస్తుత ఆర్థికవాతావరణంలో తప్పని సరి అని దీనివల్ల ఆర్థికవృద్ధి మరింత ఊతం ఇచ్చినట్లయిందని ద్రవ్యోల్బణం అనుకున్న లక్ష్యానికి చేరేందుకు దోహదంచేస్తుందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్రగార్గ్ వెల్ల డించారు. ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధి అంచనాల ఆధారంగానే వడ్డీరేట్లను తగ్గించిందని అన్నారు. ఆర్థిక శాఖప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ అంతకుముందు కొంత కల వరం వ్యక్తంచేసారు. అయితే వడ్డీరేట్ల తగ్గింపు స్వాగతించారు. జూన్‌నెల పాలసీ సమీక్షలో వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించిన ఆర్‌బిఐ నేడు అనుకున్నట్లుగానే వడ్డీరేట్లను తగ్గించిందన్నారు.

భారత్‌లో ఐదేళ్ల వృద్ధికి కస్టమర్లే కీలకం

గోడాడీ కస్టమర్ల వృద్ధికి ప్రత్యేక వ్యూహం

హైదరాబాద్, ఆగస్టు 2: భారత్‌లో ప్రవేశించి ఐదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా కొత తకస్టమర్లను రాబట్టుకునే కార్యచరణపైనా, రెన్యువల్స్ పైనా గోడాడీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. చిన, స్వతంత్ర వెంచర్లపరంగా ప్రపంచంలోనే అతిపెద్ద క్లౌడ్‌ఫ్లాట్ ఫామ్ అయిన గోడాడీ కస్టమర్ల కీలకపాత్రను నెమురువేసు కుంటూ ఐదోవార్షికోత్సవం నిర్వహించినట్లు గోడాడి ఉపాధ్యక్షు డు నిఖిల్ అరోరా వెల్లడించారు. కస్టమర్లు, తమ భాగస్వాములే మా విజయాలని నిరంతరం కొనసాగుతాయన్నారు. 17 మిలియన్లకుపైబడిన కస్టమర్లతో 71 మిలియన్లకుపైబడిన



డొమైన్‌నేమ్స్ నుతన నిర్వహణలో కొనసాగించిన గోడాడీ కస్టమర్లకు వృత్తిపెరమైన వెబ్‌సైట్ రూపొందించుకునేలా చేస్తుందన్నారు. గోడాడీ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ ఆండ్రూ లో ఎహ్‌కీ మాట్లాడుతూ భారత్‌లో గడచిన ఐదేళ్లుగా అందిస్తున్న మద్దతు స్ఫూర్తికి నిరంతరం కట్టుబడి ఉన్నామని అన్నారు భారత్‌లో చిన్నవ్యాపారాలసంఖ్య నానాటికీ పెరిగిపోతూనే ఉందని అంతర్జాతీయ విస్తరణకు భారత్ ఒక మూలస్తంభం లాంటిదని అన్నారు. 2012నుంచి గోడాడీ భారత్‌లో పటిష్టమైన నెట్‌వర్క్ ఏర్పాటుచేసింద,ఇ తమ వెంచర్సను ఆన్‌లైన్‌లో ఏర్పాటుచేసేందుకు వృద్ధిచెందేందుకువీలుగా చిన్నవ్యాపారులు వ్యవస్థాపకులకు అవసరమైన సమగ్ర ఉత్పత్తులసూట్‌ను అందిస్తున్నట్లు వివరించారు.

ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్స్‌లో 12శాతం వాటా

న్యూఢిల్లీ,ఆగస్టు 2: వీడియోకాన్ ఎడ్జ్ ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్స్ మార్కెట్‌లో 12శాతం వాటాను సాధిస్తుందని, ఈ రంగంలో మొత్తం మార్కెట్ రూ.1600 కోట్ల వరకూ ఉంటుం దని విడియోకాన్ ఎడ్జ్ ప్రకటించింది. 2020 నాటికి టాప్ మూడుసంస్థల్లో ఒకటిగా ఉంటుందని, రూ.195 కోట్ల రాబడులే లక్ష్యంగా పనిచేస్తుందని సంస్థ సిఇఒ బాలి వెల్లడించారు. ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్స్ విభాగం ఎటిపి, ఎస్ఎంఎస్, ఒబిడి, ఐవిఆర్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్, మిస్డ్‌కాల్, షార్ట్ లాంగ్‌కోడ్ సొల్యూ షన్స్‌తో సహా ఇతర క్లౌడ్ ఆధారిత సొల్యూషన్స్‌తో ఉంటుందని, బిఎఫ్ఎస్ఐ, ఇకామర్స్, రిటైల్ మీడియా పర్యాటకరంగం, వెల్‌నెస్, ఎడ్యుకేషనల్ ప్రభుత్వరంగం వంటి వాటిలో కస్టమర్లకు మరింత నెట్‌వర్క్ అందించనున్నట్లు వీడియోకాన్ టెలికాం సిఇఒ బాలి వెల్లడించారు. మార్కెట్‌పరిమాణంలో 82 శాతంగా అంటే సుమారు 14 వేల కోట్ల విలువతో విస్తరిస్తామన్నారు. రానున్నకొన్నేళ్లలోనే మార్కెట్ రెండింతలు కాగలదని అంచనా. అందుకు సహేతుకమైనకారణాలున్నాయన్నారు. 1.1బిలియన్ మొబైల్ చందాదారులతో ప్రస్తుతంఎటుపి మార్కెట్,ఎస్ఎంఎస్ పరిమాణం సుమారు 180బిలియన్ ఎస్ఎంఎస్ లుగా ఉంటుందని, ఒక్కొక్క చందాదారుడు నెలకు 13.5ఎటుపి ఎస్ఎంఎస్‌లు పంపిస్తారని అంచనావేసింది.

డెన్‌నెట్‌వర్క్‌కు పెరిగిన రాబడులు

హైదరాబాద్,ఆగస్టు 2: డెన్‌నెట్‌వర్క్స్ తన తొలిత్రైమాసిక ఫలితాల్లో నిర్వహణ లాభాలను రూ.35 కోట్లకు పెంచు కోగలిగింది. సంఘటిత నిర్వహణ లాభం 50 కోట్లనుంచి 85 కోట్లకు పెరిగింది. నిర్వహణలాభాలపరంగా భారీ వృద్ధిని సాధించింది. సంఘటిత నిర్వహణ లాభాలు ఆరు కోట్లనుంచి 35 కోట్లకు గతనాలుగోత్రైమాసికంలో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. కేబుల్ విభాగంలో పన్నులచెల్లింఉలకుముందు లాభాలు 15కోట్లనుంచి 25కోట్లకు పెరిగిందని వెల్లడించింది.

నితీష్ పదవికి శరద్ యాదవ్ ఎసరు?

జెడియులో చీలిక తథ్యం - కొత్త పార్టీ కోసం ఏర్పాట్లు
తన వెనుక రావాలంటూ అనుచరులకు సంకేతాలు
ఆయన వెళ్లినా ప్రభుత్వానికి ఢోకాలేదన్న నితీష్ వర్గం
నష్టనివారణకు బిజెపి, జెడియు సీనియర్ల మంతనాలు



పాట్నా,ఆగష్టు 2 : మహాకూటమికి గుడ్‌బై చెప్పి తన పదవికి రాజీనామా చేసి, బిజెపి అండతో తిరిగి బిహార్ సిఎంగా పగ్గాలందుకున్న జనతాదళ్-యు అధినేత నితీష్‌కుమార్‌కు భారీ షాక్ తగల బోతోందా? అంటే అవునే అంటున్నాయి బీహార్ రాజకీయ వర్గాలు. నితీష్ బిజెపి వైపు మరలటాన్ని జీర్ణించుకోలేక పోతున్న పార్టీ సీనియర్ నేత, ఎంపి శరద్ యాదవ్ పార్టీ నుంచి బైట పడేందుకు మార్గాలను సుగమం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే శరద్ యాదవ్ మాతోనే ఉన్నారంటూ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఆర్జేడీలో చేరబోతున్నట్లు కథనాలు వచ్చాయి. అయితే తాజాగా నితీష్‌పై కాకుండా కేవలం బిజెపి పైనా, ప్రధాని మోడీ పైన దృష్టి సారించి వరుస ఆరోపణలు గుప్పించిన విషయం విదితమే. ఈ క్రమంలో జెడియుకి గుడ్‌బై చెప్పి సొంత పార్టీ పెట్టుకునేందుకు యోచన చేస్తున్నట్లు తెలియ వచ్చింది. శరద్ యాదవ్ సన్నిహితుడైన విజయ్ వర్మ ఈ మేరకు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, సామాజిక మీడియాలో శరద్ యాదవ్ కొత్త పార్టీ పెడుతున్నట్లు వస్తున్న కథనాలు కొట్టి పారేయలేమన్నారు. భావసారూప్యం కల పార్టీలన్నింటితోనూ సమీక్షిస్తున్నామని, కొత్త పార్టీ ప్రకటన మరి వారం రోజులలో వెలువడే అవకాశాలున్నట్లు చెప్పారు. నితీష్ కుమార్ ప్రజల తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, మతతత్వ శక్తుల్తో ఆయన చేతులు కలపటం సహించలేక పోతున్నట్లు శరద్‌యాదవ్ సన్నిహితుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు రానున్న 2019 ఎన్నికల నాటికి ప్రధాని మోడీని ఓడించగల సత్తా ఏ పార్టీకీ లేదంటూ ప్రకటించడం పట్ల మండిపడినట్లు తెలుస్తోంది. మరోవైపు శరద్ యాదవ్ పార్టీ నుంచి వైదొలిగి కొత్త పార్టీ పెట్టుకుంటామంటే తమకు అభ్యంతరం లేదని జెడియు ప్రతినిధి సంజయ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆయనకు ఏ నిర్ణయమైనా తీసుకునే స్వేచ్ఛ ఉందని, ఆ నిర్ణయాలను తాము ఆపబోమని స్పష్టం చేయటం గమనార్హం. దీంతో జెడియు నుంచి శరద్‌యాదవ్ మరి రెండు మూడు రోజులలో వైదొలగి కొత్త పార్టీ ఏర్పాటు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పార్టీ వర్గాలు కూడా భావిస్తున్నాయి. శరద్ యాదవ్ పార్టీ నుంచి వైదొలగిన ఆయన వెంట పెద్ద ఎత్తున శాసనసభ్యులు వెళ్లే ఆస్కారం లేదని, ఒక వేళ ప్రభుత్వం మైనార్టీలో పడితే ఏం చేయాలన్నదానిపైనా బిజెపి- జెడియు సీనియర్లు సమాలోచనలు చేస్తున్నట్లు తెలియ వచ్చింది.

ఉపరాష్ట్రపతికి స్పీకర్ వీడ్కోలు విందు



బుధవారం లోక్‌సభలో ఉపరాష్ట్రపతి పదవీ విరమణ సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక విందులో అన్సారీ దంపతులను సన్మానిస్తున్న ప్రధాని మోడీ, స్పీకర్ సుమిత్రామహాజన్

న్యూఢిల్లీ, ఆగష్టు 2 : భారత 12వ ఉపరాష్ట్రపతి మహ్మద్‌అన్సారీ పదవీ విరమణని పురస్కరించుకుని బుధవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రత్యేక విందు ఇచ్చారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ పక్షాల నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి అన్సారీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ప్రధాని రెండు సార్లు ఈ దేశానికి ఉపాధ్యక్షుడిగా సేవలందించే అదృష్టం సర్వేపల్లిరాధాకృష్ణన్ తరువాత దక్కిన వ్యక్తి మీరే అంటూ ప్రసంసలు కురిపించారు. రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ అన్సారీ సంపూర్ణ ఆరోగ్యంతో ఆయురారోగ్యాలతో చిరకాలంజీవించాలని కోరారు. ఈసందర్భంగా స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్సారీ దంపతులను ప్రత్యేక చిత్రపటంతో అందజేసారు.

పార్టీల 'సమాచారం'పై ప్రత్యేక బెంచ్ విచారణ

ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో కదిలిన కేంద్ర సమాచార హక్కు కమిషన్
రాజకీయ పార్టీలపై అందిన ఫిర్యాదులపై ఆగష్టు 16 నుంచి విచారణలు
కాంగ్రెస్, బిజెపి సహా ఆరు రాజకీయ పార్టీల నేతలకు నోటీసులు



న్యూఢిల్లీ, ఆగష్టు 2 : సమాచార హక్కు పరిధిలోనికి రాబోమంటున్న రాజకీయ పార్టీల వ్యవహారాన్ని తేల్చేందుకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర సమాచార హక్కు కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్ మాధూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. 2016 జూలై 22 నుంచి సుమారు 5 నెలల పాటు రాజకీయ పార్టీలు ప్రభుత్వం నుంచి వివిధ రూపాలలో నిధులు, ఆస్తులు పొందుతున్నందున సెక్షన్ 2 పరిధిలో సమాచార హక్కు చట్ట పరిధిలోనికి రావాల్సిందేనని, అన్ని పార్టీలు తమ కార్యాలయాలలో సమాచారం అందించేందుకు ప్రజా సమాచార అధికారులను నియమించుకుని ప్రజలు కోరిన సమాచారం అందించాలంటూ ముగ్గురు స.హ. కమినర్ల మండలి ఆదేశాలు జారీ చేసింది. అయితే కేంద్ర సమాచార హక్కు చట్ట కమిషన్ జారీ చేసిన ఆదేశాలను తామంగీకరించబోమంటూ కాంగ్రెస్, బిజెపి, కమ్యూనిస్టులతో సహా పలు పార్టీలు ప్రకటనలు గుప్పించాయి. దీనిపై ఢిల్లీ హైకోర్టు సైతం స్పష్టమైన ఆదేశాలు జార చేసిన నేప ధ్యంలో ఈ కేసుకు తోడుగా రాజకీయ పార్టీలపై సిపిసిలో దాఖలైన కేసులను విచారించాలని నిర్ణయించింది. గతంలో ఆదేశాలు జారీ చేసిన బెంచ్‌లోని కేవలం కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు మినహా మిగిలిన వారికి చోటు పొందక పోవటం విశేషం.

తాజా బెంచ్‌లో సమాచార కమిషనర్లు మంజుల ప్రసార్, దివ్య ప్రకాశ్ సిన్హా, శరత్ సబర్వాల్ ఉన్నారు. ఆగష్టు 16 నుంచి విచారణ ప్రారంభమయ్యేలా నోటీసులు జారీ చేసినట్లు కమిషన్ వెల్లడించింది. కాగా సమాచార హక్కు కమిషన్ నుంచి నోటీసులు అందుకున్న వారిలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, బహుజన్ సమాజ్‌వాది పార్టీ అధినేత్రి మాయావతి, నేషనలిస్ట్ సోషలిస్టు పార్టీ అధ్యక్షులు శరత్ పవర్, బిజెపి జాతీయఅధ్యక్షుడుగా వ్యవహరించిన ప్రస్తుత కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిపిఐ నుంచి సుధాకర్ రెడ్డి, సిపిఎం నుంచి ప్రకాష్ కారత్‌లు ఉన్నారు. సమాచార హక్కు కార్యకర్త ఆర్‌కె జైన్ వివిధ రాజకీయ పార్టీలకు సెక్షన్ 6(1) పరిధిలో సమాచారం కొరకు దరఖాస్తు పంపిస్తూ, పార్టీల నిధులు, అనుసరిస్తున్న విధివిధానాలు, పార్టీ రాజ్యాంగం, ఎన్నికల వివరాలు కోరారు. అయితే వీటిపై పార్టీలు చట్టం నిర్దేశించిన 7(9) పరిధిలో 30 రోజులలోగా స్పందించి, సమాచారం అందివ్వక పోవటంతో సెక్షన్ 18(1) ప్రకారం కేంద్ర సమాచార హక్కు కమిషన్‌కు ఫిర్యాదు దాఖలుచేసారు. ఈఫిర్యాదును పలుపర్యా యాలు విచారణ జరి పిన సమాచార హక్కు కమిషనర్ మాడభూషి శ్రీధర్ నేతృత్వంలోని కమిషన్ పూర్తి బెంచ్ 2016 జూన్ 3వ తేదీన తమ తీర్పును వెలువరిస్తూ, రాజకీయ పార్టీలు ప్రభుత్వం నుంచి భవన నిర్మాణాలకు భూములు, వివిధ రూపాలలో ప్రజాధనం సేకరించుకుంటున్న దృష్ట్యా, పలు ప్రజా ప్రయోజనాల మేరకు సమాచార హక్కు చట్ట పరిధిలో రాజకీయ పార్టీలు పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు రజకయ పార్టీలు కనీసం కోర్టులో సవాలు చేయలేదు సరి కదా కమిషన్ ఆదేశాలు పార్టీలు బేఖాతరు చేయటంతో పాటు సమాచార ఇచ్చేందుకు నిరాకరించాయి. దీంతో జైన్ ఢిల్లీ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసారు. ఈ పిటీషన్ విచారించిన ఢిల్లీ హైకోర్టు, 6నెలల్లోగా విచారణ పూర్తి చేసి సమాచారం ఇప్పించాలంటూ కేంద్ర సమాచార కమిషన్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో స.హ కార్యకర్తలు సుభాష్ అగర్వాల్, బిహైలాల్ తవాయిత్, పవన్‌కుమార్ పాహ్వా, వికాష్ కోత్వాల్, వినోద్ కుమార్ మిశ్రా, ముల్కిత్ సింగ్ బాజ్వా, పిసి శర్మ, ముఈబ్ ఉల్లా, దీపక్ సేథీ, రామేశ్వర్ శర్మ, అనిల్ కుమార్ సిన్హా, శాంతి రామ్ అసీమ్ తకార్, సంజయ్ శర్మలు దాఖలు చేసిన ఫిర్యాదులు, రెండో అప్పీళ్లను విచారించేందుకు కేంద్ర సమాచార కమిషన్ సిద్ధమైంది. ఈమేరకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీతో సహా ఆరు రాజకీయ పార్టీల నేతలకు విచారణలకు హాజరు కావాలని నోటీసులు పంపింది.

సేంద్రీయ సాగుకు ప్రోత్సాహం

ఎపిఇడిఎ బృందంతో వ్యవసాయ కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సేంద్రీయ సాగును ప్రోత్సహించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. సేంద్రీయ ధృవీకరణకై ఎపిఇడిఎ ఇచ్చే అనుమతి నిమి త్తమై ముగ్గురు సభ్యుల బృందం బుధవారం హైదరాబాద్‌లోని హాకా భవన్‌లోని తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థను సందర్శించి వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారథితో ఎపిఇడిఎ బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నాణ్యమైన విత్తనోత్పత్తి, సేంద్రీయసాగుకు అనుకూలమని, పురుగు మందుల అవశేషాల మూలంగా పలు దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు సైతం తలెత్తుతున్నాయన తెలిపారు. మోతాదు మించి రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం క్షీణించి నిర్జీవంతో దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు పెరగడంతో రైతులకు సాగు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా సేంద్రీయ వ్యవసాయ పద్దతులు, శాస్త్రీయ, సాంకేతికత సమ్మేళనంతో తిరిగి అమలులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సేంద్రీయ ఉత్పత్తులకు ఆదరణ పెరగడంతో రాష్ట్రంలో సాగు పెరగుతుందని వివ రించారు. సిక్కింలో జరిగిన ఆర్గానిక్ ఫెస్టివల్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తున్నారని దీనిని ఉత్తరాఖండ్, కేరళ, కర్ణాట రాష్ట్రాలు ప్రవేశౌఎట్టాయని, ఈ విధానాన్ని త్వరలో తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. వీటి విధివిధానాలను రూపొందించేందుకు కమిటీని కూడా వేసినట్లు చెప్పారు. టిఎస్ఎస్ఒసిఎను సేంద్రీయ ధృవీకరణ చేసేందుకు కేంద్రం పాంతీయ కౌన్సిల్‌గా గుర్తించిందన్నారు. ఎపిఇడిఎ సంస్థచే గుర్తింపు త్వరలో రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే సేంద్రీయ రైతులు, సేంద్రియ ఉత్పత్తుల తయారీదారులు నుండి 50కు పైగా దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు. ఎపిఇడిఎ గుర్తింపు రాగానే సేంద్రియ ధృవీకరణను మరింత వేగవంతం చేయనున్నట్లు వ్యవసాయ కార్యదర్శి పార్థసారథి ఎపిఇడిఎ బృందం సభ్యులకు వివరించారు.

ముఖేష్‌పై ఒత్తిడి ప్రయత్నమేమో?
దానం అనుమానం

హైదరాబాద్,ఆగస్ట్ 2,ప్రభాతవార్త: మాజీమంత్రి ముఖేష్ గౌడ్‌పై ఒత్తిడి తెచ్చేందుకు విక్రమ్ గౌడ్‌పై హత్యాయత్నం కేసును ఆత్మహత్యాయత్నంగా చిత్రీకరిస్తున్నారన్న అనుమానాన్ని మాజీ మంత్రి దానం నాగేందర్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ , వాంగ్మూలమిచ్చిన సమయంలో విక్రం గౌడ్ ఏం చెప్పాడో పోలీసులు ఎందుకు బయటపెట్టలేదని అడిగారు. ఆరు నెలలనుంచి తనపై కాల్పులు జరిపేందుకు స్కెచ్ గీశాడని చెబుతున్న పోలీసులు, ముందే ఎందుకు హెచ్చరించలేదని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పరమైన ఒత్తిడి పెంచేందుకు ఇలాంటి ఘటనలు వాడుకుంటున్నారేమేనన్న అనుమానం రాకూడదని ఆయన సూచించారు. విచారణలో అన్ని విషయాలు వెలుగు చూస్తాయని, తమ అనుమానాలు తమకు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు అడ్డం పెట్టుకుని లొంగదీసుకుందామని ప్రయత్నిస్తే అంతకంటే అమాయకత్వం మరొకటి ఉండదని ఆయన తెలిపారు.

కన్నడ మంత్రి ఇంట రూ॥ 7.5 కోట్ల నగదు స్వాధీనం

మంత్రి శివకుమార్‌కు చెందిన 36 చోట్ల ఐటి దాడులు - బెంగళూరులో గుజరాత్ ఎమ్మెల్యేల బాగోగులు చూస్తున్న మంత్రి
రిసార్ట్ నుంచి తరలింపు - పన్ను చెల్లించని సొమ్మెక్కడిదని ప్రశ్నల వర్షం - దాడులపై కాంగ్రెస్ ఆగ్రహం - రాజ్యసభలో గందర గోళం





న్యూఢిల్లీ, ఆగష్టు 2 : కర్ణాటక మంత్రి డికె శివకుమార్ ఇంటిపై, కార్యాలయాలపై ఆదాయపు పన్నుశాఖ వరుస దాడులు నిర్వహించి 7.5 కోట్ల రూపాయాలు స్వాధీనం చేసుకుంది. బుధవారం మంత్రి శివకుమార్‌కు సంబంధించిన 39 ప్రాంతాలలో ఏకకాలంలో దాడులు జరిగాయి. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల దృష్ట్యా ఆ రాష్ట్ర శాసన సభ్యులందరినీ కర్ణాటక తరలించగా, ఆఎమ్మెల్యేల సంరక్షణ, బాధ్యతల్ని శివకుమార్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శాసనసభ్యులను రిసార్ట్సులలో ఉంచి పెద్దఎత్తున్న ఖర్చులు చేస్తున్నారని, ఎమ్మెల్యేలకు భారీగానగదుఅందిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన ఐటి అధికారులు మంత్రి నివాసంపై దాడి చేసారు. అలాగే ఇదే సమయంలో దేశరాజధాని డిల్లీతో పాటు కర్ణాటకలో వివిధ ప్రాంతాలలోఉన్న ఆస్తులపైనా దాడులునిర్వహించామని ఐటి అధికారులు చెప్పారు. ఢిల్లీలో ఆతని ఇంటి నుంచి రూ.5 కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకోగా, బెంగళూరులోని ఇంటి నుంచి మరి రెండున్నర కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరిం చారు. పన్ను ఎగవేత వ్యవహారానికి సంబంధించిన కేసు నేపథ్యంలోనే ఈ దాడులు నిర్వహించినట్లు ఐటి అధికారులు మీడియాకు వివరించారు. కాగా గుజరాత్ శాసన సభ్యుల విడిదిగా ఉన్న ఈగల్ టన్ రిసార్టుపై దాడి చేసినట్లు వచ్చిన కథనాలను కొట్టి పారేస్తూ, తమకందిన సమాచారం మేరకు ఈ దాడి చేసామని, రిసార్టుపై దాడి చేసినట్లు కథనాలు వాస్తవం కాదని స్పష్టం చేసారు.

అవును దాడులు వాస్తవమే.. : జైట్లి

కర్ణాటక మంత్రి ఇంట్లో పన్ను చెల్లించని నగదు భారీగా ఉన్నట్లు స్పష్టమైన సమాచారం రావటంతోనే ఐటి శాఖ దాడులు నిర్వహించిందని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లి స్పష్టం చేసారు. బుధవారం ఈ మేరకు రాజ్య సభ జీరో అవర్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎంపి కపిల్ సిబాల్ ఈ అంశాన్ని లేవనెత్తారు, రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్ శాసనసభ్యులను బెదిరించి తమ వైపుకు తిప్పుకునేందుకు బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. అంతకు ముందు కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ ఆనంద్ శర్మ, గులాంనబి ఆజాద్ సైతం శివకుమార్‌పై ఐటిదాడుల అంశాన్ని సభ దృష్టికి తీసుకువస్తూ, బిజెపి ప్రభుత్వ సంస్థలను తన స్వీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు పదే పదే సభా కార్యక్రమాలను అడ్డుకోవటం, సభ పలు మార్లు వాయిదా పడటంపై జైట్లి మండిపడుతూ, కాంగ్రెస్ సభ్యులున్న రిసార్టులలో ఎలాంటి తనిఖీలు ఐటి సిబ్బంది నిర్వహించలేదని, పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు అందుకు సంబంధించిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు మాత్రమే వెళ్లారని, ఆపై కర్ణాటక రాష్ట్ర మంత్రిని ఆతని ఇంటికి తీసుకువెళ్లి ప్రశ్నించినట్లు మంత్రి తేల్చి చెప్పారు.

బిజెపీ భయపెడుతోంది... :సిఎం సిద్ధరామయ్య

ఉద్దేశ పూర్వకంగానే తమ మంత్రులను ఇబ్బందులు పెట్టేందుకు కేంద్ర ఐటి దాడులు చేయిస్తోందని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య బెంగళూరులో ఆరోపించారు. భారతీయ జనతాపార్టీ దేశవ్యాప్తంగా విస్తరించాలన్న కాంక్షతో ఆ పార్టీ నేతలు ఏం చేస్తున్నారో అర్థం కావటంలేదని, నేతల్ని భయపెట్టి తనవైపుకు తీసుకుంటోందన్నారు.

త్వరలో కాకతీయ ఫుడ్స్
నాణ్యమైన సరుకులు అందించడమే లక్ష్యం
సిఫ్‌టిఆర్ డైరక్టర్‌తో వ్యవసాయ శాఖ కమిషనర్ వెల్లడి



హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కల్తీ లేని, నాణ్యమైన ఉత్పత్తులను అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారథి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పండించే పంట ఉత్పత్తులను కాకతీయ ఫుడ్స్ పేరుతో మార్కెట్ చేయాలని, సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్ విషయమై సిఫ్‌టిఆర్ఐ డైరక్టర్ డాక్టర్ రామ్ రాజశేఖర్ బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి, ఈ భేటీలో ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మైసూరులోని కేంద్రీయ ఆహార సాంకేతిక, పరిశోధనా సంస్థ సాంకేతిక సహకారంతో నాణ్యమైన పసుపు, కారం పొడులు, అల్లం వెల్లుల్లి మిశ్రమం తదితర వాటిని తయారుచేసి నేరుగా వినియోగదారులకు అందించేందుకు కుత్బుల్లాపూర్ మండలం దూలపల్లిలో ఉద్యాన, సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇందుకు సిఎఫ్‌టిఆర్ఐతో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జూన్‌లో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుందని చెప్పారు. దీని ప్రకారం సిఎఫ్‌టిఆర్ఐ అందించే సాంకేతిక సహకారంతో డిపిఆర్‌ను తయారు చేయడం, పసుపు, కారం పొడి, చింతపండు గుజ్జు తదితర వాటిని తయారు చేసేందుకు అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, టెండర్ల ప్రక్రియ, ఉత్పత్తి, నాణ్యతపై సాంకేతిక శిక్షణ, యూనిట్ ఏర్పాటు, మార్కెట్‌లో ఉత్పత్తులు అమ్మకం వరకూ అవసరమైన సహాయ సహకారాలను నిరంతరం అందించనుందని పార్థసారథి వెల్లడించారు. కాగా ఈనెలాఖరులో డిపిఆర్ తయారుచేసి ఇవ్వడమే కాకుండా ఉద్యాన శాఖ ఈనెల 27 నుండి నిర్వహిస్తున్న ఉద్యాన మహోత్సవంలో పాల్గొననున్నట్లు డైరక్టర్ రాజశేఖర్ తెలిపారు. రైతుల ప్రయోజనాలకై సిఫ్‌టిఆర్ఐ అభివృద్ధి పరచిన నూతన సాంకేతిక పద్ధతులను ఇందులో ప్రదర్శించనున్నట్లు ఆయన చెప్పారు.

విస్తరిస్తున్న వడ్డీ రహిత రుణాలు
అధిక వడ్డీల నుండి చిరువ్యాపారులకు ఊరట

హైదరాబాద్, ఆగష్టు 2, ప్రభాతవార్త : అధిక వడ్డీలతో వడ్డీ వ్యాపారుల చేతిలో నలిగిపోతున్న చిరువ్యాపారులకు ఊరట కల్పించేలా వడ్డీ రహిత బ్యాంకింగ్ విధానం తెలంగాణ రాష్ట్రంలో విస్తరిస్తోంది. స్వయం ఉపాధి కోసం నిరుద్యోగులు, వ్యాపారల్లో పెట్టుబడి కోసం చిరువ్యాపారులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడడం పరిపాటే. బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి వారికి రుణాలు లభించడం అంత సులభం కాదు. చెప్పులరిగేలా బ్యాంకుల చుట్టూ తిరిగినా ఏ కొద్ది మందికి తప ్ప సహజంగా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావు, ఇక ప్రభుత్వ సబ్సిడీ రుణాలు లభించడం కూడ పరిమితంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరువ్యాపారులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి, వ్యాపారం నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రవేటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ తరుణంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలతో వేధించడం పరిపాటిగా మారింది. ఈ తరుణంలో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇస్లామిక్ బ్యాంకింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభించిన సహకార క్రెడిట్ సొసైటీలు విస్తరిస్తూ పోతున్నాయి. ఇస్లామిక్ బ్యాంకింగ్‌లో వడ్డీ రహిత లావాదేవీలు ఉంటాయి. ఈ విధానం ఇలాంటి చిరువ్యాపారులకు ఎంతగానో ఊరట నిస్తోంది. 2012లో సంగారెడ్డిలో రిజిస్టర్ అయిన మ్యుచ్‌వల్లి ఎయిడెడ్ కొ ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీస్ (ఎంఎసిసిఎస్) వేలాది మంది చిరు వ్యాపారులకు వడ్డీ రహిత రుణాలు ఇవ్వడం ద్వారా వడ్డీ వ్యాపారుల కబంద హస్తాల నుండి విముక్తి కల్పించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 బ్రాంచీలు కలిగి ఉన్న ఈ సొసైటీస్‌లో 7 వేలకు పైగా సభ్యత్వం కలిగి ఉన్నారు. తెలంగాణ జిల్లాల్లోనే గాకుండా హైదరాబాద్ కేంద్రంగా ఈ క్రెడిట్ సొసైటీ గుంటూరులోనూ తమ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, కోరుట్లలోనూ త్వరలోనే బ్రాంచీల ఏర్పాటుకు సనా ్నహాలు జరుగుతున్నాయి. వరంగల్‌లో గత జనవరిలో కొత్తగా ప్రారంభమైన ఈ శాఖ ద్వారా 80 లక్షల మేరకు రుణాలు ఇచ్చారు. ప్రతి నెల సభ్యత్వం పెరుగుతూపోతోందని సొసైటీ ఆపరేషన్ మేనేజర్ వెల్లడించారు. ఈ సొసైటీల్లో డిపాజిట్లు, సేవింగ్ డిపాజిట్లు స్వీకరిస్తారు. చిరువ్యాపారులకు రూ.5 వేల నుండి రూ.50 వేలవరకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఇందుకు గాను బ్యాంకు వడ్డీ తీసుకోదు. కేవలం సర్వీస్ చార్జీలను మాత్రం వసూలు చేస్తారు. ఇస్లామిక్ బ్యాంకింగ్ కాన్సెప్ట్‌లో వడ్డి రహిత లావాదేవీలు నిర్వహించడం జరుగుతుంది. అంటే వడ్డీ ఇవ్వడం కాని తీసుకోవడం కాని నిషిద్ధం. కేవలం సర్వీస్ చార్జీలను తీసుకోవడం ద్వారా వీరు తమ కార్యాకలాపాలు నిర్వహిస్తుంటారు. గృహపయోగ వస్తువులకు కూడా వీరు రుణాలు ఇస్తారు. 10 నెలల్లో తిరిగి చెల్లించే షరతులపై ఇలాంటి వాటికి రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ విధానం వల్ల చాలామంది చిరువ్యాపారులు వడ్డీవ్యాపారుల చెర నుండి బయపడి ఈ సొసైటీల్లో వడ్డీ రహిత రుణాలు పొందుతున్నారు. నామమాత్రమపు సర్వీస్ చార్జీలతో రుణాలు పొందడం వల్ల వడ్డీ వ్యాపారలను ఆశ్రయించే వారు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు.

హాజ్‌యాత్రీకుల భద్రతకు ఇ-బ్రాస్‌లెట్స్
భారత్‌ముస్లింలకు ప్రత్యేక సౌకర్యం

హైదరాబాద్, ఆగష్టు 2, ప్రభాతవార్త : హజ్ యాత్రీకులకు భద్రత, మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశలో హజ్ కమిటి పలు ఏర్పాట్లు చేస్తోంది. హజ్ సందర్భంగా ప్రపంచ దేశాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చే హజ్ యాత్రీకులు లక్షలాది మందిలో దారి తెలియక తప్పిపోవడం సర్వసాధారణంగా జరుగుతుంది. భారత యాత్రీకులకు అరబిక్ భాష తెలియక పోవడం, ఆక్కడి ప్రజలకు ఇక్కడి భాషలు తెలియక భాష ప్రధాన అవరోధంగా మారుతుంది. హజ్ యాత్రకు మన దేశం నుండి వెళ్లిన యాత్రీకులు దాదాపు నెల రోజులు సౌదీ అరేబియాలో గడుపుతారు. ఈ సందర్భంగా భాష తెలియని కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటుంటారు. ప్రధానంగా తప్పిపోవడం, రోజుల తరబడి ఆచుకి తెలుసుకోక పోవడం జరుగుతుంది. ఈ దృష్ట్యా భారత హజ్ కమిటి ఈ సారి ఇ-బ్రాస్‌లెట్ విధానాన్ని ప్రవేశ పెట్టబోతోంది. జిపిఎస్ ట్రాకింగ్ పరికరాన్ని కలిగి ఉన్న బ్రాస్‌లెట్లను హజ్ యాత్రీకులకు ఇవ్వడం జరుగుతుంది. దీనిని ధరించడం వల్ల యాత్రీకులు తప్పిపోయినా ట్రాక్ చేసే అవకాశం ఉంటుంది. ఈ టెక్నాలజీ కారణంగా యాత్రీకులను సులువుగా గుర్తించడానికి సులభతరం అవుతుంది. కొత్త దేశంలో, భాష తెలియని ప్రాంతంలో యాత్రీకులను గుర్తించడంలో ఈ పరికరం ఎంతగానో సహకరిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇదివరకు ప్రతి యాత్రీకుడికి సాధారణ బ్రాస్‌లెట్ ఇవ్వడం జరుగుతూ ఉండేది. ఈ బ్రాస్‌లెట్‌పై కవర్ నంబర్క, పేరు, రాష్ట్రం, దేశం తదితర వివరాలు ఉంటాయి. గుర్తింపు కార్డు పోయినా బ్రాస్‌లైట్ ఆధారంగా అతను ఎక్కడి వాడనేది గుర్తించే వీలు ఉంటుంది. ప్రతి సంవత్సరం హజ్‌కు ప్రపంచ దేశాల నుండి లక్షలాది మంది యాత్రీకులు వస్తుంటారు. హజ్ సందర్భంగా నెల రోజుల పాటు యాత్రీకులు తప్పిపోవడం, కొన్ని గంటల పాటు, కొన్ని సందర్భాల్లో కొన్ని రోజుల పాటు ఆచూకి లభించక పోవడం జరుగుతుంది. తమ తోటి వారితో పాటు బంధువుల్లో కూడ ఆయోమయం, ఆందోళనకు దారి తీసేది. హజ్ నుండి బయటి వచ్చే అనేక ద్వారాలు ఉంటాయి. పొరపాటున మనం వెళ్లిన ద్వారం గాకుండా ఇతర ద్వారాల ద్వారా బయటకు వస్తే మన గమ్యానికి చేరకుండా ఇతర నగరాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇలా తప్పిపోయే వారి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. వారిని గుర్తించేందుకు సౌది అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుంటుంది. సౌది అధికారులకు ఆంగ్లము, ఉర్దూ భాష తెలియక పోవడంతో ఇబ్బందిగా ఉంటుంది. స్థానిక ప్రజలు కూడా మన భాష తెలియక సహాయం చేసే పరిస్థితి ఉండదు.

షీ బృందాలకు చిక్కిన ఆకతాయిలు
ఇద్దరిపై నిర్బయ కేసులు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: జంట నగరాలలో మహిళలను వేధిస్తున్న ఆకతాయిలు, ఈవ్‌టీజర్లపై షీ బృందాల దాడుల పరంపర కొనసాగుతూనే వుంది. గడ చిన నెల రోజులలో నగరంలోని వేరు వేరు ప్రాంతాలలో షీ బృందాల పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 87 మంది పట్టుబడ్డారు. ఇందులో 15 మంది మైనర్లు వున్నారు. షీ బృందాలకు పట్టుబడ్డ వారిలో ఇద్దరిపై నిర్బయ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. వీరిలో పాతబస్తీలోని చాంద్రాయణ గుట్టకు చెందిన మీర్జా మహమ్మద్ అలీ బేగ్ (23)తో పాటు మరో వ్యక్తి వున్నాడు. వీరిపై ఐపిసి 354 (డి)తో పాటు 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాం డుకు తరలించారు. వీరిద్దరు తమకు పరిచయం వున్న మహిళలను అదేపనిగా వేధి స్తూ దొరికిపోయారు. కాగా మరో ఘటనలో తనకు గతంలో పరిచయం వున్న ఓ మ హిళను వేధిస్తున్న కేసులో అభిషేక్ పెద్దిబొట్లను ఐటి సెక్షన్ కింద అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా ఇంకో ఘటన లో ఉస్మానియా వర్శిటీలో చదువుతున్న ఓ విద్యార్థినికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో బెదిరించసా గాడు. దీనిపై బాధితురాలి నుంచి ఫిర్యాదు అందుకున్న షీ బృందాల పోలీసులు ఈ పాడుపనికి పాల్పడిన వ్యక్తిని ఆవుల జానయ్యగా గుర్తించి అతన్ని అరెస్టు చేశారు. నిందితుడిపై ఐపిసి 507 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నెల రోజుల వ్యవధిలో అరెస్టయిన వారి లో పది మందిపై పెట్టి కేసులు నమోదు చేయగా మిగగా వారికి మందలింపుతో సరిపుచ్చారు. తమపై జరిగే వేధింపులను మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) స్వాతి లక్రా కోరారు. దీనిపై బాధితులు 9490616555కు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. మహిళలకు షీ బృందాలు అన్ని వేళలా అండగా వుంటుందని ఆమె వెల్లడించారు.

తిరుమలలో రేపు 'డయల్ యువర్ ఇఒ'



తిరుమలలో పవిత్రోత్సవాలకు అంకుర్పారణ చేస్తున్న అర్చకులు

తిరుమల,ఆగస్టు 2 ప్రభాతవార్త: తిరుమలకు విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శనంలో,అద్దెగదులు పొందడంతోబాటు స్వామివారి సేవా టిక్కెట్లు తీసుకోవడంలో ఎదురయ్యే సమస్యలు, అనుభవాలు, సూచనలు టిటిడి దృష్టికి తీసుకొచ్చేందుకు వీలుగా ప్రతినెలా మొదటి శుక్రవారం నిర్వహించే 'డయల్ యువర్ ఇవో' కార్యక్రమం 4వతేదీ శుక్రవారం జరగనుంది. టిటిడి ఇవో అనిల్‌కుమార్‌సింఘాల్ శుక్రవారం డయల్‌యువర్ ఇవో మూడవ దఫా కార్యక్ర మంకు హాజరవుతున్నారు. శుక్రవారం ఉదయం 8.30గంటలనుంచి 9.30గంటల వరకు భక్తులు ఫోన్ నెంబర్ :0877-2263261కు ఫోన్‌చేయాల్సి వుంటుంది. అనంతరం ఆర్జితసేవాటిక్కెట్లు విడుదలచేస్తారు.

పెరిగిన రద్దీతో శ్రీవారి దర్శనానికి 12గంటలు

తిరుమల,ఆగస్టు 2 ప్రభాతవార్త: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల రద్దీ బుధవారం సాయంత్రానికి పెరిగింది. సాయంత్రానికిభక్తుల రద్దీ పెరగడ ంతో వైకుంఠం-2లోని 32కంపార్టు మెంట్లు నిండిపోయి 12గంటలు సమయం నిరీక్షించాల్సివస్తోంది. సాయంత్రానికి 44,108మంది భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం 2.71 కోట్లు చేకూరింది.



రిజర్వేషన్లతో దోబూచులాడుతున్న టిడిపి ప్రభుత్వం

కాపులు, బిసిల మధ్య రిజర్వేషన్ల చిచ్చు పెట్టింది

ప్రజల అజెండా మేరకే నంద్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి

పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

అనంతపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో దోబూచులాడుతూ ప్రజలను మధ్య పెట్టేందుకు చూస్తోందని, కాపు రిజర్వేషన్ల పేరుతో బీసీలు, కాపుల మధ్య చిచ్చు పెట్టిందని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం అనంతపురం కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 నుంచి 70 శాతం పెంచాలంటే పార్లమెంటులో షెడ్యూల్ 90 కింద మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఇందుకు బిజెపి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందా ఈ విషయంలో బిజెపి మాట ఇచ్చిందా అని ఆయన తెలుగుదేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం చోద్యం చూస్తోందని, కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించి తగిన చర్యలు తీసుకోలేదని ఆయన టిడిపి ప్రభుత్వాన్ని విమర్శించారు. మతతత్వ పార్టీ అయిన బిజెపి గొడుగు కింద తెలుగుదేశం, వైసీపీ పార్టీలు పనిచేస్తున్నాయని, కోట్లాది రూపాయలు వెనుకేసుకొని ప్రజల ముందుకొస్తున్నాయని ఆయన విమర్శించారు. నంద్యాల ఎన్నికల్లో ప్రజల గొంతుకు వినిపించేందుకే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బరిలోకి దించిందన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు ఒక మంత్రి పదవి కూడా ఇవ్వలేదని ఈ పరిస్థితుల్లో ఓట్లు అడిగే పరిస్థితి తెలుగుదేశం ప్రభుత్వానికి లేదన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోటా సత్యం, మాజీ ఎంఎల్‌ఏలు సుధాకర్, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి తన ప్రసంగంలో దేశానికి స్వాతంత్ర్య ఉద్యమ స్పూర్తికి పింగళి వెంకయ్య చేసిన సేవలను కొనియాడారు.

గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.12.50 కోట్లు

హైదరాబాద్ ఆగస్టు 2, ప్రభాతవార్త: గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.12.50కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈమేరకు ఈ నిధులకు అనుమతినిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.పి.ఆచార్య బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికోసం ఇచ్చే నిధుల్లో భాగంగా రెండవ త్రైమాసికానికి వీటిని కేటాయించారు. ఈ నిధులను గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటి పరిధిలో ఖర్చు చేస్తారు.

11న టిఎస్ఐసెట్ తుది విడత సీట్ల కేటాయింపు

8 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: టిఎస్ఐసెట్ తుది విడత అడ్మిషన్ కౌన్సిలింగ్ నోటిఫికేషన్ బుధవారం విడుదల అయింది. దీని ప్రకారం ఈనెల 11న ఫైనల్ ఫేస్ సీట్ల కేటాయింపును చేస్తారు. అంతకుముందు ఈనెల 8వ తేదీన సర్టిఫికేట్ వెరిఫికేషన్, 8, 9 తేదీల్లో ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించినట్లు ఎంసెట్ కన్వీనర్ వాణిప్రసాద్ తెలిపారు.

వర్సిటీలు సహా ప్రభుత్వశాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయండి

సిఎం కెసిఆర్‌కు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వందలాది మంది కాంట్రాక్టు, టైంస్కేలుతో ఉద్యోగులుగా గత 30 ఏళ్ల సర్వీస్‌తో పనిచేస్తున్నారనీ అలాగే ఇతర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు..ఎమ్మెల్యే జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షులు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖలో పనిచేసే 20 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయం తీసుకోవడం సాహసోపేతమైనదని, అందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత గొప్ప నిర్ణయం తీసుకోలేదని కొనియాడారు.

టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేస్తామని ప్రకటించడంతో ఈ ఉద్యోగులందరూ రాత్రింబవళ్లు ప్రచారం చేసి టిఆర్ఎస్ అధికారంలోకి తీసుకవచ్చారనీ, 40 ప్రభుత్వ శాఖలతోపాటు 45 ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, అలాగే ఎస్సీ,ఎస్టీ, బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు, 12 యూనివర్సిటీల్లో పనిచేసే లక్షా 10 వేల మందిని కూడా రెగ్యులరైజ్ చేయాలని కృష్ణయ్య కోరారు. స్థానిక సంస్థల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వివిధ ప్రభుత్వ స్కీముల కింద పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయాలని కోరారు. ఏళ్ల తరబడి 15 నుంచి 20 ఏళ్ల సర్వీసుతో పనిచేస్తున్నారనీ వారికి గరిష్ట వయోపరిమితి కూడా దాటిపోయిందన్నారు. ప్రభుత్వం రోస్టర్ ప్రకారమే వీరిని భర్తీ చేశారని, అందువల్ల వీరిని కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

'ప్రభుత్వ భూములను కార్యకర్తలకు ధారాదత్తం చేస్తున్న చంద్రబాబు'

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: ప్రభుత్వ భూములను పేదలకు ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా చుక్కల భూమి పేరుతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ధారాదత్తం చేస్తున్నదని ఇది దారుణమని యునైటెడ్ బహుజన పోరాట సమితి జాతీయ కన్వీనర్ కరణం తిరుపతి నాయుడు ఆరోపించారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చుక్కల భూమిపై ఆర్డీవోలకు సైతం అధికారాలు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలు సూచించిన వారికి అధికారులు భూమి అప్పజెప్పుతున్నారని తెలిపారు. దీంతో పేద రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అభివృద్ధి పేరుతో రైతుల నుంచి సేకరించిన భూములను కార్పొరేట్ సంస్థలకు, టీడీపీ నాయకులకు కేటాయిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వేసిన జన్మభూమి కమిటీల ద్వారా కూడా నిజమైన లబ్దిదారులకు న్యాయం జరగడం లేదన్నారు. నిజమైన పేదలకు వ్యవసాయ ఆధారితమైన భూమిని పంపిణీ చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం దానిని వదిలేసి తమ పార్టీకి చెందిన వారికే ప్రయోజనం కల్పించడం దారుణమని చెప్పారు. ఆ కమిటీలు సిఫార్సు చేసిన వారికే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని తెలిపారు. దీంతో పార్టీతో సంబంధం లేని పేద రైతుల పరిస్థితి దారుణంగా మారిందని తెలిపారు. దిక్కుతోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి నిజమైన లబ్దిదారులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన హైకోర్టును ఆశ్రయిస్తామని తిరుపతి నాయుడు హెచ్చరించారు.

అటల్ ఇన్‌క్యుబేషన్ కేంద్రంగా మారనున్న ఎస్కెయు

వైస్ ఛాన్స్‌లర్ కె.రాజగోపాల్ వెల్లడి

అనంతపురం క్రైం,ఆగస్టు 2 ప్రభాతవార్త : ఇక నుండి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంకుబేషన్ కేంద్రంగా మారబోతుందని, రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలకు ఎంతో తోడ్పాటును అందించబోతున్నందుకు తాము గర్విస్తున్నామని ఎస్కెయు వైస్‌ఛాన్సలర్ కె.రాజ గోపాల్ వెల్లడించారు. బుధవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్కే యూనివర్శిటీలో విశ్వప్రమాణాలతో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. రాయలసీమకే తలమానికంగా వుంటూ విద్యాపరంగా,పరిశోధనాపరంగా, భోదనాపరంగా అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ప్రతిభావంతులైన ఎంతోమంది శాస్త్రవేత్తలను, పరిశోధకులను తీర్చిదిద్దిన ఎస్కెయు విశ్వ ప్రమాణాల వేదికగా నిలుస్తూ అరుదైన అటల్ ఇంకుబేషన్ కేంద్రం కైవశం చేసుకుందని వైస్ ఛాన్సలర్ తెలిపారు. ఈ ఖ్యాతిని గడించడానికి యూనివర్శిటీ ఆధ్యాపక బృందం కృషేనని ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో నీతి ఆయోగి ద్వారా దాదాపు 3658 దరఖాస్తులు వచ్చాయని అయితే అందులో 13 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఎన్నికైనాయన్నారు. అందులో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్నికైనందుకు ఎంతో గర్విస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుండి 181 దరఖాస్తులు వెళ్ళాయని అందులో మన విశ్వవిద్యాలయం విశ్వవిఖ్యాతి విజేతగా నిలిచిందన్నారు. విజ్ఞాన శాస్త్ర సాంకేతికపరంగా విశేష అనుభవం గడించిందనేకారణంతోనే ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అటల్ ఇంకుబేషన్ కేంద్రం స్థాపనకు శ్రీకారం చుట్టడం అంతర్జాతీయస్థాయిలో చర్చనీయాంశమైందన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన పరిశోధనల సంస్థలతోపాటు, జాతీయస్థాయిలో పేరెన్నిక గన్న వివిధ పరిశోధనల సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ధీటుగా నిలచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నీతి ఆయోగ్ ద్వారా ఈ ఎన్నిక జరగడం సర్వత్రా హర్షణీయమన్నారు. ఔత్సాహిక యువపారిశ్రామికవేత్తలను శాస్త్రవేత్తలను తీర్చిదిద్దడానికి ఇంకు బేషన్ కేంద్రం పూర్తిస్థాయిలో దోహదపడుతుందన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థినీ, విద్యార్థుల్లో పరిశోధకుల్లో సృజనాత్మకమైన ఆలోచనలను పెంపొందింపచేసి వినూత్న ఆవిష్కరణలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేంద్రం సంవత్సరానికి చొప్పున ఐదు సంవత్సరాల పాటు రూ.10కోట్ల ఖర్చు భరిస్తుందని వైస్‌ఛాన్సలర్ తెలిపారు. అనంతపురంజిల్లా నిత్యం కరవుతో అల్లాడుతున్న విషయం తెల్సిందేనని సామాజిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతానికి ఎంతో ఉపయో గపడుతుందన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలకు ఉపయోగమన్నారు. అత్యున్నతమైన పరిశోధనా ప్రమాణాలతో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తూ యువతను నిర్దిష్టమార్గంలో పయనింపజేయటానికి అటల్ ఇంకుబేషన్ కేంద్రం దోహదపడు తుందన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు రాణిస్తారని ఆయన తెలిపారు. భావితరాలకు విలువైన మేధో సంపత్తిని అందించడానికి జీవన ప్రమాణాలను పెంపొందింప చేయడానికి నీతి ఆయోగ్ ఎంపిక చేసిన అటల్ ఇంకుబేషన్ కేంద్రంకు సంబంధించి ఒక సిఈఓను నియమిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ తెలిపారు. ఇప్పటికే యూనివర్సిటీ యువతకు అనేక రూపాల్లో సహాయ సహకారాలు అందించే వాటిలో ఉందన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్కెయు రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు,రెక్టార్ లజపతిరాయ్‌లు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న పేదల పెన్షన్లు

ఏలూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త ప్రతినిధి:తెలుగుదేశంపార్టీ రాష్ట్రం అధికారంలోకి వచ్చాక 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఇచ్చిన భరోసా పెన్షన్ పెంపుదల. అంతకుపూర్వం తెలుగుదేశం పార్టీ పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలుచేసింది. కానీ పెన్షన్ పథకం మాత్రం లక్షలమంది పేదల్లో నిజంగానే జీవితానికి భరోసాగా నిలిచింది. నా అనే ఆసరాలేని వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు జీతంలా ప్రతినెలా వచ్చే పెన్షన్ పట్టెడన్నంపెడుతోంది. రాష్ట్ర ఖజానా ఎంతగా ఆర్థిక సంక్షోభంలోవున్నా ముఖ్యమంత్రి పెన్షన్ ఇవ్వడంలో మాత్రం ఈనాటి వరకు మడం తిప్పలేదు. రాష్ట్రంలో ఈ ఆగష్టుతో 45.15 లక్షల పెన్షన్లు ఇస్తున్నారు. ఇందుకు రూ. 489.58 కోట్లు ప్రతినెలా ఖర్చవుతున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా తూర్పుగోదావరిజిల్లాలో 4,98,166 పెన్షన్లు ఇస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 3,72,271 పెన్షన్లను ప్రతి నెలా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 57 మండల, మున్సిపల్ కేంద్రాల్లో పెన్షన్లను మంజూరుచేసారు. అత్యధికంగా ఏలూరు అర్బన్‌లో 19365 పెన్షన్లు ఇస్తుండగా కుక్కనూరులో అతితక్కువగా పెన్షన్లు వున్నాయి. పెదవేగి మండలంలో అత్యధికంగా 8,390 పెన్షన్లువున్నాయి. ఆగస్టు నెలలో ఇంతవరకు పెన్షన్ల పంపిణీలో కొవ్వూరు ముందంజలోవుంది. 92 శాతం పెన్షన్లను ఇక్కడ పంపిణీచేసారు. ఈ రెండురోజుల్లోనే రాష్ట్రం మొత్తంగా 47 శాతం పెన్షన్లపంపిణీ జరిగింది. ప్రభుత్వం పెన్షన్ల విషయంలో ఇంతటి సమర్థవంతమైన సేవలందిస్తుండగా స్వార్థపరులు కొత్తగా పెన్షన్‌కోసం ధరఖాస్తు చేసుకున్నవారిని నిలువుదోపిడీ చేస్తున్నారు. పెన్షన్ మంజూరుకు రూ.2 వేల నుండి 5 వేల వరకు గుంజుతున్నట్లు సమాచారం . ప్రధానంగా వృద్ధాప్య పెన్షన్ల విషయంలోనూ వితంతువు పెన్షన్ల విషయంలోనూ కొన్నిచోట్ల భారీగా అవినీతి చోటుచేసుకుంటున్నది. విడో కాని విడోలకు 60 సంవత్సరాలలోపు వారికి వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నట్లు సాక్షాత్తు తెలుగుదేశం నాయకులే ఆరోపిస్తున్నారు. నచ్చిన వారికి నచ్చినట్లుగా ఆన్‌లైన్‌లు చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నరసాపురం మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఓ సభ్యుడు ఆనారోగ్య వ్యక్తికి పెన్షన్ ఇవ్వకుండా మూడంతస్థుల భవనం ఉన్న వ్యక్తికి పెన్షన్ ఎలా ఇచ్చారని ఆధారాలతో సహా బయటపెట్టారు. ఈ నేపధ్యంలోనే భర్త బ్రతికుండగానే విడో పెన్షన్ వ్రాయించుకుని హ్యాపీగా నెలానెలా వెయ్యి రూపాయలు పొందుతున్నారని మరో మహిళ కార్పొరేటర్ ఆరోపించడం విశేషం. ఇలా అనేక పెన్షన్లున్నాయని నాయకులే చెబుతున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో అన్నిచోట్ల ఎంతోకొంత ఉండకమానదు. అధికారులను లోబరుచుకుని తప్పుడు నివేదికలతో పెన్షన్‌లు ఇప్పిస్తున్న దాఖలాలు లేకపోలేదు. అయినవారికి ఆకులో వడ్డించినట్లుగా తమ వందిమాగతులకు పెన్షన్లు వ్రాయించడంలో అడ్డు అదుపులేకుండా పోతున్న సంఘటనలు కథనాలు వెలుగుచూస్తున్నాయి. గతంలో తెల్లకార్డుకు కూడా ఇలాంటి అవినీతి మరకలేవుండేవి. కార్డులను ఏరివేయడానికి బోగస్ కార్డులను ఎత్తివేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి ఏడాది డ్రైవ్ చేపట్టేది. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం ఈ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం. బడ్జెట్‌లో అత్యధిక నిధులను ప్రభుత్వం ప్రతినెలా పేదల పెన్షన్‌కు ఖర్చుచేస్తోంది. ఫలితంగా ఈ సంక్షేమం మాటున అత్యవసరమైన పనులు మరుగున పడుతున్నాయి.



తీసుకుంటున్న వృద్ధురాలు

పెన్షన్ కావాలంటే ముడుపులివ్వాల్సిందే

ఎన్నికల ముందు ఓ మాట...ఇప్పుడో మాట

చంద్రబాబు ఏం చేసినా రాజకీయ లబ్ధికోసమే

వైఎస్సార్సీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం

హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:వైఎస్సార్సీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి నైతిక విలువలు, రాజకీయాలను నేర్చుకోవాలని చంద్రబాబుకు వైఎస్సార్సీ సీనియర్ నేత తమ్మినేని సీతారం సూచించారు. ఏపి సిఎం చంద్రబాబు నాయుడు అనైతిక రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం వైఎస్సార్సీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్సీ ఎంఎల్‌ఏలను ప్రలోభపెట్టి 21 మందికి పచ్చ కండువాలు కప్పిన చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు వారి చేత రాజీనామాలు చేయించలేదన్నారు. రాజకీయల్లో కొంచెం కూడా విలువలు పాటించని చంద్రబాబు నాయుడన్నారు. 2026 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. అప్పటి జనాభా ప్రాతిపదికన అది జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం నిన్న పార్లమెంటలో టిడిపి ఎంపి మురళీ మోహన్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో సమాధానం చెప్పిందన్నారు. దురదృష్టం ఏంటని ప్రశ్నించారు. సీట్లు పెరగడం లేదని తేలడంతో టిడిపిలో గందరగోళం నెలకొందన్నారు. శిల్పా చక్రపాణి రెడ్డి టిడిపికి, ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేయడం శభాష్ అంటూ కొనియాడారు. ఇప్పుడు సీట్ల పెంపు లేదు...స్వీట్లు లేవని చంద్రబాబును ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో సంపాదించుకునేవారు ఒకరైతే, విలువలతో ప్రజాసేవ చేసేవారు రెండోరకం అన్నారు. అబద్దాలు, అసత్యాలు, అనైతికతే చంద్రబాబు రాజకీయ సిద్దాతం అన్నారు. వైఎస్సార్సీలో చేరాలనుకునేవారు వేరే పార్టీలో ఉంటే పార్టీ సభ్యత్వానికి, పదవులకు రాజీనామాలు చేయాలని వైఎస్ జగన్ సిద్దాతం అన్నారు.40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ఇలాంటి విలువలు లేవన్నారు. చంద్రబాబు మాట్లాడితే అబద్దమని, చేసేదంతా మోసం అన్నారు.

చిత్రం భళారే విచిత్రం

ఆకట్టుకున్న రామశాస్త్రి చిత్రప్రదర్శన



నందిగామ, ఆగస్టు 2 ప్రభాతవార్త: చిత్రం భళారు విచిత్రం అనిస్తుంది,చిత్రకారుడు వివిధ భావోద్వేగాలను,అనుభూతులకు ఇచ్చే గీతారూపం మనస్సును ఉల్లాసపరుస్తుంది.ఆ చిత్రకారుడిని కళ్ళెదుట నిలిచిన విరంచిలా సాక్షత్కరింపచేస్తుంది.అలాంటి అద్భుతాలను ఇట్టే చేసే గొప్ప చిత్రకారుడు.ఆయన బొమ్మను సజీవకత ఉట్టిపడేరీతిలో అపరచిత్ర బహ్మ బాపు కుంచే జాలువారితే,,ఆ బాపుతో సహ తెలుగుకవులు,రచయితలు కళాకారులు,అలౌకికానందం పంచిన వ్యక్తుల చిత్రాలను మనస్సు పోరల్లో ఛాయాచిత్రాలను తీర్చిదిద్దినట్లుగా సాధారణ కాగితంపై పెన్సిల్ స్కెచ్ వేస్తారు రామశాస్త్రి ఎస్. ఇది కొంత అతిశయోక్తిగా కన్పించినా శ్రీశ్రీ ఆయన రేఖాచిత్రంలో బంధీ పదండి ముందుకంటూ ఉత్తేజపరుస్తారు,అద్దేపల్లి అనంతర గోదావరి తీర నిత్యయవ్వనతను ప్రతిబింబంగా అందగా పలుకరిస్తారు.సినారే ,మహాజన్‌బీ,ఎండ్లూరి సుధాకర్,ఆరుద్ర, కొలకలూరి ఇనాక్,గజల్ శ్రీనివాస్, కుప్పలి పద్మ,మహాజన్‌బీ, ఆధునిక కవులు,నిన్నటితరం కవులు,వర్తమాన కవులు,సమీక్షకులను ఆయన పెన్సిల్ గీతల్లో బంధించి ముంగిట నిలిపిపలుకరింపచేస్తారు.ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సభా ప్రాంగణంలో రామశాస్త్రి దాదాపు రెండు వందల మంది కవులు,కవయిత్రులు అందరిని అబ్బుర పరిచాయి,సంఘం గౌరవాధ్యక్షుడు ఈ శిబిరాన్ని ప్రారంభించారు."ప్రేమాచారంతో కూరి్చన మాటల కదంబం నీకు అర్పించాలన్న వెర్రికోరిక తూనీత" ఇవి శాస్త్రి కవిత్మాత పలికిన మాటలు అవి చిత్రాలయి ఇంకా ఎన్నోతలంపులను రగిలిస్తాయి," ఉన్నచోటు నుంచి ఎవ్వరులేని,ఎనుడూ చూడని,ఒకానొక నిశ్శబ్ద ప్రపంచపు సౌందర్యాన్ని అందుకోవడం తాత్వికమా అని శాస్త్రిలోని కవిత్వం ప్రశ్నిస్తుంది. జవాబు తానే గీతల్లో జీవకళను పోస్తుంది,చిత్రాలకు ఊపరి వుండక పోవచ్చు ఉత్తేజ పరిచేశక్తి వుంది. రామశాస్త్రి తణుకు సిండికేట్ బ్యాంకు ఉద్యోగం, చిత్రలేఖనం, కవిత్వం ఆయనకు కవల పిల్లలు..ఆయనకు 2010లో ఎంజి గోఖలే అవార్డు,పిటిరెడ్డి అవార్డు,వివి భగీరథ,చలసాని ప్రసాద్,నెహ్రు కల్చరల్ అవార్డు, కళాజ్యోతి,హైదారాబాద్ ఆర్ట్స్ సొసైటీ,దామెర్ల రామారావు,పికాసో అవార్డులు లభించాయి, హైదారాబాధ ,అమలాపురం,కరీంనగర్‌కు సంస్థల అవార్డులు అందచేసాయి,వీటితో పాటు స్థానిక సంస్థల అవార్డులు ఆయనను వరించాయి. నిజామాబాద్, విజయవాడ, హైదారాబాద్,బెంగుళూరు నగరాల్లో జరిగిన చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటుతో పాటు,శిక్షణ తరగతుల్లో ఆయన ఎందరినో కళాకారులుగా తీర్చిదిద్దేంకు శిక్షణను అందచేసారు.విశిష్ట ఆచార్య పురస్కారాన్ని ఆయన వరుసగా అందుకున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నది శాస్త్రి సిద్దాంతం.అసలు కులమయినా, మత మయినా ఒక మత్తే కదా.బాధలేని మరొకరి బాధనివ్వని మత్తు మంచిదేనేమో,కొంత వరకు అది ఉన్మాదిని చేయనంతర వరకు అని స్పష్టం చేసిన శాస్త్రి,రచనలు సూతిమొత్త మనస్సును రగిలించే శక్తులు(ఘంటా విజయకుమార్), కాలచక్రంలో ఒడుదుడుకులు సామాన్యం కదా,వేడుకలకు కొదవులేని ఈ దేశంలో ప్రతి మాసం సాధారణ జీవితాలకు బతుకులు అత్తిసరు, అనే శాస్త్రి గీచిన చిత్రాలు అందరితో మాట్లాతాయి.హ్యాట్సప్ రామశాస్త్రి




రామశాస్త్రి చిత్రప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎపి రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు

తెలంగాణలో 80 అర్బన్ పార్కులు

12 పార్కులు పూర్తి, అభివృద్ధి దశలో మరో 24 పార్కులు

వాకింగ్, యోగా, కుటుంబంతో సేద తీరేలా అద్భుతంగా ఏర్పాట్లు

హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త: పట్టణ ప్రాంతాల్లో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని తట్టుకునేందుకు, మెరుగైన జీవన విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న ప్రయత్నం చేస్తోంది. రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చే పార్కులను ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో తీర్చిదిద్దుతోంది. పట్టణాలకు దగ్గర్లో ఉండే అటవీ భూములను గుర్తించి వాటిల్లో కొంత భాగాన్ని అర్బన్ లంగ్ స్పేస్ లుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో ఆదేశాలిచ్చారు. దీనికి అనుగుణంగా హైదరాబాద్‌కు అన్ని వైపులా ఈ పార్కుల అభివృద్ధికి అటవీ శాఖ కృషి చేస్తోంది. రాజధాని పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల, వెలుపల మొత్తం 14 ప్రాంతాలను అర్బన్ పార్కులుగా మార్చేందుకు అటవీశాఖ ప్రణాళికలు సిద్దం చేసింది. గుర్రం గూడ, కండ్లకోయ, మేడ్చేల్, దూలపల్లి, గాజుల రమారాం మొదలైన ప్రాంతాల్లో ఉన్న అటవీ బ్లాక్‌ల్లో పార్కుల అభివృద్ధి జరుగుతోంది. ఈ 14 ప్రాంతాల్లో మొత్తం 3,345 హెక్టార్ల అటవీ భూముల్లో ఒక్కో చోట కొంత భాగాన్ని పార్కుల అభివృద్ధికి గుర్తించారు. నిత్యం ట్రాఫిక్, కాంక్రీట్ జంగిల్ గా మారిన బిజీ లైఫ్‌లో ఉదయమో, సాయంత్రమో వాకింగ్‌కు వెళ్లినా, కుటుంబం, స్నేహితులతో సరదాగా కాసేపు గడపాలన్నా పెద్దలకు వాకింగ్ ట్రాక్, యోగా ప్లేస్‌లతో పాటు పిల్లలకు మంచి రిక్రియేషన్ ప్లే గ్రౌండ్‌ను వీటిల్లో అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలు కలిసి పిక్నిక్‌కు వెళ్లిన అన్ని సౌకర్యాలు ఉండేలా ఈ పార్కులను అభివృద్ధి చేస్తోంది అటవీ శాఖ. గుర్రంగూడ సంజీవని పార్కు, అజీజ్‌నగర్ దగ్గర మృగవని నేషనల్ పార్క్, కండ్లకోయ నేచర్ పార్క్, శంశాబాద్ సమీపంలో డోమ్ నేచర్ పార్క్, ఘట్‌కేసర్ సమీపంలోని భాగ్యనగర్ నందనవనం పార్కులు ఇప్పటికే పూర్తయి పెద్ద సంఖ్యలో స్థానికులను, పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. చుట్టుపక్కల ఉన్న కాలనీలకు, పట్టణ ప్రాంతానికి కేవలం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఈ పార్కుల అభివృద్ధి పరచటంతో రోజూ సందర్శించే వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. అదే సమయంలో వీటిల్లో కొన్ని పార్కుల్లో కాటేజీలను కూడా అటవీ శాఖ ఏర్పాటు చేసింది. దీంతో ఏకో టూరిజానికి అవకాశాలు పెరిగాయి. ప్రకృతి మధ్యలో అటవీ ప్రాంతాల్లో ఒకటి రెండు రోజులు గడపటంతో పాటు పచ్చటి వాతావరణంలో సేదతీరేలని భావించే వారికి ఇవి చక్కటి అవకాశంగా మారాయి.ఒక్కో పార్క్‌ను ఒక్కో థీమ్‌తో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 80 అర్బన్ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్న అటవీ శాఖ ఇప్పటికే 24 పార్కులు అభివృద్ధి చేసేందుకు ఫారెస్టు బ్లాక్‌లను గుర్తించటం, రూ.25 కోట్లు నిధుల కేటాయింపు కూడా జరిపింది. వీటి అభివృద్ధి వివిధ దశల్లో ఉంది. 12 పార్కులు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అన్ని పట్టణ ప్రాంతాలు, ఆవాసాలకు వీలైనంత సమీపంలో ఈ అర్బన్ లంగ్ స్పేస్‌లను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో అటవీ శాఖ పనిచేస్తోంది. హైదరాబాద్ గనరం చుట్టూ అభివృద్ధి చేసిన పార్కులు, వాటి ప్రత్యేకతలను మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ తన ట్విట్టర్‌లో మూడు ట్వీట్‌ల ద్వారా వెల్లడించారు.



ఇదే అతనికి చివరి పరుగు!

లండన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కడసారి పాల్గొనేందుకు సిద్ధమవుతున్న జమైకా పరుగుల వీరుడు బోల్ట్



ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: గత దశాబ్దకాలంగా స్ప్రింట్ ట్రాక్‌పై సత్తా చాటిన జమైకా పరుగుల వీరుడు ఉసేన్ బోల్ట్ తన చివరి పరుగుకు సిద్ధమవుతున్నాడు. బోల్ట్ త్వరలో విశ్రాంతి తీసుకోబోతున్నాడు. 2015లో ఓ సమావేశంలో మాట్లాడుతూ 2017లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని నిష్క్రమిస్తా నని ప్రకటించిన విషయం విధితమే. ప్రపంచ అథ్లెటిక్స్‌లో 8బంగారు ఒలింపిక్ పతకాలు, 11 వరల్డ్ ఛాంపియన్‌షిప్ బంగారు పతకాలు సాధించి ఎన్నో ప్రపంచరికార్డులను తనపేరిట లిఖించారు. 100, 200 మీటర్లపరుగులో బోల్ట్ నెలకొల్పిన రికార్డులు అనేకం. ఆగస్టు 4నుంచి లండన్ వేదికగా మొదలయ్యే ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌సందర్భంగా తనచివరిపోటీ పడబోతు న్నాడు. దీంతో బోల్ట్ పాల్గొనబోతున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ప్రాధాన్యత సంతరించుకుంది. తనచివరి రేసులోనైనా బోల్ట్‌ను ఓడించే సత్తా ఎవరికైనా ఉంటుందా లేదో చూడాలి మరి.

పోటీ ఇచ్చే వారెవరో: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో అసాఫా పావెల్, యొహాన్ బ్లేక్, జస్టిన్ గాట్లిన్ మాత్రమే బోల్ట్‌కు పోటీ ఇచ్చే వాళ్లుగా కనిపిస్తున్నారు. అయితే పావెల్ ఈ పోటీల్లో పాల్గొనడం లేదు. ఇక బ్లేక్ విషయాని కొస్తే గాయాలతో సతమతమవుతున్నాడు. గాట్లిన్ పరుగులో నిలకడ లేదు. 2016 రియో ఒలింపిక్స్ తర్వాత 100 మీటర్ల పరుగులో అతడు పెద్దగా రాణించలేదు. అయితే ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్‌కు గట్టి పోటీ ఇవ్వగలడని భావిస్తున్న వాళ్లలో 22ఏళ్ల ఆంద్రీ డిగ్రాస్ (కెనడా) ముందు వరుసలో ఉన్నాడు. డిగ్రాస్ ఫామ్‌లో ఉన్నాడని బోల్ట్ కూడా ఒక సందర్భంలో చెప్పాడు. గతేడాది ముగిసిన రియో ఒలింపిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగులో డిగ్రాస్ బోల్ట్‌కు సమీపంగా పరుగెత్తాడు. ఇక 100 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచిన అతడు 200 మీటర్ల పరుగులో రజతం నెగ్గాడు. ఇక 400 మీటర్ల రిలేలో కాంస్యం గెలుపొందాడు. ఇలా ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు గెలిచిన తొలి కెనడా స్ప్రింటర్ డిగ్రాస్ కావడం విశేషం. ఇక ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ 100 మీటర్ల పరుగుతో పాటు 400మీటర్ల రిలేలో పాల్గొన బోతున్నాడు. ఇటీవల మొనాకోలో జరిగిన డైమండ్ లీగ్ రేసులో 100 మీటర్ల పరుగును 9.95 సెకన్లలో పూర్తిచేసి పసిడి నెగ్గిన బోల్ట్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 200మీటర్ల పరుగులో పాల్గొనడం లేదని చెప్పాడు.

అథ్లెటిక్స్‌ని రక్షించండి: క్రీడాకారులు సమిష్టి బాధ్యత తీసుకొని అథ్లెటిక్స్‌ను కాపాడాలని ఉసేన్ బోల్ట్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం లండన్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న బోల్ట్‌కు ఇదేచివరి పరుగు కావడంతో దీనికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో బోల్ట్ మాట్లాడుతూ ఒక్క ఆటగాడు గెలిచినంత మాత్రాన అథ్లెటిక్స్‌ను బ్రతికించలేదని ఆటగాళ్లంతా సమిష్టి బాధ్యత తీసుకుని అథ్లెటిక్స్‌ను కాపాడాలని కోరాడు. ఎవరైనా ఓ ఆటగాడు నిష్క్రమిస్తే తర్వాత అతని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న ప్రశ్న తలెత్తకూడదని, ఖచ్చితంగా ఆ ఆటగాడి వారసత్వాన్ని కొనసాగించాలని లేదంటే అథ్లెటిక్స్ మరుగున పడిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. 400మీటర్ల స్ప్రింట్ ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత వేడ్ గురించి బోల్ట్ మాట్లాడాడు. వేడ్ 24ఏళ్ల యువకుడని, చాలా వేగంగా పరుగెడుతున్నాడని, కచ్చితంగా తన రికార్డులను బద్దలు కొట్టే సామర్థ్యం వేడ్‌కు ఉందన్నాడు. 100 మీటర్లు, 200 మీటర్ల స్ప్రింట్ పోటీల్లో కూడా వేడ్ పాల్గొంటే పరుగు వేగాన్ని పెంచుకునేందుకు ఆస్కారముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్‌కు క్రీడాకారులు అవసరం ఎంతో ఉందన్నాడు. క్రీడాకారులు వారి క్రీడా జీవితాన్ని తేలికగా తీసుకుంటే దాని వల్ల అథ్లెటిక్స్ మరుగున పడిపోయే ప్రమాదముందని హెచ్చరించాడు. మాదకద్రవ్యాలు తీసుకుని పోటీల్లో పాల్గొంటే అది అథ్లెటిక్స్‌కే అవమానం, ప్రమాదకరమని క్రీడాకారులు ఈ విషయం గురించి ఆలోచించాలన్నారు. నిజాయితీగా కష్టపడి ఈ రంగంలో రాణిస్తే అది యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని రగిలిస్తుందన్నారు. క్రీడాకారులు వారి ఆటతో ప్రేక్షకులకు వినోదం పంచడమే లక్ష్యంగా చేసుకోవాలన్నారు. శుక్రవారం లండన్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల స్ప్రింట్ విభాగంలో పోటీ పడుతున్నానని, అనంతరం ఆగస్టు 12 జరగబోయే వందమీటర్ల రిలే పరుగు పందెంలో పాల్గొని రిటైర్ అవ్వనున్నట్లు తెలిపాడు. ఈరెండుపోటీల్లో పాల్గొనేందుకు చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. బోల్ట్ రిటైర్మెంట్‌పై అమెరికాకు చెందిన స్ప్రింటర్ ప్రపంచ ఛాంపియన్ జస్టిన్ గాట్లిన్ స్పందించాడు బోల్ట్ తన నిర్ణయంపై పునాలోచించుకోవాలన్నాడు. బోల్ట్‌లో ఇంకా పరుగెత్తే సత్తా ఉందన్నాడు.

న్యూజిలాండ్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌కు చేరిన కశ్యప్, ప్రణయ్





ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రీ గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లు పారుపల్లి కశ్యప్, ప్రణయ్, సౌరవ్ వర్మ, సిరిల్ వర్మలు ప్రీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. బుధవారం రెండో రౌండ్‌పోరులో వారు తమప్రత్యర్థులపై విజయం సాధించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. తొలుత ప్రణయ్ 23-21, 21-18 తేడాతో ఇండోనేషియా క్రీడాకారుడు అబ్దుల్లా కొలిక్‌పై పోరాడి గెలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా, కశ్యప్ 21-9, 21-8 తేడాతో న్యూజిలాండ్ క్రీడాకారుడు ఒస్కార్‌గుపై సునాయాసంగా విజయం సాధించి ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. ఇక సౌరవ్ 21-16, 21-16తో ఇండోనేషియాక్రీడాకారుడు ఖోవిబోవుపై, సిరిల్‌వర్మ 21-14, 21-16తో ఇండోనేషియా క్రీడాకారుడు విక్కీ అంగ్గాపై గెలుపొంది ప్రీక్వార్టర్‌లోకి ప్రవేశించారు.

జడేజా ఛాలెంజ్‌ని స్వీకరించిన కబడ్డీ ఆటగాళ్లు

న్యూఢిల్లీ: ఐపిఎల్ 10వ సీజన్‌లో భారత క్రికెటర్లు న్యూలుక్‌తో అదరగొట్టారు. 'బ్రేక్ ద బియర్డ్' సవాలును స్వీకరించి కొత్త లుక్‌తో అభిమానులను అలరించారు. తాజాగా ఈ ఛాలెంజ్‌కి ప్రో కబడ్డీ 5 సీజన్ ఆటగాళ్లు ఆకర్షితులయ్యారు. దీంతో వారు బ్రేక్ ద బియర్డ్ ఛాలెంజ్ స్వీకరించారు. సహచర ఆటగాళ్లకు సవాలు విసురుతూ సరికొత్త లుక్‌తో అదరగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఐపిఎల్‌లో రవీంద్ర జడేజా తొలుత ఈ ఛాలెంజ్ స్వీకరించి సహచర ఆటగాళ్లకు సవాలు విసిరాడు. దీంతో శిఖర్ ధావన్, హార్ధిక్ పాండ్యా, సురేశ్ రైనా ఈ ఛాలెంజ్‌లో పాల్గొని కొత్త లుక్‌లో కనిపించారు. ప్రొ కబడ్డీ లీగ్-5వ సీజన్ జూలై 28న ప్రారంభమైన విషయం తెలిసిందే. తాజాగా యూ ముంబా జట్టు సారథి అనూప్ కుమార్ బ్రేక్ ద బియర్డ్ ఛాలెంజ్‌ని స్వీకరించి సహచర ఆటగాళ్లకు సవాలు విసిరాడు.

తాను ఈ ఛాలెంజ్‌ని స్వీక రించినట్లు అనూప్ ఓ వీడియోను సోషల్‌మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. అం తేకాదు తన సరికొత్త లుక్‌ను చూపించాడు. అనూప్ నాయకత్వంలోని యూ ముంబా జట్టు ఇప్పటవరకు ఆడిన రెండుమ్యాచ్‌ల్లో ఒక విజయం మా త్రమే నమోదు చేసుకుంది. తన తదుపరి మ్యాచ్‌లో యూ ముంబా దబాంగ్ ఢిల్లీలో ఈనెల 5న నాగ్‌పూర్‌లో తలపడనుంది.



కోహ్లినే అల్టిమేట్ బాస్, కోచ్‌గా నా పరిధి తెలుసు

టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి



న్యూఢిల్లీ: జట్టు విజయాలు సాధించాలంటే కెప్టెన్, కోచ్ మధ్య సత్సంబంధాలు చాలా అవసరమని టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. అనిల్ కుంబ్లే రాజీనామా అనంతరం ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిశాస్త్రి తనదైన శైలిలో జట్టుకు కోచింగ్ ఇవ్వడం మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అంతేకాదు గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులోనే ఆటగాళ్ల తీరుతో ఎంతో మార్పు తీసుకొచ్చాడు. మురళీ విజయ్ గాయం కారణంగా కొన్ని నెలల తర్వాత మళ్లీ టెస్టు జట్టులో స్థానం దక్కించుకున్న శిఖర్ ధావన్ గాలె టెస్టులో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో సెంచరీ చేయగా, ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న కోహ్లీ సైతం సెంచరీతో రాణించేలాచేశాడు. ముఖ్యంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లకి స్వేచ్ఛనిస్తూ తనదైన శైలిలో కోచింగ్ ఇవ్వడం మొదలు పెట్టాడు. మూడుటెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్-శ్రీలంక జట్ల మధ్య కొలంబో వేదికగా గురువారం నుంచి రెండోటెస్టు ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో రవిశాస్త్రి మీడియాతో మాట్లాడాడు. కెప్టెన్, కోచ్ ఇద్దరూ ఒకే తరహాలో ఆలోచన కలిగి ఉండాలా? ఒకవేళ లేకపోతే ఎవరు సర్దుకోవాలి అని రవిశాస్త్రిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. కోచ్, కెప్టెన్ మధ్య సత్సంబంధాలు చాలాఅవసరం. ఇవి ఏ మాత్రం చెడినా, జట్టు ప్రదర్శన దెబ్బతింటుంది. నా వరకు తీసుకుంటే, కోహ్లీతో నాకు మంచి అనుబంధం ఉందనిచెప్పాడు. గతంలో నేను 18 నెలలపాటు టీమిండియాతో కలిసి పనిచేయడం కలిసొచ్చింది. కోచ్‌గా నాపరిధి ఏంటో నాకు తెలుసు. ఇక్కడ కెప్టెన్ అల్టిమేట్‌బాస్, అతని నిర్ణయమే అంతిమం. ఎందుకంటే అతనే కదా జట్టుని మైదానంలోకి తీసుకెళ్లి వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టేది. కోచ్‌గా నేను వారిని స్వేచ్ఛగా ఆడేందుకు, ఉత్సాహంగా ఉండేందుకు మాత్రమే సలహాలు, సూచనలు ఇవ్వగలను. అతేగానీ, మైదానంలోకి బ్యాట్‌తో వెళ్లలేను కదా? కాబట్టి నా పని ఏంటంటే మ్యాచ్ కోసం జట్టును సిద్ధంచేయడమే. ఆ తర్వాత మొత్తం కెప్టెనే చూసుకుంటాడు అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

కొలంబో టెస్టులో ఓపెనర్‌గా కెఎల్ రాహుల్

మరో ఓపెనర్‌గా ధావన్, అభినవ్‌లలో ఎవరో ఒకరు



కొలంబో: వైరల్ ఫీవర్ కారణంగా లంకతో జరిగిన తొలిటెస్టుకు దూరమైన రెగ్యులర్ ఓపెనర్ కెఎల్ రాహుల్ కొలంబో వేదికగా జరగనున్న రెండో టెస్టుకి ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో గురువారం నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్టులో కెఎల్ రాహుల్ ఆడుతున్నట్లు కెప్టెన్ కోహ్లీ స్పష్టం చేశాడు. రెండో టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం విరాట్ కోహ్లీ మీడియాతో మాట్లాడాడు. దీంతో కొలంబో టెస్టులో కేఎల్ రాహుల్ తుది జట్టులో ఉంటాడని కోహ్లీ పేర్కొన్నాడు. రాహుల్ జట్టులోకి చేరాడు. అతనితో కలిసి శిఖర్‌ధావన్, అభినవ్ ముకుంద్ ల్లో ఒకరు ఆడతారు అని కోహ్లీ అన్నాడు. గత రెండేళ్లలో చాలా మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. కొన్ని సీజన్‌ల నుంచి రాహుల్ ప్రదర్శనలో నిలకడ పెరిగింది. ప్రస్తుత భారత టెస్టు జట్టులో రాహుల్ కీలక ఓపెనర్, శ్రీలంకతో జరిగే రెండో టెస్టులో రాహుల్ ఆడతాడు అని కోహ్లీ స్పష్టం చేశాడు. కొలంబో పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉందని ఛైనామన్ బౌలర్ కులదీప్ యాదవ్‌ను ఆడించే సంగతి ఇప్పుడే చెప్పలేమని కోహ్లీ అన్నాడు. జట్టులో ఎవరెవరు ఉంటారో ముందే వెల్లడిస్తే ప్రత్యర్థికి ఆశ్యర్యంగా ఉండదని చెప్పాడు. పిచ్‌పై ఫలితం వచ్చే అవకాశాలున్నాయని అది తమలో ఉత్సాహం నింపుతోందని కోహ్లీ పేర్కొ న్నాడు. అయితే కేఎల్ రాహుల్‌తో ధావన్, ముకుంద్‌లలో ఎవరు ఓపెనింగ్ బరిలోకి దిగురా తనే విషయమై కోహ్లీ స్పష్టత ఇవ్వలేదు. గాలె టెస్టుకి వైరల్ ఫీవర్ కారణంగా కేఎల్ రాహుల్ దూరమవ్వడంతో అతడి స్థానంలో అభినవ్ ముకుంద్ తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. గాలె టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ధావన్ 190 పరుగులతో సెంచరీతో రాణించగా, రెండో ఇన్నింగ్స్‌లో అభినవ్ ముకుంద్ 81 పరుగులు చేశాడు. దీంతో అభినవ్ ముకుంద్‌ని తప్పించే అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి.

శ్రీలంక క్రికెట్ మ్యాచ్‌లను చూడను : రణతుంగ



కొలంబో: శ్రీలంక క్రికెట్‌లో చీదరించుకునే వాతావరణం నెలకొందని ఆ దేశ మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. 2011 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్-శ్రీలంక జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఫిక్సింగ్ అయిందంటూ ఇటీవలే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. శ్రీలంక జట్టు ఆడే మ్యాచ్‌లను చూడనంటూ బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ పరిపాలనలో ఉన్న అసహ్యకరమైన వాతావరణమే తనను తమ మ్యాచ్‌లు చూడకుండా చేస్తోందని రణతుంగ పేర్కొన్నాడు. మా జట్టు ఏ సిరీస్ ఆడుతున్నా చూసే ఆసక్తిమాత్రం నాకు లేదు అని సియోలోన్ టుడే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా-ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌ను చూస్తున్నానని రణతుంగ పేర్కొన్నాడు. శ్రీలంక క్రికెట్‌లో ప్రక్షాళన కోసం తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయాలంటూ ఆదేశ ప్రధాని రాణిల్ విక్రమ్ సింఘేకు రణతుంగ లేఖ రాస్తానని వెల్లడించారు.

టీమిండియాను ఢీకొనేటప్పుడు రిస్క్ తప్పదు



కొలంబో: భారత్ లాంటి కఠినమైన ప్రత్యర్థిని ఎదుర్కొనేటప్పుడు రిస్క్ తీసుకోక తప్పదని శ్రీలంక టెస్టు కెప్టెన్ దినేశ్ ఛండీమాల్ అభిప్రాయపడ్డారు. తొలి టెస్టుకి జ్వరం కారణంగా దూరమైన ఛండీమాల్ గురువారం నుంచి భారత్‌తో జరగనున్న రెండో టెస్టుకి నాయకత్వం వహించనున్నాడు. గాలె టెస్టులో అసలె గుణరత్నె, స్పిన్నర్ హెరాత్ గాయపడటంతో శ్రీలంక ప్రదర్శన పేలవంగా మారింది. దీంతో భారత్ చేతిలో 304 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. రెండో టెస్టు సందర్భంగా మీడియాతో చండీమాల్ మాట్లాడాడు. గాలె టెస్టు ఓటమిని తొందరగా మరిచిపోయేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ మ్యాచ్ తప్పిదాలను దిద్దుకుని సిరీస్‌లో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం. జట్టు సభ్యులందరికీ కూడా నేను ఇదే చెప్తున్నా భారత్ లాంటి కఠినమైన ప్రత్యర్థితో ఆడే సమయంలో కొన్నిసార్లు రిస్క్ తీసుకోక తప్పదు. రెండేళ్ల క్రితం అదే గాలె టెస్టులో నేను భారత్‌బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ, రిస్క్ తీసుకుని శతకం బాదాను. ఆమ్యాచ్‌లో చివరికి శ్రీలంక విజయం సాధించింది. ఈసిరీస్ కోసం ఆదుకుడునే ప్రదర్శిస్తానని ఛండీమాల్ ధీమా వ్యక్తం చేశారు.

టాక్సీలో వెళ్లిన దాదా..



కోల్‌కతా: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరవ్ గంగూలీ ఎంత సంపన్నుడో అందరికీ తెలిసిందే. అభిమానులు అతన్ని ప్రిన్స్ ఆఫ్ కోల్‌కతా అని ముద్దుగా పిలుచుకుంటారు. తాజాగా దాదా ఓ ముఖ్యమైన సమావేశానికి హాజరయ్యేందుకు తన లగ్జరీ బిఎండబ్ల్యులో వెళ్తుండగా కారులో సమస్య తలెత్తింది. దీంతో అతను క్యాబ్‌ను ఆశ్రయించాడు. అసలేం జరిగిందంటే మంగళవారం బిసిసిఐ పర్యటనల ప్రణాళిక కమిటీ సమావేశమైంది. ఈకమిటీకి గంగూలీ అధ్యక్షుడు. సమావేశానికి హాజరయ్యేందుకు గంగూలీ తన ఇంటి నుంచి బిఎండబ్ల్యు కారులో బయిలుదేరాడు. మధ్యలో కారు బ్రేకింగ్ సిస్టమ్‌లో సమస్య తలెత్తింది. సమావేశానికి ఆలస్యం అవుతుందని భావించిన గంగూలీ వెంటనే క్యాబ్‌ను ఆశ్రయించి నిర్ణీత సమయంలో గమ్యస్థానానికి చేరిపోయాడు. దీనిపై గంగూలీ మాట్లాడుతూ మార్గమధ్యంలో కారులో సమస్యల తలెత్తింది. కమిటీ సభ్యులతో సమావేశం చాలా ముఖ్యమైనది. దీంతో వెంటనే క్యాబ్ సర్వీసును ఆశ్రయించాను అని తెలిపారు.

తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో ఓటమి

బెంగాల్ వారియర్స్ చేతిలో చిత్తు

హైదరాబాద్: ప్రో కబడ్డీ 5వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు వరుస ఓటములతో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే బెంగుళూరు, పాట్నా,యుపి జట్లపై ఓడిపోయిన తెలుగు టైటాన్స్ తాజాగా బుధవారం బెంగాల్ వారియర్స్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. టోర్నీలో భాగంగా బెంగాల్ జట్టు తెలుగు టైటాన్స్ మధ్య జరిగిన పోరులో పై 30-24 తేడాతో బెంగాల్ జట్టు విజయం సాధించింది. టైటాన్స్ జట్టు 16 రైడ్ పాయింట్లు, 7 టాకిల్ పాయింట్లు, ఒక అదనపు పాయిం ట్ సాధించగా...బెంగాల్ జట్టు 19 రైడ్ పాయింట్లు, 6 టాకిల్ పాయింట్లు, రెండు ఆల్ అవుట్ పాయింట్లు, మూడుఅదనపు పాయింట్లు సాధించింది. తెలుగు టైటాన్స్‌లో వికాస్ అత్యధికంగా 9పాయింట్లు సాధించగా...రాహుల్ చౌదరి,నీలేష్ సలుంకే చెరో ఐదు పాయింట్లు సాధించారు. బెంగాల్ జట్టులో మనిందర్ సింగ్ అత్యధికంగా 11 పాయింట్లు సాధించగా... జంగ్ 8పాయింట్లు సాధించాడు. తొలి అర్ధభాగంలో బెంగాల్ 19 పాయింట్లు సాధించగా...తెలుగు టైటాన్స్14 పాయింట్లుతో సాధించింది. మలి అర్ధభాగంలో బెంగాల్ 11 పాయింట్లు సాధించగా...తెలుగు టైటాన్స్10 పాయింట్లు సాధించింది. దీంతో బెంగాల్ జట్టు 6 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది.



బుధవారం హైదరాబాద్‌లో వివో ప్రోకబడ్డీ సందర్భంగా గుజరాత్ పార్చ్యునేట్లు, హార్యానా స్టీలర్స్ తలపడుతున్న దృశ్యం

గాయంతోనే ఫైనల్ వరకూ హర్మన్‌ప్రీత్

టోర్నీ మధ్యలో వచ్చేద్దామనుకున్నా

న్యూఢిల్లీ: ఐసిసి మహిళల ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై సంచలన ఇన్నింగ్స్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ వెలుగులోకి వచ్చింది. సెమీస్‌లో భీకర హిట్టింగ్‌తో 171 పరుగులు చేసి ఒంటిచేత్తో భారత జట్టుని ఫైనల్‌కు చేర్చింది. టోర్నీ ఆరంభంలోనే హర్మన్‌ప్రీత్ కౌర్ గాయపడినా బాధని పంటిబిగువున భరిస్తూ ఫైనల్లోనూ అర్ధశతకం బాది జట్టు పరువు నిలిపింది. తాజాగా ప్రపంచకప్ విశేషాలను మీడియాతో పంచుకుంటూ గాయంతో తాను టోర్నీ మొత్తం ఆడిన విషయాన్ని వెల్లడించింది. టోర్నీ లీగ్ దశలో భాగంగా వెస్టిండీస్‌తో రెండో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా నా ఎడమచేతి వేలికి తీవ్ర గాయమైంది. ప్రథమ చికిత్స చేసిన అనంతరం జట్టు ఫిజియో విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించారు. కానీ, అప్పటికీ భారత్ జట్టు సురక్షితమైన స్థితిలో లేదు. దీంతో, నేను మళ్లీ మైదానంలోకి వెళ్లి రెండు వికెట్లు పడగొట్టాను. సంతోషించాల్సిన విషయం ఏంటంటే ఆ మ్యాచ్‌లో నేను బ్యాటింగ్ చేయాల్సిన అవసరం రాలేదు. ఆగాయంతోనే టోర్నీ మొత్తం ఆడాను అని హర్మన్‌ప్రీత్ కౌర్ వెల్లడించింది. గాయంతో హర్మన్‌ప్రీత్ చేతి వేలు వంకరగా మారింది. దీంతో వేలు సాధారణ స్థితికి వచ్చేందుకు డాక్టర్లు ఒక క్లాంప్‌ని అమర్చారు అని ఆమె తండ్రి హర్మందర్ బుల్లార్ వివరించారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/15-17 **Air Surcharge:** Delhi : 40 Ps.